# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 239 | హైదరాబాద్ | సోమవారం 16-03-2026 | పేజీలు : 12 | వెల : 1.00



11లో

రేషన్ కార్డుదారులకు శుభవార్త.. మార్చి 17 వరకు అవకాశం..

## ఆత్మ శుద్ధి చేసుకునే పండగే రంజాన్

: సీఎం రేవంత్ రెడ్డి

- ఎల్బీ స్టేడియం ఇఫ్తార్ విందులో సీఎం రేవంత్ రెడ్డి

11లో



## మోగిన ఎన్నికల నగారా..

- 4 రాష్ట్రాలు, పుదుచ్చేరి ఎన్నికల తేదీలు ప్రకటన..
- 4 రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతం అసెంబ్లీకి ఎన్నికలు..
- తేదీలను ప్రకటించిన కేంద్ర ఎన్నికల సంఘం..

11లో



# మిస్టర్ రంగనాథ్..
# నీపై పరువు నష్టం దావా వేస్తా

- ఆదిత్య కన్‌స్ట్రక్షన్ కబ్జాకు పాల్పడిందని నువ్వే గతంలో లెటర్ రాశావు
- అవే ఆరోపణలతో నేను ధర్నా చేస్తే బద్నాం చేస్తావా?
- తప్పుడు సమాచారంతో ట్విట్టర్ లో వీడియోలు పెడతవా?
- మీ తప్పులను ఎత్తి చూపిన.. నీ ప్రభుత్వం, నువ్వు దూకి చావాలి.
- మొన్నటి ప్రజెంటేషన్ లో ప్రజలకు ఎలా మేలు చేస్తారో చెప్పలేదు

11లో



## ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం..

- మారనున్న విశాఖ రూపురేఖలు..
- ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టే వ్యూహం..
- మంత్రి కీలక వ్యాఖ్యలు..

11లో





11లో

## తెలంగాణ రైతులకు శుభవార్త..

- తెలంగాణ రైతులకు శుభవార్త
- తెలంగాణలో ఈనెల 22న రైతు భరోసా మొదటి విడత నిధులు విడుదల
- 70 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి రూ.3,590 కోట్ల నిధులు బదిలీ
- సిద్దిపేట జిల్లా నర్మెట్టలో తొలి విడత నిధులు విడుదల చేయనున్న సీఎం రేవంత్.

## తిరుమలలో మండువేసవిలో మంచు..

- మార్చిలో తిరుమల కొండలను కమ్మేసిన పొగమంచు
- వేసవిలో శీతాకాలాన్ని తలపించిన వాతావరణం
- ఘాట్ రోడ్లపై దట్టమైన మంచుతో భక్తుల ఆనందం
- అపురూప దృశ్యాలను ఆస్వాదిస్తున్న భక్తులు

11లో



## ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూను వెంటాడి చంపుతాం..
## .. ఇరాన్ వార్నింగ్..

- ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూను చంపేస్తాం..
- వార్నింగ్ ఇచ్చిన ఇరాన్..

11లో




## నామిశ్రీ ఆరియాలో ప్లాట్లు కొంటే
# మోసపోవాల్సిందే..!

- నాగోల్ బండ్లగూడ లో జరుగుతున్న వేలకోట్ల అవినీతి రియల్ ఎస్టేట్ మోసం
- రూ. 1,000 కోట్ల ప్రభుత్వ భూమిని మింగేసిన నమిశ్రీ కబ్జా రాయుళ్లు..
- అనుమతులు సర్వే నంబర్ 121లో.. నిర్మాణాలు మాత్రం అటవీ భూమిలో!
- నకిలీ స్కెచ్‌లతో అధికారులను బురిడీ కొట్టించిన రియల్ ఎస్టేట్ మాఫియా
- ఫిర్యాదు చేసి సంవత్సరం గడిచినా పట్టించుకోని అధికార గణం,
- హెచ్.ఎం.డీ.ఏ, టౌన్ ప్లానింగ్ అధికారులు, నాగోల్ సర్కిల్ ఎల్బీనగర్ జోన్ అధికారులు, రెవెన్యూ ఫారెస్ట్ అధికారులు, ముడుపులకు అమ్ముడుపోయారా ..!
- ప్లాట్లు కొనే సామాన్య మధ్యతరగతి ప్రజలను తడిగుడ్డుతో గొంతు కోస్తున్న నామిస్త్రీ దొంగలు..
- విజిలెన్స్, ఏసీబీ, నిఘా విభాగాల చర్యలు ఎక్కడ..?
- అవినీతికి చెక్ పెట్టే రియల్ ఎస్టేట్ రెగ్యులేటివ్ అథారి "రేరా" చర్యలు ఎక్కడ..?
- మల్కాజ్గిరి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, మున్సిపల్ శాఖ మాత్యులు సీఎం రేవంత్ రెడ్డి, ఈ అవినీతి పై దృష్టి సారించాలి..

(ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ అందిస్తున్న ప్రత్యేక కథనం)

"కంచె చేను మేసిన చందాన, ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అధికారులే అక్రమాలకు కొమ్ముకాయడం దారుణం. కాగితాల్లో ఒక చోట, క్షేత్రస్థాయిలో మరోచోట నిర్మాణాలను చేపట్టి, సామాన్యుల జీవితాలను రియల్ ఎస్టేట్ మాఫియా పణంగా పెడుతోంది. అనుమతుల్లోని అవకతవకలు, అధికారుల మౌనం వెనుక ఉన్న 'ముడుపుల' బాగోతం వెలుగులోకి రావాలి. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటేనే, మధ్యతరగతి ప్రజల కష్టార్జితానికి రక్షణ లభిస్తుంది."

12లో



భారత శక్తి

# ఢిల్లీలో దోస్తీ... గల్లీలో కుస్తీ

ప్రస్తుతం భారత రాజకీయాల్లో 'శత్రువుకు శత్రువు మిత్రుడు' అనే సూత్రం విపక్షాల ఐక్యతకు దిక్సూచిగా మారింది. ఇండీ కూటమిలో అంతర్గత విభేదాలు ఉన్నప్పటికీ, లోక్‌సభ స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం మరియు సీఈసీపై అభిశంసన తీర్మానం వంటి అంశాలు విపక్షాలను ఏకం చేయడానికి రాజకీయ అస్త్రాలుగా దొరికాయి. ఇవి కేవలం తీర్మానాలు మాత్రమే కావు, విపక్షాల ఐక్యతకు ఒక 'లిట్మస్ టెస్ట్' వంటివి. సంఖ్యాబలం లేకపోయినా ప్రభుత్వాన్ని డిఫెన్స్‌లో నెట్టగలమనే ఆత్మవిశ్వాసాన్ని ఇవి విపక్షాల్లో నింపాయి. అయితే, ఢిల్లీ స్థాయిలో కనిపిస్తున్న ఈ ఐక్యత రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల దగ్గరకు వచ్చేసరికి మాయమవుతోంది. బెంగాల్‌లో మమత వర్సెస్ కాంగ్రెస్-లెఫ్ట్, కేరళలో ఎల్డీఎఫ్ వర్సెస్ యూడీఎఫ్ పోరు విపక్షాల ద్వంద్వ వైఖరిని స్పష్టం చేస్తోంది. సీట్ల సర్దుబాటు, ప్రాంతీయ అస్తిత్వ పోరాటాలు ఈ కూటమికి పెను సవాలుగా మారాయి. తమిళనాడు, మహారాష్ట్రలో పొత్తులు బలంగా ఉన్నప్పటికీ, పంజాబ్, కేరళ, బెంగాల్ వంటి రాష్ట్రాల్లో విపక్షాల మధ్య 'పగటి పూట స్నేహం - రాత్రి పూట యుద్ధం' అనే చందంగా రాజకీయాలు సాగుతున్నాయి. శత్రువుకు శత్రువు మిత్రుడు అవుతారంటారు. ప్రస్తుతం దేశ రాజకీయాలు ఈ సమీకరణంతోనే నడుస్తున్నాయి. ముఖ్యంగా విపక్ష కూటమి. పైకి చూస్తే ఎవరికి వారే అన్నట్టుగా కనిపిస్తున్నా.. రాజకీయ శత్రువు కళ్ల ముందు కనిపించే సరికి.. ఏకం అవ్వాలనే కసి పెరుగుతోంది. నిజానికి, విపక్షాలకీ కలవాలనుంది. కలవడానికి బలమైన కారణాలూ ఉన్నాయ్. ఇండీ కూటమి విచ్ఛిన్నమైనా విపక్షాల్ని ఏకం చేయడానికి అస్త్రాలు వరుసగా దొరుకుతున్నాయ్. అందులో మొదటిది లోక్‌సభ స్పీకర్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానం. అఫ్‌కోర్స్ ఆ తీర్మానం వీగిపోయింది. రెండ్రోజుల చర్చ తరువాత.. బుధవారం సాయంత్రం నాటి ఓటింగ్‌లో మూజువాణి ఓటుతో ఆ తీర్మానాన్ని తిరస్కరించింది లోక్‌సభ. నిజానికీ ఈ తీర్మానం వీగిపోతుందని విపక్షానికి కూడా తెలుసు. కాకపోతే.. అందులో ఓ రాజకీయ వ్యూహం ఉంది. ఇండీ కూటమి ఐక్యతకు అదో లిట్మస్ టెస్ట్ లాంటింది. ఈ తీర్మానం విపక్షాల మధ్య ఉన్న అంతర్గత విభేదాలను పక్కన పెట్టి, వారిని ఒకే తాటిపైకి తెచ్చింది. ఎలా చెప్పగలరు అలా అంటే.. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, సమాజ్‌వాదీ పార్టీలు కలిసి ఉమ్మడిగా నోటీసు ఇచ్చాయి. తీర్మానంపై చర్చ జరిగినప్పుడు కూడా ఒక్కటిగానే నిలబడ్డాయి. ఓటింగ్ సమయంలో కలిసే ఉండాలని మాట్లాడుకున్నాయి. ఓవరాల్‌గా.. సీట్ల సర్దుబాటులో సమస్యలు ఉన్నప్పటికీ.. బీజేపీ వ్యతిరేక పోరాటంలో తామంతా ఒక్కటేననే సంకేతాన్ని ప్రజల్లోకి పంపాయి విపక్షాలు. అటు బెంగాల్ లో మాత్రం పశ్చిమ బెంగాల్‌లో ఒకప్పుడు తిరుగులేని శక్తిగా వెలిగిన వామపక్షాలు, కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు తమ ఉనికిని చాటుకోవడంతో పాటు మమతా బెనర్జీని గద్దె దించడమే పరమావధిగా ముందుకు సాగుతున్నాయి. గత ఎన్నికల్లో సున్నా స్థానాలకే పరిమితమైన ఈ కూటమి, ఈసారి క్షేత్రస్థాయిలో టీఎంసీ వ్యతిరేక ఓటును బీజేపీ వైపు మళ్లకుండా తమ వైపు తిప్పుకోవాలని చూస్తోంది. ముఖ్యంగా తృణమూల్ ప్రభుత్వంపై ఉన్న అవినీతి ఆరోపణలు, నిరుద్యోగ సమస్యలను అస్త్రాలుగా చేసుకుని మమతా కంచుకోటలను బద్దలు కొట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. మమతా బెనర్జీకి అండగా నిలిచే మైనారిటీ , గ్రామీణ ఓటు బ్యాంకును దెబ్బతీయడం ఈ కూటమి ప్రధాన ఉద్దేశం. గతంలో కాంగ్రెస్‌కు పట్టున్న మాల్దా, ముర్షిదాబాద్ వంటి జిల్లాల్లో టీఎంసీని అడ్డుకుంటే, రాష్ట్రస్థాయిలో మమతా ప్రాభవం తగ్గుతుందని వీరి అంచనా. మమతా బెనర్జీకి వ్యతిరేకంగా మాట్లాడే ప్రతి ఓటు తమకే పడాలని, తద్వారా టీఎంసీని బలహీనపరిచి మళ్లీ రాష్ట్రంలో తాము ఒక నిర్ణయాత్మక శక్తిగా ఎదగాలని లెఫ్ట్-కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. ఈ టాస్క్ లో భాగంగానే వీరు సంయుక్తంగా భారీ ర్యాలీలు నిర్వహిస్తూ క్యాడర్‌లో నూతనోత్సాహాన్ని నింపుతున్నారు. టీఎంసీకి వ్యతిరేకంగా నిరంతరం వీధుల్లో పోరాడుతున్న ఎస్ఎఫ్ఐ , డీవైఎఫ్ఐ వంటి యువజన సంఘాలను లెఫ్ట్ కూటమి ముందు వరుసలో నిలుపుతోంది. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో జరిగిన కుంభకోణాలను నేరుగా ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా మమతా బెనర్జీ క్లీన్ ఇమేజ్‌ను దెబ్బతీస్తున్నారు. మమతా బెనర్జీని పూర్తిగా ఓడించలేకపోయినా, ఆమెకు మ్యాజిక్ ఫిగర్ అందకుండా చేయడమే ఈ కూటమి అసలు టాస్క్. తద్వారా రాష్ట్రంలో టీఎంసీ ఏకపక్ష నిర్ణయాలకు అడ్డుకట్ట వేయవచ్చని వీరు భావిస్తున్నారు. మమతా వ్యతిరేక ఓట్లు కేవలం బీజేపీకే పడతాయనే భ్రమను తొలగించి, తటస్థ ఓటర్లను తమ వైపు తిప్పుకోవడంలో ఈ కూటమి ఎంతవరకు సఫలమవుతుందనేది బెంగాల్ భవిష్యత్తును నిర్ణయించనుంది. ఒకవేళ వీరు గణనీయమైన స్థానాలు సాధిస్తే, అది బెంగాల్ రాజకీయాల్లో మమతా శకానికి ముగింపు పలికే తొలి అడుగు అవుతుందని అనుకోవచ్చు. మరో వైపు ఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై ప్రవేశపెట్టిన తీర్మానం నోటీసులో విపక్షాలు ఏడు ప్రధాన ఆరోపణలు చేసినట్టు తెలుస్తోంది. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి పక్షపాత నిర్ణయాలు తీసుకుంటున్నారని, అనుచిత ప్రవర్తన రుజువైందని, ఎన్నికల అవకతవకలపై విచారణను ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటున్నారని, సామూహికంగా ఓటుహక్కును రద్దుచేశారని విపక్షాలు ఆరోపించాయి. కొన్ని పార్టీలకు అనుకూలంగా పక్షపాత వైఖరిని ప్రదర్శిస్తున్నారని కూడా నోటీసులో పేర్కొన్నాయి. తమ ఆరోపణలకు బలంచేకూర్చే పలు సుప్రీంకోర్టు తీర్పులను సైతం నోటీసులో ప్రస్తావించాయి. ఎస్ఐఆర్ ప్రక్రియలో కేంద్రంలోని అధికార పార్టీకి అనుకూలంగా సీఈసీ వ్యవహరిస్తున్నారని ఆరోపించాయి. రాజ్యాంగ నిబంధనల ప్రకారం సుప్రీంకోర్టు న్యాయమూర్తిని తొలగించే పద్ధతిలోనే సీఈసీని తొలగించాల్సి ఉంటుంది. ఇందుకు లోక్‌సభలో 100 మంది, రాజ్యసభలో 50 మంది సంతకాలు అవసరం.

# కూటమిలో పైన పటారం..లోన లోటారం

విజయవాడ, మార్చి 15

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రస్తుతం విచిత్రమైన పరిస్థితి కనిపిస్తోంది. రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , బీజేపీ అగ్రనేతలు అత్యంత సమన్వయంతో, ఒకే మాట - ఒకే బాట అన్నట్లుగా ముందుకు సాగుతున్నారు. కానీ, క్షేత్రస్థాయి నియోజకవర్గాల్లో మాత్రం పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. పాత కక్షలు, ఆధిపత్య పోరాటాలు కూటమి నేతల మధ్య చిచ్చు పెడుతున్నాయి. కదిరిలో బీజేపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి గృహనిర్బంధం ఘటన ఈ అంతర్గత విభేదాలకు ఒక నిలువెత్తు సాక్ష్యంగా నిలిచింది. రాజకీయేతర ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో కూడా ఒకరిపై ఒకరు ఆధిపత్యం ప్రదర్శించుకోవాలని చూడటం కూటమి భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకొనేలా చేస్తోంది. కదిరి తరహాలోనే రాష్ట్రవ్యాప్తంగా పలు నియోజకవర్గాల్లో ఈ హైపర్ లోకల్ పోరు ముదురుతోంది. దాదాపుగా అన్ని నియోజకవర్గాల్లో తమకు కనీస గౌరవం దక్కడం లేదని ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే పార్టీ కాకుండా ఇతర పార్టీల నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. నిడదవోలు, తిరుపతి సహా చాలా చోట్ల ఇలాంటివి బహిరంగ వివాదాలకు కారణం అయ్యాయి. మెజార్టీ నియోజకవర్గాల్లో పార్టీల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. పాత ప్రత్యర్థులుగా ఉన్న నేతలు ఇప్పుడు ఒకే గొడుగు కిందకు వచ్చినా, మనసులు మాత్రం కలవలేదని ఈ సంఘటనలు నిరూపిస్తున్నాయి. నామినేటెడ్ పోస్టుల పంపిణీ విషయంలో కూడా కింది స్థాయి కార్యకర్తల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. జనసేన , బీజేపీ శ్రేణులు తమకు తగిన ప్రాధాన్యత దక్కడం లేదని భావిస్తుంటే, పదేళ్ల పాటు ప్రతిపక్షంలో ఉండి పోరాడిన తమను కాదని కొత్తగా వచ్చిన వారికి ప్రాముఖ్యత ఇస్తున్నారని టీడీపీ క్యాడర్ ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఈ పవర్ షేరింగ్ చిక్కుముడిని విప్పకపోతే, అది రాబోయే రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ ఆధిపత్య పోరాటం ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలకు కూడా పాకుతున్నాయి. కదిరి రథోత్సవంలో విష్ణువర్ధన్ రెడ్డికి పర్మిషన్ లేదని టీడీపీ ఎమ్మెల్యే హుకుం జారీ చేయడం, బీజేపీ-టీడీపీల మధ్య ఉన్న దూరాన్ని పెంచింది. ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు వైసీపీ వంటి ప్రతిపక్షాలు దీన్ని అస్త్రంగా మార్చుకుని, కూటమిలో ఐక్యత లేదు అనే ప్రచారాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నాయి. ఇది కూటమి ప్రభుత్వం సాధిస్తున్న అభివృద్ధి ఫలాలను ప్రజలు గుర్తించకుండా చేస్తోంది. పై స్థాయిలో ఎంత ఐక్యత ఉన్నా, కింది స్థాయిలో కార్యకర్తలు, నాయకుల మధ్య సయోధ్య లేకపోతే అది సమస్యగా మారుతుంది. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, మాధవ్ వెంటనే జోక్యం చేసుకుని నియోజకవర్గ స్థాయి సమన్వయ కమిటీలను పటిష్టం చేయకపోతే, ఈ ఆధిపత్య పోరాటం చిలికి చిలికి గాలివానలా మారి కూటమిని ఇబ్బందుల్లోకి నెట్టే ప్రమాదం ఉందన్న భావన వ్యక్తమవుతోంది.
స===

# ఇండియాలో ఫస్ట్...

## మారిటైమ్ షిప్‌బిల్డింగ్ అండ్ సిస్టమ్స్ సెంటర్

నెల్లూరు మార్చి 15

ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతం మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు వేదిక అయింది. దేశీయ సముద్ర సాంకేతికత , రక్షణ రంగ ఉత్పత్తిని బలోపేతం చేసే దిశగా, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ సమీపంలో ప్రపంచంలోనే మొట్టమొదటి అటానమస్ మారిటైమ్ షిప్‌బిల్డింగ్ అండ్ సిస్టమ్స్ సెంటర్ ఏర్పాటు కానుంది. సాగర్ డిఫెన్స్ ఇంజనీరింగ్ సంస్థ, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో బోగోలు మండలం బంగాళాఖాతం తీరంలో ఈ కేంద్రాన్ని నిర్మిస్తోంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి భూమిపూజ నారా లోకేష్ చేతుల మీదుగా జరిగింది. దాదాపు 29.58 ఎకరాల విస్తీర్ణంలో మొదటి విడతగా చేపడుతున్న ఈ ప్రాజెక్టులో స్వయంప్రతిపత్తి కలిగిన నౌకల నిర్మాణం , పరిశోధన మరియు అభివృద్ధి , షిప్ మెయింటెనెన్స్ అండ్ రిపేర్ వంటి అత్యాధునిక సౌకర్యాలు ఒకే ప్రాంగణంలో ఉండనున్నాయి. ప్రధానంగా రక్షణ, వాణిజ్య , తీరప్రాంత భద్రతా అవసరాల కోసం మానవరహిత ఉపరితల నౌకలు, అటానమస్ అండర్ వాటర్ వెహికల్స్ డిజైన్ చేయడం, నిర్మించడంపై ఈ కేంద్రం దృష్టి సారించనుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెరైన్ రోబోటిక్స్ వంటి అధునాతన సాంకేతికతలను ఇక్కడ వినియోగించనున్నారు. ఈ కేంద్రం ఏర్పాటుతో రక్షణ రంగంలో భారత్ స్వయం సమృద్ధి సాధించడమే కాకుండా, స్థానిక ఆర్థిక వ్యవస్థకు కూడా భారీ ఊతం లభించనుంది. దీని ద్వారా దాదాపు 300 మందికి పైగా ఇంజనీర్లు, నేవల్ ఆర్కిటెక్టులు , ఇతర సాంకేతిక నిపుణులకు ప్రత్యక్షంగా ఉపాధి లభించనుంది. అంతేకాకుండా, ఇక్కడి ఎంఆర్‌ఓ ఫెసిలిటీ వల్ల స్థానిక మత్స్యకారుల బోట్లు, కోస్ట్‌గార్డ్ , నేవీ నౌకల మరమ్మతులు వేగంగా జరిగి, పనిదినాల నష్టం తగ్గుతుంది. మత్స్యకారులకు రియల్ టైమ్ ఫిష్ లొకేషన్ మ్యాప్స్, శాటిలైట్ వెదర్ అలర్ట్స్ వంటి సాంకేతిక సాయం కూడా అందనుంది. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవతో ఈ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌కు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కేంద్రం అందుబాటులోకి వస్తే నెల్లూరు జిల్లా అంతర్జాతీయ సముద్ర సాంకేతిక చిత్రపటంలో కీలక స్థానాన్ని ఆక్రమిస్తుంది. అత్యాధునిక సెన్సార్ ఇంటిగ్రేషన్, నావిగేషన్ సిస్టమ్స్ మరియు రిమోట్ కంట్రోల్ టెక్నాలజీలతో రూపొందే ఈ నౌకలు సముద్ర నిఘా, మైన్ డిటెక్షన్ , లాజిస్టిక్స్ సపోర్ట్ వంటి కీలకమైన కార్యకలాపాల్లో దేశానికి రక్షణ కవచంలా మారనున్నాయి

=============

# రామయ్య కళ్యాణానికి అంతా సిద్ధం

కడప, మార్చి 15

మార్చి 26 గురువారం నుంచి ఏప్రిల్ 05 ఆదివారం వరకు ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. ఏప్రిల్ 1 సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు శ్రీ సీతారాముల కళ్యాణం జరుగుతుందికడప జిల్లా ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి



ఆలయంలో మార్చి 26 నుంచి ఏప్రిల్ 05 వరకు శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరగనున్నాయి. ఇందులో భాగంగా ఆలయంలో మార్చి 24న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, మార్చి 26న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరగనుంది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రోజూ ఉదయం 7.30 నుంచి 9.30 గంటల వరకు, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు వాహన సేవలు కన్నులపండువగా నిర్వహిస్తారు

బ్రహ్మోత్సవాల్లో వాహనసేవల వివరంగా

2026 మార్చి 27 శుక్రవారం ఉదయం 9.30 నుంచి 10.15 గంటల వరకు వృషభ లగ్నంలో ధ్వజారోహణం

ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు శ్రీరామనవమి ఆస్థానం

సాయంత్రం 4 గంటల నుంచి పోతన జయంతి, కవి సమ్మేళనం జరుగుతుంది

ఇదే రోజు రాత్రి శేష వాహనంపై స్వామివారు విహరిస్తారు

మార్చి 28 శనివారం ఉదయం వేణుగానాలంకారం, శనివారం రాత్రి హంస వాహన సేవ

మార్చి 29 ఆదివారం ఉదయం వటపత్రశాయి అలంకారం, ఆదివారం రాత్రి సింహ వాహన సేవ

మార్చి 30 సోమవారం ఉదయం నవనీత కృష్ణాలంకారం, సోమవారం రాత్రి హనుమంత వాహన సేవ

మార్చి 31 మంగళవారం ఉదయం మోహినీ అలంకారం, మంగళవారం రాత్రి గరుడవాహనసేవ జరుగుతుంది

ఏప్రిల్ 1 బుధవారం ఉదయం శివధనుర్భాణ అలంకరణ, మధ్యాహ్నం 03.15 గంటలకు కాంత కోరిక, ఎదుర్కోలు ఉత్సవం. ఇదే రోజు సాయంత్రం 06.30 గంటల నుంచి 08.30 గంటల వరకు శ్రీ సీతారామ కల్యాణోత్సవం, ఈ రోజు రాత్రి గజవాహనంపై స్వామివారు భక్తులను అనుగ్రహిస్తారు

ఏప్రిల్ 02 గురువారం ఉదయం రథోత్సవం

ఏప్రిల్ 03 శుక్రవారం ఉదయం కాళీయమర్ధనాలంకారం, రాత్రి అశ్వవాహన సేవ జరుగుతుంది

ఏప్రిల్ 04 శనివారం ఉదయం చక్రస్నానం...రాత్రి ధ్వజావరోహణం.

ఏప్రిల్ 05వ తేదీ ఆదివారం సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు పుష్పయాగం నిర్వహిస్తారు


2026 మార్చి 27 శుక్రవారం శ్రీరామనవమి, భద్రాచల క్షేత్రంలో సీతారాముల కళ్యాణోత్సవం జరుగుతుంది. పౌర్ణమి రోజు ఒంటిమిట్టలో సీతారాముల కళ్యాణం జరుగుతుందికడప జిల్లా ఒంటిమిట్టలో ప్రసిద్ధి కోదండరామాస్వామి ఆలయంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతాయి. సాధారణంగా నవమి రోజు కాకుండా చైత్ర పౌర్ణమి రోజు అంటే..నవమి తర్వాత దశమి, ఏకాదశి, ద్వాదశి, త్రయోదశి, చతుర్ధశి ముగిసిన తర్వాత పౌర్ణమి రోజు వెన్నెల వెలుగులో సీతారాముల కళ్యాణం నిర్వహిస్తారు. ఏపీ ప్రభుత్వం ఈ వేడుకను అధికారికంగా నిర్వహిస్తుంది

ఈ ఏడాది ఏప్రిల్ 1 న నిండు పౌర్ణి రాత్రి వెన్నెల వెలుగుల్లో సీతారాముల కళ్యాణం జరుగుతుంది. తిరుమల తిరుపతి దేవస్థానం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా ఈ ఉత్సవాలను నిర్వహిస్తాయి. బ్రహ్మోత్సవాలు మార్చి 27 నుంచి ప్రారంభమవుతాయి.. ముందు రోజు మార్చి 26న అంకురార్పణతో ఉత్సవాలు మొదలవుతాయి. రెండో భద్రాద్రిగా పిలిచే ఒంటిమిట్టలో రామచంద్రుడు.. సీతా, లక్ష్మణులతో కొలువై ఉంటాడు. ఈ ఆలయంలో ఆంజనేయుడు ఉండడు.

# వైసీపీకి అలేఖ్య బాణం...

విజయవాడ, మార్చి 15

నందమూరి తారకరత్న భార్య అలేఖ్య రెడ్డి పొలిటికల్ ఎంట్రీ పై అప్పుడే అనేక రకాల చర్చలు ప్రారంభం అయ్యాయి. ఏమో రాజకీయాల్లోకి రావచ్చు అన్న మాటలతో నందమూరి అభిమానులతో పాటు టిడిపి మద్దతుదారులలో ఒక ఆసక్తిని రేకెత్తించింది. రాజకీయ రంగ ప్రవేశం చేయబోతున్నట్లు అలేఖ్య రెడ్డి ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చారు. అయితే ఆమె వైసీపీ మాజీ నేత, మాజీ రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డికి సమీప బంధువు. దీంతో ఆమె పొలిటికల్ ఎంట్రీ పై భిన్న కామెంట్స్ వ్యక్తమవుతున్నాయి. దీనికి తోడు అలేఖ్య రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఒకరకమైన గందరగోళానికి దారితీస్తున్నాయి. తారకరత్న మృతి చెంది మూడేళ్లు అవుతోంది. అయితే ఆమెకు అత్తింటి వారి నుంచి ఆశించిన స్థాయిలో మద్దతు లేదని ఆమె మాటల్లోనే అర్థమవుతోంది. అదే సమయంలో చంద్రబాబు, బాలకృష్ణ విషయంలో ఆమె సాఫ్ట్ గానే ఉన్నట్లు కనిపిస్తున్నారు. లోకేష్ పాదయాత్రలో పాల్గొన్న తారకరత్న అస్వస్థతకు గురయ్యారు. అనారోగ్యంతో బాధపడుతూ చనిపోయారు. కానీ ఆయన భార్య అలేఖ్య రెడ్డి మాత్రం ఒంటరిగానే ఉంటున్నారు. ఈ క్రమంలో తాజాగా కొన్ని ఇంటర్వ్యూలో రాజకీయపరమైన ప్రకటనలు చేశారు. ఆమె నందమూరి వారి కోడలు కావడంతో పొలిటికల్ ఎంట్రీ అనగానే టిడిపిలో అడుగుపెడతారని భావిస్తారు. కానీ అలేఖ్య రెడ్డి మాత్రం తాను రాజకీయాల్లోకి వస్తాను కానీ.. అందుకు ఏ పార్టీ సరైనది అని నిర్ధారించుకోలేదని చెప్పారు. అలేఖ్య రెడ్డిమాటలు చూస్తే మాత్రం ఆమె నందమూరి కుటుంబం పై అసంతృప్తితో ఉన్నట్లు కనిపిస్తున్నారు. అలేఖ్య రెడ్డిని పెద్దలకు ఇష్టం లేకున్నా ప్రేమ వివాహం చేసుకున్నారు తారకరత్న. కుటుంబ సభ్యుల సంపూర్ణ అంగీకారం లేకుండానే వారి వివాహం జరిగినట్లు ఆమె మాటల్లోనే అర్థమవుతోంది. అయితే ఇటువంటి అసంతృప్తితో ఉన్న క్రమంలో ఆమె పొలిటికల్ ఎంట్రీ ప్రకటన చేయడం మాత్రం ఆసక్తి రేపుతోంది. పైగా విజయసాయిరెడ్డి సమీప బంధువు కావడం.. ఆయన ఆ కుటుంబానికి అండగా నిలుస్తుండడం చూస్తుంటే మాత్రం ఆయనతో కలిసి ఏదైనా నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తోంది. అయితే ఈ అవకాశాన్ని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తప్పకుండా తమకు అనుకూలంగా మార్చుకోగలదు. ఎందుకంటే ఇప్పటికే లక్ష్మీపార్వతిని ఇలానే టిడిపి నాయకత్వం పై ప్రయోగిస్తోంది. ఇప్పటికే లక్ష్మీపార్వతి చంద్రబాబు తో పాటు నందమూరి కుటుంబాన్ని టార్గెట్ చేసుకుంటూ వస్తున్నారు. చంద్రబాబుపై ఘాటు వ్యాఖ్యలు చేయాలంటే నందమూరి కుటుంబం పై సాఫ్ట్ కార్నర్ తో మాట్లాడుతుంటారు. అలాగే నందమూరి కుటుంబ సభ్యులకు కూడా విమర్శలు చేస్తుంటారు. జూనియర్ ఎన్టీఆర్ విషయంలో లక్ష్మీపార్వతి కన్నీరు కారుస్తుంటారు. అందుకే ఇప్పుడు అలేఖ్య రెడ్డిని పార్టీలోకి తీసుకొని.. టిడిపి నాయకత్వంతో పాటు నందమూరి కుటుంబాన్ని టార్గెట్ చేయవచ్చు. ఇటువంటి రాజకీయాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీది అందివేసిన చేయి. అందుకే అలేఖ్య రెడ్డి పొలిటికల్ ఎంట్రీ ప్రకటన ఏపీలో హాట్ టాపిక్ అవుతోంది. ఆమె ప్రయాణం ఎలా ఉండబోతుంది? ఆమె ఎవరు వదిలిన బాణం అన్నది తెలియాల్సి ఉంది.



# అనిత ఎందుకో లాస్ట్...

5,

ఏపీలోటీడీపీ కూటమి ప్రభుత్వం దూకుడు మీద ఉంది. ఒక ప్రణాళిక ప్రకారం ప్రభుత్వ పాలన కొనసాగుతోంది. ప్రతి 15 రోజులకు మంత్రి మండలి సమావేశం. ప్రతి నెల రోజులకు ఒకసారి కలెక్టర్ల రివ్యూ కొనసాగుతూ వస్తోంది. అదే సమయంలో మంత్రులకు ర్యాంకింగ్, వారి పనితీరు మదింపు వంటి విషయంలో సీఎం చంద్రబాబు ముందు ఉంటున్నారు. వారికి ర్యాంకింగ్స్ ఇస్తున్నారు. తాజాగా కలెక్టర్ల రివ్యూలు మంత్రులకు ర్యాంకింగ్స్ ఇచ్చారు చంద్రబాబు. ఈ ర్యాంకింగ్స్ లో మంత్రి కింజరాపు అచ్చెనాయుడు తొలి స్థానంలో నిలిచారు. మంత్రి వంగలపూడి అనిత చివరి స్థానంలో ఉన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాలుగో స్థానంలో నిలిచారు. మంత్రుల శాఖలకు సంబంధించి ఫైళ్ళ క్లియరెన్స్ విషయంలో ఈ ర్యాంకింగ్స్ ఇచ్చారు సీఎం చంద్రబాబు. మంత్రుల శాఖల ప్రగతిలో ఈ ఫైల్ క్లియరెన్స్ కీలక పాత్ర పోషిస్తుంది. అందుకే సీఎం చంద్రబాబు దీనిపైనే స్పెషల్ ఫోకస్ పెడుతున్నారు. మంత్రుల పనితీరుపై మదింపు.. అమరావతిలో కలెక్టర్ల సమావేశం తొలి రోజున మంత్రుల పనితీరుపై హాట్ కామెంట్స్ చేశారు సీఎం చంద్రబాబు. ఆయా శాఖల్లో ఫైళ్ళ క్లియరెన్స్ ఎంత వేగంగా జరుగుతుందని అంశంపై మిత్రులందరికీ రేటింగ్స్ ప్రకటించారు. తొలి స్థానంలో కింజరాపు అచ్చెనాయుడు నిలిచారు. ఆ తరువాత స్థానాల్లో వరుసగా నిమ్మల రామానాయుడు, కొండపల్లి శ్రీనివాస్ ఉన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాలుగు స్థానంలో నిలిచారు. మంత్రి వంగలపూడి అనిత చివరి స్థానంలో నిలిచారు. మంత్రులు తమ ఫైళ్లను క్లియర్ చేసేందుకు ఎంత సమయం తీసుకుంటున్నారో చంద్రబాబు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పనులు, తీసుకున్న నిర్ణయాలు వేగంగా పూర్తి అయ్యేలా త్వరగా ఫైళ్లను క్లియర్ చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు సీఎం చంద్రబాబు. పాలనలో వేగం పెంచడం ద్వారా.. రాష్ట్ర ప్రజలకు




మెరుగైన సేవలు అందించాలని తమ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ఆయన వెల్లడించారు.ప్రతి నెల రోజులకు ఒకసారి కలెక్టర్ల సమావేశం జరపడం ఆనవాయితీగా పెట్టుకున్నారు సీఎం చంద్రబాబుఅందులో భాగంగా నిన్ననే అమరావతిలో కలెక్టర్ల సదస్సు ప్రారంభమైంది. ఈరోజు కూడా అది కొనసాగనుంది. కీలక అంశాలపై చర్చలు జరపనున్నారు. ముఖ్యంగా వైద్య ఆరోగ్యశాఖ పై ప్రత్యేక ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. శాఖల ఆదాయంపై కూడా సమీక్షిస్తారు. రాష్ట్ర విద్యారంగం తో పాటు ఉపాధి అవకాశాలపై కూడా చర్చించనున్నారు ఈరోజు సమావేశంలో. కోర్టులో ఉన్న కేసులు, న్యాయశాఖ పరిధిలో ఉన్న అంశాల పైన అధికారులు సీఎంకు వివరాలు అందించనున్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు సంబంధించి కీలక నిర్ణయం కూడా ఈరోజు తీసుకోనున్నారు. తొలిరోజు మంత్రులకు ర్యాంకింగ్స్ ఇవ్వగా.. ఈరోజు అధికారులకు ర్యాంకింగ్స్ ఇవ్వనున్నారు సీఎం చంద్రబాబు.

# ఉగాదికి పట్టాభిషేకమా...

తిరుపతి, మార్చి 15

ప్రస్తుతం ఏపీలో ఉగాది పై చర్చ సాగుతోంది. ఆరోజు ఏపీ రాజకీయాలను షేక్ చేసేలా పలు నిర్ణయాలు ఉంటాయని ప్రచారం నడుస్తోంది. ముఖ్యంగా అధికార పగ్గాల మార్పు గురించి రాష్ట్రమంతటా జోరుగా చర్చ జరుగుతోంది. సీఎం పీఠంపై లోకేష్ ను కూర్చోబెడతారు అనే ప్రచారం ఒకటి ఉంది. అయితే ఇది సాధ్యం కాకపోవచ్చు కానీ.. మంత్రివర్గంలో భారీ మార్పులు చేసే అవకాశం మాత్రం కనిపిస్తోంది. ముఖ్యంగా లోకేష్ టీం ను రాష్ట్ర మంత్రివర్గంలోకి తెస్తారన్న ప్రచారం మాత్రం పతాక స్థాయిలో జరుగుతోంది. ఇప్పటికే దీనిపై స్పష్టమైన సంకేతాలు టిడిపి శ్రేణులకు వచ్చినట్లు తెలుస్తోంది. మంత్రివర్గంలో మార్పులకు సీఎం చంద్రబాబు సూత్రప్రాయంగా ఒక నిర్ణయానికి వచ్చినట్లు మాత్రం సమాచారం. లోకేష్ కీలక బాధ్యతలపై అనేక రకాల చర్చలు జరుగుతుండగా.. బిజెపితో పాటు జనసేన స్పందన ఎలా ఉంటుంది అనేది ఇప్పుడు హాట్ టాపిక్. అయితే గతానికి భిన్నంగా లోకేష్ పై ఉన్న అభిప్రాయం బిజెపికి మారింది. లోకేష్ నాయకత్వాన్ని బిజెపి ప్రోత్సహించే అవకాశం ఉంది. ఎందుకంటే రాష్ట్ర రాజకీయాల్లో వారసత్వ మార్పులు జరిగినప్పుడు తమ పార్టీకి కూడా ఎదిగే అవకాశం దొరుకుతుందని బిజెపి లెక్కలు వేసుకుంటుంది.. బీహార్ వంటి రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలను బలహీనపరిచి తమ ఉనికిని చాటుకున్నట్లే.. ఇక్కడ కూడా అదే ఆలోచన చేసే అవకాశం ఉంది.రాష్ట్రంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోయింది. కానీ బలమైన ఓటు బ్యాంకుతో పటిష్ట స్థితిలోనే ఉంది. అందుకే కూటమి పార్టీలు చాలా జాగ్రత్తగా అడుగులు వేయాల్సిన అవసరం ఉంది. అయితే ఇప్పటికిప్పుడు లోకేష్ పట్టాభిషేకం ఉండకపోవచ్చు. ముందుగా లోకేష్ టీం తో పటిష్ట పరుస్తారు. తరువాతే లోకేష్ ను ప్రమోట్ చేస్తారు. అయితే ఇప్పట్లో చంద్రబాబును మార్చే అవకాశం లేదు. అయితే రాజకీయాల్లో ఏదైనా సాధ్యమే కాబోలు. అయితే కచ్చితంగా మంత్రివర్గ విస్తరణ ఉంటుందన్న ప్రచారం జరుగుతోంది. ఓ అయిదుగురు వరకు మంత్రులు మార్పు చేస్తారని మాత్రం పొలిటికల్ వర్గాల్లో ఒక టాక్ ఉంది. ఏదిఏమైనా ఏపీలో మాత్రం ఉగాది పర్వదినం హాట్ టాపిక్ గా ఉంది. మరి ఎటువంటి సంచలనాలు నమోదు అవుతాయో చూడాలి.

# హోటల్ బిల్స్ లో గ్యాస్ డబ్బులు

చెన్నై, మార్చి 15

ఫిన్ చేయడానికి హోటల్‌కు వెళ్తే.. బిల్లులో టిఫిన్, జీఎస్టీతో పాటు గ్యాస్ సప్లయ్ ఛార్జీలను కూడా నిర్వాహకులు యాడ్ చేసిన ఘటన చెన్నైలో చోటుచేసుకుంది. హోటల్‌లో టిఫిన్ చేసేందుకు వచ్చిన ఓ కస్టమర్ ఇడ్లీ, వడ తిన్నాడు. తర్వాత బిల్లు ఇవ్వాలని అడిగినప్పుడు హోటల్ నిర్వాహకుడు అతని బిల్లులో టిఫిన్, జీఎస్టీతో పాటు అదనంగా గ్యాస్ సప్లయ్ బిల్లును కూడా యాడ్ చేసి ఇచ్చాడు. అది చూసిన కస్టమర్ ఒక్కసారిగా షాక్ అయ్యాడు. అనంతరం బిల్ పే చేసి దాని ఫోటోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. దీంతో ఇందుకు సంబంధించిన ఫోటో ప్రస్తుతం సోషల్ మీడియాలో చెక్కర్లు కొడుతోంది.వివరాల్లోకి వెళ్తే.. స్థానికంగా నివాసం ఉంటున్న ఓ వ్యక్తి చెన్నైలోని 'గిరాస్' రెస్టారెంట్‌కు టిఫిన్ చేసేందుకు వెళ్లాడు. అతను ఇడ్లీ, వడ తిన్న తర్వాత హోటల్ నిర్వాహకుడు ఇచ్చిన బిల్ చూసి కంగుతిన్నాడు. ఆ బిల్లులో ఇడ్లీ, వడతో పాటు 'గ్యాస్ ఛార్జ్' పేరుతో అదనంగా మరో రూ.10 యాడ్ చేశాడు. ఇక చేసేదేమిలేక కస్టమర్ ఆ మొత్తాన్ని చెల్లించాడు.ఒక్క చెన్నైలోనే కాదు దేశవ్యాప్తంగా చాలా ప్రధాన నగరాల్లో ప్రస్తుతం ఇదే పరిస్థితి నెలకొంది. ఇటీవలే కర్ణాటక రాజధాని బెంగళూరులో సైతం ఇలాంటి ఘటనే వెలుగు చూసింది. నగరంలోని ఓ హోటల్ భోజనం చేసేందుకు వెళ్లిన ఓ కస్టమర్‌కు గ్యాస్ ఛార్జీ పేరుతో ఏకంగా రూ.30 వరకు అదనంగా వసూలు చేశారట. గ్యాస్ కొరత నేపథ్యంలో హాస్టల్‌లో ఫుడ్ పెట్టట్లేదని హోటల్‌కు వెళ్తే.. అక్కడి నిర్వాహకులు నిండా దోచుకుంటున్నారని సదురు వ్యక్తి ఆవేదన వ్యక్తం చేశాడు. అందుకు సంబంధించిన బిల్‌ను సిటీ పోలీసులకు ట్యాగ్ చేస్తూ సదురు కస్టమర్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు.అయితే సోషల్ మీడియాల్‌లో ఈ గ్యాస్ బిల్లులకు సంబంధించిన పోస్ట్‌లు తెగ వైరల్ అవుతున్నాయి. వీటిని చూసిన నెటిజన్లు హోటల్ నిర్వాహకుల తీరుపై మండి పడుతున్నారు. గ్యాస్ కొరత ఉంటే స్టాక్ ముందుగానే తెచ్చిపెట్టుకోవాలి కానీ.. ఆ భారాన్ని కస్టమర్లపై నెట్టడమేంటని ప్రశ్నిస్తున్నారు.

# ఆర్టీసీలో సమ్మె నోటీస్

హైదరాబాద్, మార్చి 15

తెలంగాణ ఆర్టీసీలో సమ్మె సైరన్ మోగింది. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ కార్మికులు ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చారు. విధిలేని పరిస్థితుల్లో సమ్మె నోటీసు ఇచ్చినట్లు జేఏసీ నాయకులు తెలిపారు. ఆర్టీసీ జేఏసీ చైర్మన్ వెంకన్న నేతృత్వంలో ఆర్టీసీ కార్మికులు బస్ భవన్‌లో అధికారులను కలిశారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియ వెంటనే చేపట్టాలని ఆర్టీసీ జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. అలాగే 2021 వేతన సవరణ 30 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలని డిమాండ్ చేశారు.సమ్మె నోటీసులో ఆర్టీసీ కార్మికులు కీలక డిమాండ్లు ప్రస్తావించారు. ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న 'మహాలక్ష్మి పథకం కింద ప్రతినెలా అందించే నిధులను కోత లేకుండా ఇవ్వాలన్నారు. ప్రభుత్వ తరుపున ఆర్టీసీకి రావాల్సిన పాత బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రత తోపాటు ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేయాలన్నారు. అలాగే ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికలు జరపాలని కోరారు. ఇక అన్ని కేటగిరీల్లోని సిబ్బందిపై అధిక పనిభారం తగ్గించాలని జేఏసీ నేతలు డిమాండ్ చేశారు.

# జిల్లాలో పదవ తరగతి పరీక్షలు ప్రారంభం

నల్గొండ మార్చి 15

ఉమ్మడి నల్గొండ జిల్లాలో శనివారం నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం అయ్యాయి. ఉదయం 9:30 నిమిషాల నుండి మధ్యాహ్నం 12:30 నిమిషాల వరకు జరగనున్నాయి. ఆరు సబ్జెక్టులకు 7 పరీక్షలు వుంటాయి. ప్రతి పరీక్షకు 3నుండి 4 రోజుల విరామం ఇచ్చారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో మొత్తం 41,178 విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. అందుకుగాను 228 సెంటర్ల ఏర్పాటు చేసారు.

నల్గొండ

109 కేంద్రాలు,, 19845 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు

109 మంది సిఎస్ లు 109 మంది డివోలతొ పరీక్షల పర్యవేక్షణ.

సూర్యాపేట జిల్లా

69 పరీక్ష కేంద్రాలు 12403 మంది విద్యార్థులు .

69 మంది సిస్ లు 69 మంది డివోలతొ పరీక్షల పర్యవేక్షణ

యాదాద్రి భువనగిరి జిల్లా

50 పరీక్ష కేంద్రాలు 8930 మంది విద్యార్థులు

50 మంది సీఎస్లు 50 మంది డిఓ లు 572 మంది ఇన్విజిలేటర్ల ఏర్పాటు

పదో తరగతి విద్యార్థులు హాల్ టికెట్ చూపిస్తే ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించారు. హాల్ టికెట్స్ పై ఎగ్జామ్స్ సెంటర్ లోకేషన్ క్యూఆర్ కోడ్ ముద్రించారు.

నిమిషం నిబంధన తొలగించారు. ఐదు నిమిషాల వరకు పరీక్షకు అనుమతి ఇచ్చారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ వస్తువులు, మొబైల్స్ నిషేధం. పరీక్ష కేంద్రాల సమీపంలో ఉన్న ఆన్లైన్ కేంద్రాలు,, జిరాక్స్ సెంటర్లో మూసివేసారు. అరగంట ముందే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతి ఇచ్చారు.

ప్రతి పరీక్ష కేంద్రం లో సీసీ కెమెరాలు, పరీక్ష కేంద్రాల్లో తాగునీరు ప్రధమ చికిత్స కోసం ప్రత్యేక సిబ్బంది, ప్రతి పరీక్ష కేంద్రానికి ఒక సిట్టింగ్ స్క్వాడ్, విద్యార్థుల విలువైన వస్తువులు పెట్టుకోవడానికి ప్రత్యేక రూమ్స్ ఏర్పాటు చేసారు. 20 మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలేటర్ వుంటారు. పరీక్ష కేంద్రాల వద్ద బిఎన్ఎస్ చట్టం 163 అమలు చేస్తున్నారు.

# టూ టైర్ సిటీల్లో అక్రమ సంబంధాలు

హైదరాబాద్, మార్చి 15

భారతదేశంలో మారుతున్న జీవనశైలికి తగ్గట్టుగానే సంబంధాల విషయంలో కూడా సంచలన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. తాజాగా ప్రముఖ డేటింగ్ ప్లాట్‌ఫామ్ ఆష్లే మాడిసన్ విడుదల చేసిన నివేదిక భారతీయుల వ్యక్తిగత సంబంధాలపై విస్తుపోయే నిజాలను వెలుగులోకి తెచ్చింది. ఒకప్పుడు కేవలం మెట్రో నగరాలకే పరిమితమైన వివాహేతర సంబంధాలు, ఇప్పుడు ద్వితీయ శ్రేణి నగరాల్లో కూడా వేగంగా విస్తరిస్తున్నాయని ఈ సర్వే స్పష్టం చేసింది.ఆలయాలకు, పట్టు చీరలకు ప్రసిద్ధి చెందిన తమిళనాడులోని కాంచీపురం ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. గత ఏడాది 17వ స్థానంలో ఉన్న ఈ నగరం.. కేవలం ఒక్క సంవత్సరంలోనే మొదటి స్థానానికి చేరుకుంది. చిన్న పట్టణాల్లో కూడా డేటింగ్ యాప్‌ల వినియోగం ఏ స్థాయిలో పెరుగుతుందో చెప్పడానికి ఇదొక నిదర్శనం.దేశ రాజధాని ప్రాంతం ఈ ప్లాట్‌ఫామ్ వినియోగంలో భారీ రికార్డులను నమోదు చేసింది. సెంట్రల్ ఢిల్లీ రెండవ స్థానంలో ఉండగా, టాప్ 20 జాబితాలో ఢిల్లీకి చెందిన 9 ప్రాంతాలు చోటు సంపాదించుకున్నాయి. గురుగ్రామ్, నోయిడా, ఘజియాబాద్ వంటి నగరాలు కూడా ముందంజలో ఉన్నాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే దేశ ఆర్థిక రాజధాని ముంబై ఈసారి టాప్ 20 నగరాల జాబితాలో లేకపోవడం గమనార్హం.కాంచీపురం, ఢిల్లీ తర్వాత వరుసగా గురుగ్రామ్, గౌతమ్ బుద్ధ నగర్, డెహ్రాడూన్, పూణే, బెంగళూరు, చండీగఢ్, లక్నో, కోల్‌కతా, హైదరాబాద్ వంటి నగరాలు ఈ జాబితాలో చోటు దక్కించుకున్నాయి. ఇందులో హైదరాబాద్ 11వ స్థానంలో ఉంది. వివాహేతర సంబంధాలను అంగీకరించే వ్యక్తుల రేటు భారత్, బ్రెజిల్‌లో అత్యధికంగా ఉందని, దాదాపు 53శాతం మంది భారతీయులు తమ జీవితంలో ఏదో ఒక సమయంలో ఇటువంటి సంబంధాల్లో పాల్గొన్నారని సర్వే పేర్కొంది.

ఎందుకు పెరుగుతున్నాయి..?

ఈ పెరుగుదల వెనుక సామాజిక, మానసిక కారణాలు ఉన్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు.పని ఒత్తిడి: సుదీర్ఘ పని గంటల వల్ల భాగస్వాముల మధ్య సమయం తగ్గడం.భావోద్వేగ దూరం: సంబంధాల్లో పెరిగిన కమ్యూనికేషన్ గ్యాప్.ఆన్‌లైన్ ప్రైవసీ: డేటింగ్ యాప్‌లు అందించే గోప్యత వల్ల వ్యక్తులు ఇతరులతో రహస్యంగా కనెక్ట్ అవ్వడం సులభమైంది.వ్యక్తిగత స్వేచ్ఛ: ఆధునిక జీవనశైలిలో వ్యక్తిగత స్వేచ్ఛకు ఇస్తున్న ప్రాధాన్యత కూడా ఒక ప్రధాన కారణంగా కనిపిస్తోంది.మొత్తానికి.. ఒకప్పుడు మెట్రో నగరాలకే పరిమితమైన ఈ ధోరణి ఇప్పుడు చిన్న నగరాలకు కూడా పాకిపోవడం సమాజంలో మారుతున్న విలువలకు అద్దం పడుతోంది.

# అప్పుల బాధతో మహిళ అత్మహత్య

తాండూర్ మార్చి 15

అప్పుల బాధ తట్టుకోలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన వికారాబాద్ జిల్లా తాండూరు మండలం లో చోటు చేసుకుంది. తాము ఇచ్చిన లక్ష రూపాయలు వెంటనే చెల్లించాలంటూ వడ్డీ వ్యాపారులు చేసిన వేధింపులు తట్టుకోలేక, పురుగుల మందు తాగి ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. వివరాల్లోకి వెళితే?. తాండూరు మండలం సిరిగిరి పెట్ కు చెందిన లక్ష్మి అప్పుల బాధకు ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి భర్త తెలిపిన వివరాల ప్రకారం.. తన భార్య లక్ష్మి స్థానికంగా ఉండే హనుమంత్ రెడ్డి వద్ద లక్ష రూపాయలు అప్పుగా తీసుకున్నారు. వంటలు పండకపోవడంతో గడువులోగా డబ్బు చెల్లించలేకపోయారు. దీంతో హనుమంత్ రెడ్డి దంపతులు లక్ష్మిపై ఒత్తిడి పెంచారు. సమయం ఇవ్వాలని ప్రాధేయపడినా వినకుండా, ఊరిలో అందరూ చూస్తుండగానే అసభ్య పదజాలంతో దూషించి, సూటిపోటి మాటలతో తీవ్రంగా అవమానించారని ఆవేదన వ్యక్తం చేసాడు. నిందితులు చేసిన అవమానాన్ని భరించలేక లక్ష్మి తీవ్ర మనస్తాపానికి గురై, తన వల్ల కుటుంబానికి అవమానం జరిగిందన్న బాధతో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడిందని తెలిపారు. మేము పొలం అమ్మి అయినా మీ బాకీ తీరుస్తామని చెప్పాం, కానీ వారు కనికరం లేకుండా మాట్లాడారు. ఇప్పుడు నా పిల్లలు తల్లి లేని అనాథలయ్యారు అని మృతురాలి భర్త ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం పై స్థానిక పోలీస్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు

# 16న ఐదు రాష్ట్రాల ఎన్నికల నోటిఫికేషన్

న్యూఢిల్లీ, మార్చి 15

దేశంలోని అస్సాం, కేరళ, తమిళనాడు, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలతో సహా కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో త్వరలోనే అసెంబ్లీ గడువు ముగియనుంది. ఈ నేపథ్యంలోనే ఆయా రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల నిర్వహించేందుకు ఈసీ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఈ మేరకు ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్‌ను సోమవారం ఈసీ ప్రకటించనున్నట్టు తెలుస్తోంది. అయితే ఇప్పటికే ఐదు రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాల సమగ్ర సవరణ ప్రక్రియ పూర్తైంది. బెంగాల్ మినహా మిగిలిన రాష్ట్రాల్లో తుది ఓటర్ల జాబితాల కూడా విడుదలైంది.నేడో, రేపో బెంగాల్ ఓటర్ల తుది జాబితా కూడా విడుదలయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే ఎన్నికల సన్నద్ధత ఏర్పాట్లపై ఇప్పటికే ఆయా రాష్ట్రాల్లో కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఇతర అధికారులు పర్యటించారు. ఈ దఫా పశ్చిమబెంగాల్ ఎన్నికలకు సంబంధించి మరిన్ని చర్యలు తీసుకోబోతున్న కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు ప్రకటించారు.అయితే 2021లో మొత్తం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 294 నియోజకవర్గాలకు గాను 160 మంది సాధారణ పరిశీలకులను కేంద్ర ఎన్నికల సంఘం నియమించగా ఆ సంఖ్యను ఈ సారి పెంచుతున్నట్టు తెలుస్తోంది. ఈ సారి రాష్ట్రం వ్యాప్తంగా ఉన్న మొత్తం 294 నియోజకవర్గాలకు నియోజకవర్గానికి ఒక సాధారణ పరిశీలకుడిని నియమిస్తున్నట్టు సమాచారం. అలాగే మరింత మంది పోలీసు వ్యయ పరిశీలకులను నియమించనున్న కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది. అయితే ఎన్నికల షెడ్యూల్ ఖరారు చేసే ముందు స్థానిక పండుగల్ని పరిగణనలోకి తీసుకోవాలని పలు రాజకీయ పార్టీలు ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశాయి

# సికింద్రాబాద్ లో టెన్త్ పరీక్షలు షురూ

సికింద్రాబాద్ల్, మార్చి 15

సికింద్రాబాద్ లో 10వ తరగతి పరీక్షలు ప్రారంభం అయ్యాయి. పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసినట్లు సెకండరీ బోర్డు వెల్లడించింది. మొదటిసారి దాదాపు నెలరోజుల పాటు జరుగనున్న 10వ తరగతి పరీక్షలు జరగనున్నాయి. పరీక్ష, పరీక్షకు మధ్య 3నుండి5 రోజుల గ్యాప్ వుంటుంది. విద్యార్థులపై వత్తిడిని తగ్గించడానికే ఈ నిర్ణయం అని వెల్లడించారు. పరిక్షాకేంద్రం అడ్రస్ కోసం హాల్ టికెట్ పై క్యూ ఆర్ కోడ్ ముద్రించారు. పరీక్ష కేంద్రంలోకి 8.30నుండి అనుమతించనున్నారు. 9.35వరకు అనుమతి ఇవ్వనున్నారు. ఆర్టీసీ విద్యార్థులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తోంది.

## ఖమ్మం లో పదవ తరగతి పరీక్షలు..

ఖమ్మం మార్చి 15

ఖమ్మం జిల్లాలో పదవవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభం అయ్యాయి. శనివారం నుండి ఏప్రిల్ 14 వరకు కొనసాగనున్నాయి. ఖమ్మం జిల్లాలో 98 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసారు. ఖమ్మం జిల్లాలో 17,293 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. కొత్తగూడెం జిల్లా 73 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా 12,731 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో సిసి కెమెరాల నిఘా ఏర్పాటు చేసారు. ఉదయం 9.30 నుండి 12.30 వరకు పరీక్ష కొనసాగుతుంది . పరీక్ష మొదలైన 5 నిముషాల వరకు లోనికి అనుమతిస్తారు. పరీక్షా కేంద్ర ఏదైనా సమస్యలు తలెత్తితే హెల్ప్ లైన్ నెంబర్ ఏర్పాటుచేసారు.

## డోకిపర్రు పంచాయతీ కార్యదర్శి రజియా సుల్తానా సస్పెండ్

గుడ్లవల్లేరు మార్చి 15

విధినిర్వహణలో అలసత్వం గా వ్యవహరిస్తూ పన్నుల వసూళ్లు చేపట్టకుండా పై అధికారుల ఆదేశాలను పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన డోకిపర్రు -2 స్వర్ణ గ్రామం, పంచాయతీ గ్రేడ్ 5 కార్యదర్శి రజియా సుల్తానాను విధుల నుండి సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ డికె బాలాజీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. కాబట్టి జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులందరూ తమతమ పరిధిలోని నిర్దేశించిన పన్నుల బకాయిల వసూళ్ల లక్ష్యాలను సాధించాలని జిల్లా పంచాయతీ అధికారి డాక్టర్ జె. అరుణ సూచించారు.

## మొక్కజొన్న పంట కు నిప్పు

అనంతపురం మార్చి 15

పెద్దపప్పూరు మండలం చెర్లోపల్లిలో రైతు శివ నారాయణ రెడ్డికి చెందిన మొక్కజొన్న పంటకు గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం నిప్పు పెట్టారు. మంటల్లో సుమారు ఒకటిన్నర ఎకరాల్లో సాగుచేసిన మొక్కజొన్న కాలిపోయింది. పంట చేతికి వచ్చే సమయంలో ఇలా జరగడంతో బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి

జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం అయిజ మండలం ఎక్లాస్పూర్ పంచాయతీ కార్యదర్శి రంగన్న శుక్రవారం ఏసీబీ అధికారులకు లంచం తీసుకుంటుండగా పట్టుబడ్డారు. ఎక్లాస్ పూర్ గ్రామంలో లబ్ధిదారురాలి ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సంబంధించి రూ. 20,000 లంచం డిమాండ్ చేసిన రంగన్న, శుక్రవారం రూ. 15,000 తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ ఆధ్వర్యంలో అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఈ ఘటన ఇంటి నిర్మాణానికి సంబంధించిన చెల్లింపుల వ్యవహారంలో చోటుచేసుకుంది.

## దొంగిలించిన ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు

మహబూబ్‌నగర్ మార్చి 15

జడ్చర్ల నియోజకవర్గం మిడ్జిల్ మండలంలోని కొత్తూరు, మిడ్జిల్ గ్రామాలలో ఇటీవల చోరీకి గురైన రెండు ట్రాక్టర్లను పోలీసులు కేవలం ఒకే రోజులో రికవరీ చేసి రైతులకు అప్పగించారు. ఈ సంఘటనతో ప్రజల్లో పోలీసులపై నమ్మకం మరింత బలపడింది. మిడ్జిల్ పోలీస్ టీమ్ చూపిన అంకితభావం, టీమ్ వర్క్ ప్రశంసనీయం. ఎస్సై శివనాగేశ్వర నాయుడు బృందం ఈ రికవరీని సాధించింది. వారి పనితీరును డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ నాగార్జున గౌడ్ ప్రత్యేకంగా అభినందించారు.

## ఎమ్మెల్యే యశస్విని రెడ్డిని అడ్డుకున్న స్థానికులు

జనగామ మార్చి 15

జనగామ జిల్లా పాలకుర్తి మండలం అయ్యంగారిపల్లి గ్రామంలో ఇందిరా మహిళాశక్తి భవనానికి భూమిపూజ చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ని స్థానికులు అడ్డుకున్నారు.

ఆ భూమి పాఠశాల క్రీడా ప్రాంగణం కోసం ఏర్పాటు చేసిందని, వేరే ప్రభుత్వ భూమిలో మహిళాశక్తి భవనం నిర్మించాలని, క్రీడా ప్రాంగణం కోసం కేటాయించిన భూమిలో వేరే భవనాలు ఎలా కడతారని యశస్విని రెడ్డిని ప్రశ్నించారు. అక్కడే ఉన్నవారు వీడియో తీస్తుండగా, యశస్విని రెడ్డి పీఏ రాజేష్ గౌడ్ ఫోన్ లాక్కున్నాడు. ఇదేంటని ప్రశ్నించగా స్థానిక ఎస్ఐ పవన్ కుమార్ వీరంగం సృష్టించారు. తమను బెదిరించిన ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను స్థానికులు డిమాండ్ చేసారు.

# జీవన ప్రగతి సాధనే మెట్లోత్సవం అంతరార్థం : డా. మేడసాని మోహన్

### – మెట్లోత్సవంలో పాల్గొన్న సింగపూర్ కళాకారులు
### – తిరుపతిలో ఘనంగా మెట్లోత్సవం

తిరుపతి, 2026 మార్చి 15

ధర్మమార్గంలో నడుస్తూ జీవితంలో ఒక్కో మెట్టు ఎక్కుతూ భగవంతుడిని చేరుకోవడమే మెట్లోత్సవం అంతరార్థమని టిటిడి అన్నమాచార్య ప్రాజెక్టు ప్రత్యేక అధికారి డా. మేడసాని మోహన్ తెలిపారు. శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల వారి 523వ వర్ధంతిని పురస్కరించుకుని టిటిడి అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో శనివారం ఉదయం అలిపిరి పాదాల మండపం వద్ద మెట్లోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పూర్వం నుంచి ఎందరో మహనీయులు మెట్ల మార్గంలో తిరుమలకు నడిచి వెళ్లి స్వామివారి కృపకు పాత్రులయ్యారని చెప్పారు. ఇటువంటి పవిత్రమైన మెట్లోత్సవంలో పాల్గొనడం ఎంతో పుణ్యఫలాన్ని ఇస్తుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నుండి వచ్చిన దాదాపు వెయ్యికి పైగా భజన మండళ్ల సభ్యులు, ప్రముఖ సంగీత కళాకారులు భజనలు చేస్తూ సప్తగిరులను అధిరోహించి స్వామివారిని దర్శించుకుంటారని చెప్పారు. మార్చి 15న ఆదివారం సాయంత్రం తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనంలో సప్తగిరి సంకీర్తనల గోష్టిగానం నిర్వహించనున్నట్లు తెలిపారు.

మెట్లోత్సవంలో సింగపూర్ కళాకారులు :

శ్రీ అన్నమాచార్యుల వారి వర్ధంతి ఉత్సవాలలో పాల్గొనేందుకు సింగపూర్ నుండి 20 మంది కళాకారులు స్వచ్ఛందంగా విచ్చేశారు. సింగపూర్‌కు చెందిన డా. కె. భాగ్యమూర్తి ఆధ్వర్యంలో "అష్టలక్ష్మి విద్యార్థుల బృందం" శనివారం ఉదయం మెట్లోత్సవంలో పాల్గొంది. ఆకట్టుకున్న సంకీర్తనల గోష్టిగానం:ముందుగా అలిపిరి పాదాల మండపం వద్ద అన్నమాచార్య వంశీయులు మెట్లపూజ నిర్వహించారు. అనంతరం అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు సప్తగిరి సంకీర్తనల గోష్టిగానం చేశారు. ఇందులో "బ్రహ్మ కడిగిన పాదము'', ''భావములోన బాహ్యమునందును'', "ఎంతమాత్రమున ఎవ్వరు దలచిన అంతమాత్రమే నీవు", "పొడగంటిమయ్య నిన్ను పురుషోత్తమా", "కొండలలో నెలకొన్న కోనేటిరాయుడు వాడు" వంటి కీర్తనలు ఆలపించారు. భక్తులు పరవశించి గోష్టిగానంలో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు లత, అన్నమాచార్య వంశీయులు తాళ్లపాక హరినారాయణాచార్యులు, ఇతర అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు పాల్గొన్నారు.

# ఏ పార్టీ చూసిన అంతేగా... అంతేగా

హైదరాబాద్, మార్చి 15

అనగనగా ఒక రాజు. ఓరోజు దర్బారులో పంచాయితీ నిర్వహిస్తున్నారు. ఓ దొంగతనం కేసులో అందరినీ విచారిస్తున్నారు. ఇంతకీ జరిగిన దొంగతనం ఏంటంటే.. ఓ రైతు మామిడి తోటలో కొందరు అక్రమంగా ప్రవేశించి మామిడి కాయలను దొంగిలించారు. ఆ తర్వాత వాటిని విక్రయించి, సొమ్ము చేసుకున్నారు. ఈ విషయాన్ని ఆ రైతు రాజుకు విన్నవించాడు. దీంతో పుర్వాపరాలు కనుకున్న రాజు దొంగతనం పంచాయతీని విచారించడం మొదలు పెట్టారు. అనుమానితులను పంచాయతీలో ప్రవేశపెట్టారు. ఒక్కొక్కరిని విచారించారు. అందరూ పొంతనలేని వివరాలు చెప్పారు. అయితే మామిడి కాయలను దొంగిలించామనే విషయాన్ని చెప్పకుండా విక్రయించిన విషయాన్నిఒప్పుకున్నారు. ఇదే విషయాన్ని పట్టుకున్న రాజు.. పదే పదే వారిని అడగడంతో మామిడికాయలను దొంగిలించామని ఒప్పుకున్నారు. రాజు విచారిస్తున్న సమయంలో ఒకరి మీద ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. ఎవరూ తాము దొంగతనానికి పాల్పడలేదని చెప్పారు. ఈ ఉపోద్ఘాతం ఎందుకంటే.. తెలంగాణ రాష్ట్రంలో పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన పార్టీ, బాధిత పార్టీ చెబుతున్న మాటలు, వల్లె వేస్తున్న సుభాషితాలు అలాగే ఉన్నాయి మరి. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ఆపరేషన్ ఆకర్ష్ కు తెరదీశారు. దుగ్యాల శ్రీనివాసరావు నుంచి మొదలు పెడితే సంతోష్ వరకు అందరూ కాంగ్రెస్ లో చేరారు. నాడు కేసీఆర్ ఆ పరిణామం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక పార్టీ నుంచి ఇంకో పార్టీలోకి ఎలా తీసుకుంటారు? పార్టీ ఫిరాయింపులకు ఎలా పాల్పడతారు అని ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ తొలి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఫిరాయింపులకు గేట్లు తెరిచారు కేసీఆర్. టీడీపీ నుంచి మొదలు పెడితే వైసీపీ వరకు ఏ పార్టీని వదలకుండా అందరినీ వదలకుండా కొనేశారు. శాసనసభలో, శాసనమండలిలో ప్రతిపక్షం అనేది లేకుండా చూసుకున్నారు. తెలంగాణలో 2023లో జరిగిన ఎన్నికల్లో కేసీఆర్ పార్టీకి ఊహించని ఎదురు దెబ్బ తగిలింది. అంతే కాదు, కాంగ్రెస్ పార్టీ ఫిరాయింపులకు పచ్చజెండా ఊపింది. దీంతో గులాబీ పార్టీ నుంచి ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పల్లవి పాడారు. దీనిని ప్రశ్నిస్తూ గులాబీ పార్టీ సుప్రీం కోర్టు దాకా వెళ్లింది. అనేక దఫాలుగా కేసును విచారించిన సుప్రీం కోర్టు నిర్ణయాధికారాన్ని స్పీకర్ కు వదిలేసింది. స్పీకర్ అనేక రకాలుగా విచారించి.. గులాబీ పార్టీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరారు అని చెప్పడానికి రుజువులు లేవని తేల్చి పడేశారు. ఈ పరిణామాన్ని గులాబీ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ప్రజాస్వామ్యం సర్వనాశనమైందని విలపిస్తోంది. కానీ, అధికారంలో ఉన్నప్పుడు గులాబీ పార్టీ ఏ చేసింది? గులాబీ దళపతి ఎలాంటి వ్యాఖ్యలు చేశారు? అనే విషయాలను మర్చిపోతే ఎలా? ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో మాట్లాడే నైతికత గులాబీ పార్టీకి లేదు. సమర్థించుకునే స్థాయి కాంగ్రెస్ పార్టీకి ఏమాత్రంలేదు. ఎందుకంటే అందరూ గురవింద గింజలే.

# అడగడుగునా అడ్డంకులు... ముందుకు సాగేదెలా

హైదరాబాద్, మార్చి 15

హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ స్థాయికి చేర్చాలనే రేవంత్ రెడ్డి సర్కార్ సంకల్పంలో 'మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్' కీలకమైనది. అయితే, ప్రారంభం నుంచీ ఈ ప్రాజెక్టు విమర్శలు, రాజకీయ వివాదాలు, నిర్వాసితుల ఆందోళనల మధ్య నలిగిపోతోంది. ఈ నేపథ్యంలో, అపోహలను తొలగించి, ప్రాజెక్టు పారదర్శకతను చాటిచెప్పేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా రంగంలోకి దిగారు. 500 మంది నిపుణులు, ప్రజాప్రతినిధులతో నిర్వహించే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఈ ప్రాజెక్టు భవితవ్యాన్ని నిర్ణయించబోయే ఒక కీలక మలుపు. సాధారణంగా ఇలాంటి ప్రాజెక్టుల వివరణను అధికారులు లేదా కన్సల్టెంట్లు ఇస్తారు. కానీ మూసీ ప్రాజెక్టు విషయంలో సీఎం స్వయంగా వివరణ ఇవ్వాలని నిర్ణయించుకోవడం వెనుక బలమైన రాజకీయ, పరిపాలనాపరమైన వ్యూహం ఉంది. బఫర్ జోన్ పరిధిలోని ఇళ్ల కూల్చివేతలు, నిర్వాసితులకు పరిహారం వంటి అంశాలపై ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తున్నాయి. బాధితుల్లో ఉన్న భయాన్ని తొలగించేందుకు నేరుగా ముఖ్యమంత్రే హామీ ఇస్తున్నారు అనే నమ్మకాన్ని కలిగించడం దీని ప్రధాన ఉద్దేశం. మూసీని లండన్‌లోని థేమ్స్ నది తరహాలో మారుస్తామన్న తన విజన్‌ను ప్రజల్లోకి నేరుగా తీసుకెళ్లడం ద్వారా, అభివృద్ధి నిరోధకులు ఎవరో ప్రజలే తేల్చుకోవాలనే సంకేతాన్ని ఆయన ఇవ్వనున్నారు. ఆసియా అభివృద్ధి బ్యాంకు వంటి అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులను కూడా ఈ సమావేశానికి ఆహ్వానించారు. ప్రాజెక్టు పట్ల ప్రభుత్వానికి ఉన్న స్పష్టమైన రోడ్ మ్యాప్‌ను వారికి వివరించడం ద్వారా నిధుల సమీకరణను సులభతరం చేసుకోవడం మరో లక్ష్యంముఖ్యమంత్రి తన ప్రజెంటేషన్‌లో ఐదు దశల్లో జరగబోయే అభివృద్ధిని వివరించనున్నారు. మొదటి దశలో చేపట్టబోయే పనులు, అందుకు అవసరమైన భూసేకరణ, రక్షణ గోడల నిర్మాణం గురించి క్లారిటీ ఇవ్వనున్నారు. 50 మీటర్ల బఫర్ జోన్ పరిధిలో ఉన్న నిర్మాణాలకు చట్టబద్ధంగా విలువ లేకపోయినా, మానవీయ కోణంలో ఇందిరమ్మ ఇళ్లు, ప్రత్యామ్నాయ స్థలాలు, ఆర్థిక సహాయం అందిస్తామని సీఎం హామీ ఇవ్వనున్నారు. బాపూఘాట్ వద్ద రూ.400 కోట్లతో నిర్మించ తలపెట్టిన 'గాంధీ సరోవర్', నది ఇరువైపులా నిర్మించబోయే ఎకనామిక్ జోన్ల గురించి విడమర్చి చెప్పనున్నారు. ప్రాజెక్టుకు మోక్షం కలగడం అనేది ప్రధానంగా మూడు అంశాలపై ఆధారపడి ఉంటుంది. మేధా పాట్కర్ వంటి సామాజిక కార్యకర్తలు ఇప్పటికే ఈ కార్యక్రమాన్ని వాయిదా వేయాలని కోరుతున్నారు. ప్రజెంటేషన్ తర్వాత నిర్వాసితుల అనుమానాలు పటాపంచలైతేనే క్షేత్రస్థాయిలో పనులు వేగవంతం అవుతాయి. ఈ సమావేశానికి అన్ని రాజకీయ పార్టీల నేతలను ఆహ్వానించారు. ఒకవేళ ప్రతిపక్షాలు సానుకూలంగా స్పందిస్తే ప్రాజెక్టుకు రాజకీయ అడ్డంకులు తొలగుతాయి. లేనిపక్షంలో ఇది కేవలం అధికార పక్ష 'షో'గా మిగిలిపోయే ప్రమాదం ఉంది. కేవలం డిజైన్లు చూపడం కాకుండా, క్షేత్రస్థాయిలో పునరావాస పనులు ఏ మేరకు పకడ్బందీగా జరుగుతాయన్న దానిపైనే ప్రాజెక్టు విజయం ఆధారపడి ఉంటుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రజెంటేషన్ ద్వారా మూసీ ప్రాజెక్టును రాజకీయ వివాదం నుంచి అభివృద్ధి అజెండాగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇది కేవలం ఒక ప్రసంగం కాదు, హైదరాబాద్ భవిష్యత్తుపై ఆయన ఇస్తున్న భరోసా. ఈ వివరణ ప్రజల్లోకి బలంగా వెళ్తే, దశాబ్దాల కాలంగా మురుగు కూపంగా మారిన మూసీకి నిజంగానే పునరుజ్జీవం లభించే అవకాశం ఉంది. ఈ ప్రెజెంటేషన్ ఒక రకంగా మూసీ ప్రాజెక్టుకు అగ్నిపరీక్ష వంటిదని చెప్పవచ్చు.

# శ్రీవారి ఆలయంలో మార్చి నెలలో మూడు ఆస్థానాలు

తిరుమల, 2026 మార్చి 15

తెలుగు ఉగాది, శ్రీరామనవమి ముఖ్య పండుగలను పురస్కరించుకుని ఈ మార్చి నెలలో తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో మూడు ఆస్థానాలు నిర్వహించనున్నారు. ఆస్థానం అనేది ఆలయంలో సంప్రదాయబద్ధంగా నిర్వహించే ఆలయ దర్బారు. ప్రత్యేక పర్వదినాలలో గరుడాళ్వార్ సన్నిధిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీ.

ఉగాది ఆస్థానంమార్చి 19న శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది సందర్భంగా మూలవిరాట్ మరియు ఉత్సవమూర్తులకు కొత్త వస్త్రాలు సమర్పిస్తారు. ఈ సందర్భంగా వేదపండితులు స్వామివారి సన్నిధిలో కొత్త సంవత్సరానికి సంబంధించిన పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు. ఉగాది ఆస్థానం ఉదయం 7 గంటల నుండి 9 గంటల వరకు జరుగుతుంది. శ్రీరామనవమి ఆస్థానం

మార్చి 27వ తేదీన శ్రీరామనవమి సందర్భంగా గరుడాళ్వార్ సన్నిధిలో రాత్రి 9 గంటల నుండి 10 గంటల వరకు ఆస్థానం నిర్వహిస్తారు

## విశాఖ స్టీల్ ప్లాంట్ కు యుద్ధం సెగ

విశాఖపట్నం మార్చి 15

విశాఖ స్టీల్ ప్లాంట్ కు ఇరాన్ యుద్ధం సెగ తగిలింది. ప్లాంట్కు ఎల్పీజీ రాకపోతే 10 రోజుల తర్వాత ఉత్పత్తి ఆగిపోతుంది. ప్రస్తుతం 120 టన్నులు మాత్రమే ఉంది.. మరో 300 టన్నులకు

డబ్బులు కట్టేసినా ఇవ్వడానికి నిరాకరిస్తున్నారు. ఇది జరగకపోతే దేశంలో స్టీల్కు కృత్రిమ కొరత ఏర్పడుతుందని కార్మిక నాయకులు వాపోతున్నారు.

## గ్యాస్ కోసం క్యూ కడుతున్నజనాలు

విజయవాడ మార్చి 15

విజయవాడ నగరంలో గ్యాస్ కోసం ఏజెన్సీల ముందు జనాలు క్యూ కడుతున్నారు. గ్యాస్ అందుబాటులో లేదని భయాందోళనలో విజయవాడ వాసులు గంటల తరబడి గ్యాస్ ఏజెన్సీ వద్ద ఎదురు చూపులు చూస్తున్నారు. . గ్యాస్ సిలిండర్ తో పాటు ఏజెన్సీ వద్దకు చేరుకుంటున్నారు. సర్వర్లు పనిచేయకపోవడంతో ఏజెన్సీ సిబ్బంది మాన్యువల్ గానే స్లిప్పులు అందిస్తున్నారు.

## అక్రమంగా నిల్వ వుంచిన గ్యాస్ సిలిండర్లు సీజ్

తిరుపతి మార్చి 15,

తిరుపతి రూరల్ (మం) వేదాంతపురంలో సివిల్ సప్లై అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. భారత్ గ్యాస్ గోడౌన్లో అక్రమంగా నిల్వ ఉంచిన గ్యాస్ సిలిండర్లను సీజ్ చేసారు. మొత్తం 1056 గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. సీజ్ చేసిన సిలిండర్ల విలువ సుమారు రూ.19.70 లక్షలు . స్వాధీనం చేసుకున్న వాటిలో 312 డొమెస్టిక్, 744 కమర్షియల్ సిలిండర్లు వున్నాయి. అనుమతి లేకుండా ఇతర కంపెనీ సిలిండర్లను నిల్వ ఉంచినట్లు గుర్తించారు. గోడౌన్ కు సివిల్ సప్లై శాఖ నుండి ఎలాంటి అనుమతులు లేవని గుర్తించారు. నిబంధనలు ఉల్లంఘించినందుకు గోడౌన్ను జిల్లా అధికారి శేషాచల రాజు సీజ్ చేసారు. గోడౌన్ నిర్వాహకుడు గోపీనాథ్ రెడ్డిపై చర్యలకు ఆదేశించారు.

## బొలెరో బోల్తా.. ఐదుగురు మృతి, 20 మందికి గాయాలు

అల్లూరి జిల్లా మార్చి 15

అనంతగిరి మండలం తుమ్మల వలస వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రయాణికులతో వెళుతున్న బొలెరో వాహనం బోల్తాపడటంతో ఐదుగురు అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ప్రమాదంలో 20 మందికి గాయాలైనట్లు సమాచారం. క్షతగాత్రులంతా విజయనగరం జిల్లా చింతాడ వాసులుగా తెలుస్తోంది. కూలి పనుల కోసం అరకు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది.

## పవన్ కు చంద్రబాబు శుభాకాంక్షలు

విజయవాడ మార్చి 15

జనసేన పార్టీ 13 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ అధ్యక్షులు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాన్ కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో, తెలుగు ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో జనసేన పోషిస్తున్న పాత్ర అభినందనీయం. ప్రజలకు అండగా నిలుస్తూ వారి భవిష్యత్ కోసం పనిచేస్తున్న జనసైనికులకు, వీరమహిళలకు, నేతలకు శుభాభినందనలని ఆయన అన్నారు.

===========================

# 3 కార్పొరేషన్లకు విడివిడిగా ఎన్నికలు

హైదరాబాద్, మార్చి 15

హైదరాబాద్ మహానగర పాలనలో కొత్త అధ్యాయం మొదలైంది. జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా విభజిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఇప్పటికే అమలులోకి వచ్చింది. ముగ్గురు కమిషనర్ల నియామకం కూడా పూర్తి కావడంతో, ఇప్పుడు అందరి దృష్టి ఎన్నికల నిర్వహణపై పడింది. అయితే, మూడు కార్పొరేషన్లకు ఒకేసారి కాకుండా, ఒక్కో కార్పొరేషన్‌కు విడివిడిగా ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది.ఇలా చేయడానికి లోతైన రాజకీయ వ్యూహం ఉన్నట్లుగా చెబుతున్నారు. ప్రస్తుతం ఒక్కో మున్సిపల్ కార్పొరేషన్ లో వంద వార్డులు ఉన్నాయి. అయితే వాటిని మార్చాలనుకుంటున్నారు. వార్డుల సంఖ్యను పెంచడం ద్వారా ఏ ఒక్క రాజకీయ పార్టీకి ఏకపక్షంగా పట్టు చిక్కకుండా చేయాలన్నది సర్కార్ ఆలోచనగా చెబుతున్నారు. గ్రేటర్ పరిధిలోని బలమైన ఓటు బ్యాంకులను ముక్కలు చేయడం ద్వారా రాజకీయ శక్తిని వికేంద్రీకరించాలని చూస్తోంది. ఈ వార్డుల పునర్విభజన ఫలితాలే రాబోయే రోజుల్లో కొత్తగా ఏర్పడిన మూడు కార్పొరేషన్ల మేయర్ పీఠాలను ఎవరు అధిరోహించాలనేది నిర్ణయించేలా చేయాలనుకుంటున్నారు. మల్కాజ్‌గిరి వంటి కీలక ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీకి క్షేత్రస్థాయిలో ఇంకా పటిష్టమైన యంత్రాంగం సిద్ధం కాలేదు. అక్కడ బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఇప్పటికీ బలంగా ఉండటం అధికార పార్టీకి కొంత ఆందోళన కలిగిస్తోంది. ఒకేసారి ఎన్నికలకు వెళ్తే ఎదురుదెబ్బ తగిలే ప్రమాదం ఉందని గ్రహించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. అనుకూలమైన చోట ముందుగా, ప్రతికూలత ఉన్న చోట నిదానంగా ఎన్నికలు నిర్వహించడం ద్వారా నష్ట నివారణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ వంటి చోట్ల ఆంధ్ర మూలాలున్న ఓటర్లు అధికంగా ఉండే ప్రాంతాల్లో రాజకీయ సమీకరణాలు ఎప్పుడూ భిన్నంగానే ఉంటాయి. ఈ ప్రాంతాల్లో గెలుపు ఏ పార్టీకైనా ప్రతిష్టాత్మకమే. అందుకే, తక్షణమే ఎన్నికలకు వెళ్లకుండా, అక్కడి ఓటర్లను ఆకట్టుకునేలా ప్రత్యేక అభివృద్ధి పథకాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. సైబరాబాద్ పరిధిలో మౌలిక వసతుల కల్పన ద్వారా వారి విశ్వాసాన్ని పొందాకే ఎన్నికల బరిలోకి దిగాలని ప్రభుత్వం భావిస్తోంది. ఎన్నికల వ్యూహంలో భాగంగానే సీఎం రేవంత్ రెడ్డి మూడు కార్పొరేషన్ల పరిధిలో 99 రోజుల ప్రత్యేక అభివృద్ధి కార్యాచరణను ప్రకటించారు. ఈ స్వల్ప కాలంలో పెండింగ్‌లో ఉన్న కీలక ప్రాజెక్టులను పూర్తి చేసి, ఆపై భారీ స్థాయిలో ప్రారంభోత్సవాల ద్వారా ప్రజల్లోకి వెళ్లాలని చూస్తున్నారు. ఒకవైపు పాలనను వికేంద్రీకరిస్తూనే, మరోవైపు అభివృద్ధి పనులతో ప్రత్యర్థుల విమర్శలకు చెక్ పెట్టాలనేది ప్రభుత్వ ఎత్తుగడగా కనిపిస్తోంది.మూడు కార్పొరేషన్లకు వేర్వేరు సమయాల్లో ఎన్నికలు జరపడం ద్వారా.. ఒక ప్రాంతంలో వచ్చిన ఫలితం లేదా ప్రభావాన్ని మరో ప్రాంతంలో తమకు అనుకూలంగా మార్చుకోవచ్చని కాంగ్రెస్ భావిస్తోంది. ఇది ప్రతిపక్షాల ఏకాగ్రతను దెబ్బతీయడంతో పాటు, అధికార యంత్రాంగాన్ని ఒకే చోట కేంద్రీకరించి గెలుపు అవకాశాలను మెరుగుపరుచుకోవడానికి దోహదపడుతుందని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. భాగ్యనగర త్రిశూల వ్యూహంతో మేయర్ పీఠాలను దక్కించుకోవడానికి రేవంత్ రెడ్డి భారీ స్కెచ్ సిద్ధం చేసినట్లు స్పష్టమవుతోంది. ఎంత మేర వర్కవుట్ అవుతాయన్నది వేచి చూడాల్సిందే.

# చివరి దశకు మావోయిస్టుల పోరాటం

వరంగల్, మార్చి 15,

తెలంగాణ రాష్ట్ర చరిత్రలో ఒక కీలకమైన అధ్యాయం అవిష్కృతంకానుంది. దశాబ్దాల కాలంగా సాయుధ పోరాట బాటలో సాగిన మావోయిస్టులు భారీ సంఖ్యలో జనజీవన స్రవంతిలో కలిసేందుకు సిద్ధమయ్యారు. . దశాబ్దాల కాలంపాటు అజ్ఞాతంలో ఉండి, సాయుధ పోరాటమే మార్గమని నమ్మిన మావోయిస్టు అగ్రనేతలు రాజకీయ పార్టీ ఏర్పాటు దిశగా ఆలోచన చేస్తున్నారు. జనజీవన స్రవంతిలో కలిసిన తర్వాత సీనియర్ నాయకులంతా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమయ్యారు. దాదాపు గంటసేపు సాగిన సమావేశంలో మావోయిస్టు నేతలు తమ అంతరంగాన్ని ఆవిష్కరించారు. వారి సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ క్రమంలోనే రాజకీయ పార్టీ విషయం కూడా చర్చకు వచ్చింది. నాలుగున్నర దశాబ్దాల పాటు అడవిని నమ్ముకొని పోరాటం చేసిన కీలక నేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఇటీవలే డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో లొంగిపోయిన మావోయిస్టు పొలిట్ బ్యూరో సభ్యుడు, సెంట్రల్ మిలటరీ కమిషన్ ఇన్‌ఛార్జ్ తిప్పిరి తిరుపతి(దేవ్‌జి), కేంద్ర కమిటీ సభ్యులు మల్లా రాజిరెడ్డి(సంగ్రామ్), రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కారావు(జగన్), రాష్ట్ర కమిటీ సభ్యుడు నూనె నర్సింహారెడ్డి (గంగన్న) ముఖ్యమంత్రిని కలిశారు. వీరితోపాటు గతంలోనే లొంగిపోయిన కేంద్ర కమిటీ సభ్యులు పుల్లూరి ప్రసాద్, పోతుల పద్మావతి కూడా ఉన్నారు. ఈ భేటీలో మావోయిస్టు నేతలు ఒక సంచలన ప్రతిపాదన చేశారు. కేంద్ర ప్రభుత్వం అంగీకరిస్తే సాయుధ పోరాటాన్ని ప్రజాస్వామ్య పద్ధతిలో కొనసాగిస్తామని పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీని రద్దు చేస్తామని దేవ్‌జి, రాజిరెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటి వరకు అనుసరించిన పోరాట పంథాను వదిలి, చట్టపరంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాన్ని కొనసాగించాలని భావిస్తున్నట్టు వెల్లడించారు. అంతేకాకుండా, ప్రభుత్వాలు సహరిస్తే రాజకీయ పార్టీగా మార్చేందుకు కూడా సిద్ధమని వారు తెలిపారు. ఈ ప్రతిపాదనపై స్పందించిన రేవంత్ రెడ్డి, ఈ అంశం తన పరిధిలో లేదని త్వరలోనే కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కలిసినప్పుడు ఈ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్తాను అని హామీ ఇచ్చారు. కేంద్రం ఓకే అంటే కేంద్ర హోంమంత్రిని ఇక్కడికి పిలిపించి, ఒక భారీ సభ ఏర్పాటు చేసి ఈ విషయాన్ని ప్రకటిస్తామని సీఎం చెప్పారు. మావోయిస్టు నేతలు తమ పునరావాసం, ఇతర మౌలిక వసతుల గురించి ముఖ్యమంత్రి కీలక అభ్యర్థనలు చేశారు. లొంగిపోయిన మావోయిస్టులకు తక్షణమే ఆరోగ్య శ్రీ సదుపాయం కల్పించాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుతం లొంగిపోయిన వారికి 30 ఏళ్ల క్రితం నాటి రివార్డు సొమ్మునే ఇస్తున్నారని, ఇతర రాష్ట్రాల్లో ఇది ఎక్కువగా ఉందని తెలిపారు. దీనిపై అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని డీజీపీని ఆదేశించారు. ఇళ్ల స్థలాలు ఇవ్వడంపై క్యాబినెట్‌లో చర్చిస్తామని, అయితే వ్యవసాయ భూమి ఇవ్వడం సాధ్యం కాదని సీఎం స్పష్టం చేశారు. ఏవైనా రాజకీయ అంశాలు ఉంటే ప్రభుత్వ సలహాదారు కేశవరావును, ఆర్థికపరమైన అంశాల కోసం వేం నరేందర్‌రెడ్డిని కలవాలని సీఎం సూచించారు. జన జీవన స్రవంతిలో కలిసిన నేతలకు ఎలాంటి భద్రతా పరమైన ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను సీఎం ఆదేశించారు. హింస దేనికీ పరిష్కారం కాదని, ప్రజాస్వామ్య పద్ధతిలోనే ప్రజల ఆకాంక్షలు నెరవేరుతాయని ఆయన హితవు పలికారు. సమావేశం అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మహబూబ్‌నగర్ జిల్లా గద్వాల్‌కు చెందిన సుజాతక్కతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఎన్‌కౌంటర్‌లో మరణించిన మల్లోజుల కోటేశ్వరరావు భార్య అయిన ఆమె యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. లొంగిపోయిన మావోయిస్టుల వివరాలు, వారికి ప్రభుత్వం తరపున అందే పునరావాస ప్యాకేజీలు, ఈ పరిణామం వెనుక ఉన్న కీలక అంశాలను సీఎం వివరించే అవకాశం ఉంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం, లొంగిపోయే మావోయిస్టులకు ప్రభుత్వం తక్షణ సహాయంతో పాటు, వారు సమాజంలో గౌరవప్రదంగా బతకడానికి అవసరమయ్యే ఉపాధి, ఇతర వసతులను కల్పిస్తుంది. ముఖ్యమంత్రి స్వయంగా ఈ కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా, హింసను వీడి వచ్చే వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని బలమైన సందేశాన్ని పంపాలని భావిస్తున్నారు.

# శక్తివంతంగా మారుతున్న తెలంగాణ జాగృతి

హైదరాబాద్, మార్చి 15

తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం ఒక అనూహ్య మార్పు కనిపిస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత బీఆర్ఎస్ పార్టీ ప్రధాన నేతలు ఇంకా ప్రతిపక్ష పాత్ర పోషించడంలో కొంత తడబడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. తాము ఇంకా సమర్థవంతమైన ప్రతిపక్షంగా మారలేకపోతున్నాం అని గతంలో మాజీ మంత్రి జగదీష్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఈ పరిస్థితికి అద్దం పడుతున్నాయి. అయితే, సరిగ్గా ఇక్కడే కల్వకుంట్ల కవిత తనదైన శైలిలో రాజకీయ దూకుడు పెంచారు. బీఆర్ఎస్ పార్టీ కంటే వేగంగా ఆమె క్షేత్రస్థాయి సమస్యలపై స్పందిస్తూ, ప్రజల్లోకి దూసుకుపోతున్నారు.ముఖ్యంగా ఖమ్మం జిల్లాలోని వెలుగుమట్ల గ్రామంలో పేదల ఇళ్ల కూల్చివేతపై కవిత చేసిన పోరాటం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు కారణం ?వుతోంది. నిరాశ్రయులైన కుటుంబాల కోసం ఆమె ఏకంగా ఖమ్మం నడిబొడ్డున ఆమరణ నిరాహార దీక్షకు దిగడం, పోలీసుల నిర్బంధాన్ని సైతం లెక్కచేయకుండా పోరాడటం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బీఆర్ఎస్ కేడర్ అంతా స్తబ్దుగా ఉన్న తరుణంలో, ఆమె నేరుగా గ్రౌండ్ లెవల్‌లోకి వెళ్లి బాధితులకు భరోసా ఇవ్వడం ద్వారా అటు పార్టీ శ్రేణుల్లో, ఇటు ప్రజల్లో ఆమెపై సానుభూతి , మద్దతు పెరుగడానికి కారణం అయింది.ఢిల్లీ లిక్కర్ కేసు నుండి విముక్తి పొందిన కవిత తెలంగాణ జాగృతి వేదికగా తన రాజకీయ పునరాగమనాన్ని అత్యంత శక్తివంతంగా చాటుకుంటున్నారు. తనను పార్టీ నుండి పంపేశారని చెబుతున్న ఆమె చేస్తున్న పోరాటాలు చూస్తుంటే.. బీఆర్ఎస్ చేయలేని పనిని ఆమె ఒంటిచేత్తో చేస్తున్నట్లు కనిపిస్తోంది. కేసీఆర్, కేటీఆర్ వంటి అగ్రనేతలు ఇంకా వ్యూహాల్లో నిమగ్నమై ఉండగా, కవిత మాత్రం నేరుగా యాక్షన్ లోకి దిగడం బీఆర్ఎస్‌కు షాక్ లాంటిదే. కవిత ఇప్పుడు తన 'తెలంగాణ ఉద్యమ కాలం' నాటి పంథాను మళ్లీ ఎంచుకున్నారు. అప్పట్లో జాగృతి ద్వారా ఎలాగైతే ప్రజలను సమీకరించారో, ఇప్పుడు కూడా అదే ఫార్ములాతో వెళ్తున్నారు. చట్టసభల్లో గొంతుక కంటే.. వీధుల్లో చేసే పోరాటమే బలంగా వినిపిస్తుంది అనే సిద్ధాంతాన్ని ఆమె పాటిస్తున్నారు. జగదీష్ రెడ్డి చెప్పినట్లుగా పార్టీ ఇంకా ప్రతిపక్ష పాత్రకు అలవాటు పడకపోవచ్చు కానీ, కవిత మాత్రం ఇప్పటికే ఆ పాత్రలో ఒదిగిపోయారు. ప్రజా సమస్యలపై ఆమె చూపిస్తున్న ఈ తెగువ, కాంగ్రెస్ ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలు ఆమెకు ప్రజల మద్దతును మరింత పెంచుతున్నాయి. భవిష్యత్తులో బీఆర్ఎస్ కేడర్ కూడా ఆమె నాయకత్వం వైపు మొగ్గు చూపినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని చెబుతున్నారు. కేటీఆర్ కూడా వెంటనే.. ప్రెస్మీట్లు, సోషల్ మీడియా విమర్శలకే పరిమితం కాకుడా.. ప్రత్యక్షంగా రాజకీయ యుద్ధాలకు దిగాలన్న అభిప్రాయం బీఆర్ఎస్ క్యాడర్ లో వినిపిస్తోంది.

# సారా కధ ఇంతింతకాదయా

మహబూబ్ నగర్, మార్చి 15

రాజకీయ నాయకులు సాధారణంగా ఓటర్లకు అభివృద్ధి మంత్రం వేస్తారు, కానీ కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాత్రం ఏకంగా ఆరోగ్య మంత్రం కనిపెట్టారు. అది కూడా ఎక్కడో విదేశాల్లో కాదు.. మన నాటు సారాలో! ఇప్ప పూవుతో కాచిన సారా తాగితే మనుషులు ఏకంగా 110 ఏళ్లు బతుకుతారని ఆయన సెలవిస్తున్నారు. ఆయన తీరు ప్రపంచ ఆరోగ్య సంస్థ తన హెల్త్ బులిటెన్లను మార్చుకోవాలేమో అన్న అనుమానం కలుగుతోంది. అనిరుధ్ రెడ్డి లాజిక్ ప్రకారం.. ప్రస్తుతం మనం వాడుతున్నవన్నీ కల్తీ వస్తువులే, కానీ ఇప్ప పూవుతో తయారు చేసే సారా మాత్రం స్వచ్ఛమైన ఆర్గానిక్ ప్రొడక్ట్ అట. సారా వల్ల ఆరోగ్యం చెడిపోతుందని నిషేధిస్తే.. ఎమ్మెల్యే గారు మాత్రం అది ఆయుష్షును పెంచే అమృతం అని సర్టిఫికేట్ ఇచ్చేస్తున్నారు. పైగా తాను స్టడీ చేశానని కూడా చెబుతున్నారు. సారా తాగితే ఆరోగ్యం.. 110 ఏళ్ల ఆయుష్షు ఖాయం అని ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉండి ఆయన చెబుతుంటే, నెటిజన్లు మాత్రం సెటైర్లతో విరుచుకుపడుతున్నారు. ఇన్నాళ్లూ ఈ డైట్ ప్లాన్ తెలియక కదా మేము ప్రోటీన్ షేక్స్, గ్రీన్ టీలు తాగి వేస్ట్ అయిపోయాం అని సోషల్ మీడియాలో జోకులు పేలుతున్నాయి. అనిరుధ్ రెడ్డి కనిపెట్టిన ఈ లాంగ్ లైఫ్ సీక్రెట్ విన్నాక, మందుబాబులు కూడా మా ఎమ్మెల్యే గారు మా కోసం ఏదో ఒక కొత్త స్కీమ్ తెస్తారని తెలుసు.. కానీ ఇది మరీ అదిరిపోయింది అని మురిసిపోతున్నారు. అనిరుధ్ రెడ్డి తెలంగాణలో నిషేధించిన సారాను తీసుకు రావాలని డిమాండ్ చేస్తున్నారు. అసెంబ్లీలో కూడా మాట్లాడతానని అంటున్నారు. ఆయన మాటలు నమ్మి ఎవరైనా రేపటి నుంచి 'ఆర్గానిక్' పేరుతో సారా బాటిళ్లకు అతుక్కుపోతే, వారి జీవితం 110 ఏళ్ల దాకా వెళుతుందో లేదో తెలియదు కానీ, వారి లివర్ మాత్రం త్వరగానే సెలవు తీసుకుంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అనిరుధ్ రెడ్డి గారు తన సారా పురాణం తో కాంగ్రెస్ పార్టీలో కూడా సెంటర్ ఆఫ్ అట్రాక్షన్ అయ్యారు. మరి ఈ ఆర్గానిక్ సారా ఫార్ములాను ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తుందా? లేక ఎమ్మెల్యే గారి వ్యక్తిగత హెల్త్ టిప్‌గా మాత్రమే మిగిలిపోతుందా? అనేది చూడాలి.

# జిల్లాకో రింగ్ రోడ్...

వరంగల్, మార్చి 15

కేంద్రంలో ఎన్డీఏ అధికారంలోకి వచ్చాక జాతీయ రహదారులు, రైలు మార్గాల విస్తరణకు ప్రాధాన్యత ఇస్తోంది. ఒక్క తెలంగాణలోనే 2 వేల కిలోమీటర్లకుపైగా రహదారుల నిర్మాణం చేపట్టింది. తాజాగా రేవంత్ సర్కార్ కూడా రహదారుల విస్తరణ, కొత్త మార్గాల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తోంది. అభివృద్ధికి రహదారులు కీలకంగా మారడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ జిల్లా కేంద్రానికి రింగ్ రోడ్లు నిర్మించేందుకు ప్రణాళిక రచిస్తోంది. ఇది రాష్ట్రవ్యాప్త రవాణా వ్యవస్థను ఆధునికీకరించి, స్థానిక ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుంది.రాష్ట్రంలోని ప్రతీ ప్రధాన జిల్లా కేంద్రం(హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం వంటివి) చుట్టూ రింగ్ రోడ్లు ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు, ఇవి దగ్గర్లోని జాతీయ రహదారులు, హైవేలతో అనుసంధానం కలిగి ఉంటాయి. ఇది హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్, 340?347 కి.మీ. పొడవు, 4?6 లేన్లు)ను సప్లిమెంట్ చేస్తూ, ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్)కు వెలుపలి ప్రాంతాల్లోకి విస్తరిస్తుంది. మొత్తం 1,940 హెక్టార్ల భూమి అవసరం, భూసేకరణ ఇప్పటికే ప్రారంభమైంది.రింగ్ రోడ్ల నిర్మాణంతో 24 పట్టణాలు, 200 గ్రామాలను అనుసంధానం చేస్తుంది. దీంతో ట్రాఫిక్ 30 నుంచి 40 శాతం తగ్గుతుంది. లాజిస్టిక్స్ ఖర్చు తగ్గుతుంది. ఇండస్ట్రియల్ క్లస్టర్లు, లాజిస్టిక్ పార్కులు, రియల్ ఎస్టేట్, ఐటీ హబ్‌లు ఏర్పాటుకు అవకాశం కలుగుతుంది. ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. గ్రీన్‌ఫీల్డ్ రహదారులు, 72 హెక్టార్ల అటవీ భూమి రక్షణ, భవిష్యత్తులో ఆరు లేన్ల విస్తరణతో పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుంది.

ప్రణాళిక అమలులో సవాళ్లు..

భూసేకరణ ఆలస్యాలు, ఖర్చు పెరగడం ప్రధాన సమస్యలు. కానీ ఎన్‌హెచ్ఏఐ సహకారంతో 5 ప్యాకేజీలుగా టెండర్లు పిలిచారు. మూడేళ్లలో పూర్తి చేయాలని ఆర్అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రకటించారు. ఈ రింగ్ రోడ్లు తెలంగాణను లాజిస్టిక్స్ హబ్‌గా మార్చి, గేమ్ చేంజర్ అవుతాయి.

# నాలుగు లేబర్ కోడ్లను వ్యతిరేకిద్దాం

## 16న డి సి ఎల్ కార్యాలయం వద్ద ధర్నాను జయప్రదం చేద్దాం

### ఐఎఫ్టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు రాయపనేని హరికృష్ణ పిలుపు

తిరుపతి ర్చి 15

కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను కుట్రపూరితంగా ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమల్లోకి తీసుకురానిందని దీనిని ప్రతి కార్మికుడు వ్యతిరేకించాలని ఐఎఫ్టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాయపనేని హరికృష్ణ పిలుపునిచ్చారు. శనివారం తిరుపతి నారాయణపురం లోని ఐఎఫ్టియు కార్యాలయంలో ఐఎఫ్టియు నేతల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్రానికి ముందు ఆ తరువాత అనేక ప్రజా ఉద్యమాల ద్వారా కార్మికులు సాధించుకున్న హక్కులను కేంద్ర ప్రభుత్వం తుడిచిపెట్టే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. 1926 ట్రేడ్ యూనియన్ చట్టానికి సవరణలు ప్రతిపాదించి కార్మికుల ప్రాథమిక హక్కు అయినా సమ్మె హక్కును పూర్తిగా దెబ్బతీయడానికి కేంద్రం కుట్రలు చేస్తోందన్నారు. మేడే పోరాటం ద్వారా సాధించుకున్న ఎనిమిది గంటల పని దినాన్ని 12 గంటలుగా మార్చి వేస్తున్నారని, వేతనాన్ని లెక్కించే పద్ధతిని వర్తింపజేసే పద్ధతిని దెబ్బతీయడం ద్వారా, వేతనాలు పెరుగుతున్న ధరలకు అలాగే జీవన వ్యయానికి విరుద్ధంగా కనిష్ట స్థాయికి కుదించాలని చూస్తున్నారన్నారు. పని స్థలాల్లో భద్రతను, రక్షణను యాజమాన్యాల సెల్ఫ్ సర్టిఫికెట్లకు పరిమితం చేస్తున్నారని మండిపడ్డారు. కోట్లాదిమంది కార్మికులు నిర్మాణ రంగంలో పని చేస్తుంటే వారి సంక్షేమ బోర్డుకం నిధులను సమీకరించే సెస్సు వసూళ్లను తగ్గిస్తున్నారన్నారు. అత్యంత ప్రమాదకర పరిస్థితులలో పనిచేసే కార్మికులకు చట్టపరమైన రక్షణలను కేంద్రం తెస్తున్న నాలుగు లేబర్ కోడ్లు హరించి వేస్తాయన్నారు. ఆటో మోటార్ కార్మికులు, హమాలీ ఇతర అనేక రంగాల్లో పనిచేసే కార్మికులకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయడానికి కూడా ఈ లేబర్ కోడ్లు పట్టించుకోలేదన్నారు. అంగన్వాడి, ఆశా , మధ్యాహ్నం భోజన, సర్వ శిక్ష అభియాన్, కస్తూరిబా ఇతర స్కీం వర్కర్లలో బండ చాకిరి చేసే కార్మికుల హక్కులకు భంగం వాటిల్లే ప్రమాదం ఉందని, ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించాలనే డిమాండ్ ఈ కోడ్లు ద్వారా అమలు కాని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమలు కాబోతున్న నాలుగు లేబర్ కోడ్లును అడ్డుకోవడానికి కార్మిక వర్గం సమాయత్తం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈనెల 23న ఐఎఫ్టియు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో విజయవాడలో జరిగే మహా ప్రదర్శన, సభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఈనెల 23న ఛలో విజయవాడ గోడ పత్రిక లను ఆవిష్కరించారు. ఐఎఫ్టీయు జిల్లా కోశాధికారి కుడుం విజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఐఎఫ్టీయు జిల్లా అధ్యక్షురాలు జి.భారతి, అంగన్వాడి కార్యదర్శి నాగరత్న, అధ్యక్షురాలు సుజాత, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పి.రాణి, అధ్యక్షురాలు లక్ష్మి కళ, శాంతి, కవిత, చంద్రగిరి రేఖ, ఏపి ప్రగతిశీల హాకర్స్ యూనియన్ అధ్యక్షుడు దిలీప్, ఐఎఫ్టీయు నాయకులు మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# చాపాడు పరిధిలోని ఖాదరపల్లి గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

## రికార్డులు లేని 16 వాహనాలు స్వాధీనం

కడప మార్చి 15

శనివారం తెల్లవారుఝామున జిల్లాలోని మైదుకూరు సబ్ డివిజన్ చాపాడు పరిధిలోని ఖాదరపల్లి గ్రామంలో " ఆపరేషన్ వజ్రప్రహార్" లో భాగంగా మైదుకూరు డి.ఎస్పీ రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో ఖాదరపల్లి గ్రామంలో కార్డన్ అండ్ సర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. పాత నేరస్తులు మరియు అనుమానితుల ఇళ్లలో, అనుమానిత ప్రాంతాల్లో వేటకొడవళ్లు, బాంబులు మరియు నిషేధిత ఆయుధాల కొరకు అణువణువూ క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. వాహనాల రికార్డులను పరిశీలించారు. తనిఖీల్లో రికార్డులు లేని 16 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. తక్కువ ధరకు ఇస్తున్నారని రికార్డులు లేని వాహనాలు కొనుగోలు చేయ వద్దని, కొనుగోలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు సూచించారు.రౌడీ షీటర్లు, ట్రబుల్ మాంగర్లకు, రెడ్ శాండల్ స్మగ్లర్లకు, సస్పెక్ట్ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామస్థులు ఎవరూ ఎలాంటి గొడవలకు పాల్పడకుండా మీరు మీ పనులు చేసుకుంటూ ఆర్థికంగా ఎదిగి పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. సైబర్ నేరాలపై, ఉమెన్ సేఫ్టీ గురించి మైదుకూరు డి.ఎస్పీ రాజేంద్ర ప్రసాద్ ప్రజలకు అవగాహన కల్పించారు. అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించి లేదా అనుమానితుల సమాచారాన్ని డయల్ 112 ద్వారా పోలీస్ శాఖకు సమాచారమివ్వాలని మైదుకూరు డి.ఎస్పీ శ్రీరాజేంద్ర ప్రసాద్ సూచించారు.క

# రాజశ్యామల ఆలయ ఉత్సవాలకు రండి..హరీష్ రావుకు ఆహ్వానం

హైదరాబాద్ మార్చి 15

కోకాపేట నియోపోలిస్ లోని శ్రీ రాజశ్యామల దేవస్థానంలో ఈ నెల 19న జరగనున్న ప్రభవ నామ సంవత్సర ఉగాది ఆస్థానం, అలాగే 27న జరగనున్న శ్రీరామనవమి వేడుకలకు హాజరుకావాల్సిందిగా మాజీ మంత్రి హరీష్ రావును విశాఖ శ్రీ శారదా పీఠం ఉత్తరాధికారి శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి కోరారు. హరీష్ రావు మాట్లాడుతూ శ్రీ రాజశ్యామల అమ్మవారి కృపాకటాక్షాలు రాష్ట్ర ప్రజలందరిపై మెండుగా ఉండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా ప్రార్థించడం జరిగిందని అన్నారు.

# విధుశేకరుడు నకిలీ శంకరాచార్యులు అతనిపై కేసు నమోదు చేయాలి

తిరుపతి మార్చి 15

స్వర్ణ హంపి పంపా క్షేత్రం, గోవింద ఆనంద సరస్వతి స్వామి మీడియాతో మాట్లాడారు. పంపాలోని కిష్కింద మాత్రమే హనుమంతుడి జన్మస్థానమని దేశవ్యాప్తంగా నిర్ణయం చేయడం జరిగింది. 120 కోట్లతో కర్ణాటక ప్రభుత్వం కిష్కిందలోని హనుమత్ జన్మస్థలాన్ని అభివృద్ధి చేయబోతోంది. వసంత పంచమి రోజు భూమి పూజ జరిగింది. పంపాలో శ్రీవారి కల్యాణోత్సవంలో జరగబోతుందని అన్నారు.

తిరుమలలో హనుమత్ జననం జరిగిందని ఎలాంటి అధీకృత ఆధారాలు తమ వద్దలేదని టిటిడి కోర్టుకు అఫిడవిట్ ద్వారా తెలియజేసింది. భక్తులు ఎవరు కూడా తిరుమలలో హనుమంతుడు జననం జరిగినట్టు నమ్మమని కూడా కోరడం లేదని టీటీడీ ఆ అఫిడవిట్ లో పేర్కొంది.తిరుమలలో అంజనాద్రి అనేందుకు ఎలాంటి ప్రమాణం లేదని అన్నారు.

కర్ణాటకలోని శృంగేరి భారతీ తీర్థస్వామి శంకరాచార్ల జనన విషయంలో శంకర్ పీఠానికి ద్రోహం చేస్తున్నారు. కర్ణాటకలో 14 మంది నకిలీ శంకరాచార్యులు తిరుగుతున్నారు.శృంగేరి శంకర పీఠానికి చెందిన విధుశేకరుడు ఉత్తరాధికారి మాత్రమే. ఆయన శ్రీశైలంలో భ్రమరానీభిక ఆలయ గర్భాలయానికి బలవంతంగా వెళ్లారు. విధుశేకరుడు నకిలీ శంకరాచార్యులు. ఆదిశంకరాచార్యులు 2,500 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన నియమావళిని శృంగేరి పీఠం పాటించడం లేదు. శంకరాచార్యులు పెట్టిన నియమాను ప్రకారం విధిశేఖరుడూ ఉత్తరాధికారి కూడా కాదు. అతని సన్యాసం కూడా శాస్త్రబద్ధంగా జరగలేదు. చంద్రమౌలీశ్వరుడి విగ్రహం కర్ణాటకలోని శృంగేరి పీఠంలో మాత్రమే ఇప్పుడు ఉంది. చంద్రమౌలీశ్వరుడికి పూజ చేస్తున్నట్టుగా విధిశేఖరుడు తిరుపతిలో తప్పుడు ప్రచారం చేసుకుంటున్నాడు. శంకరాచార్యుడు నేనే అని చెప్పి, రాష్ట్రపతి భవన్ లోకి వెళ్ళాడు. అలాగే విధుశేఖరుడు చాలామంది రాజకీయ నాయకుల ఇండ్లకు శంకరాచార్యులు అని చెప్పుకొని వెళుతున్నాడు. నిజాలు తెలుసుకున్న తర్వాత ఇలాంటి పని చేసిన విధిశేఖరుడుపై రాష్ట్రపతి భవన్ విచారణకు ఆదేశించింది. విధిశేఖరుని పై అనేక కేసులు ఉన్నాయి.ఈ నకిలీ స్వామిపై కేసు పెట్టి చంద్రబాబు అతన్ని జైల్లో వేయాలని అన్నారు.

శంకరచార్యులు పై త్రిదండి చిన్నజీయర్ స్వామి కామెంట్స్ పై గోవింద ఆనంద సరస్వతి స్పందించారు. శంకరాచార్యులు వారే నాలుగు పీఠాలను ఏర్పాటు చేశారని, మేము నిరూపిస్తే త్రిదండి చిన్నజీయర్ స్వామి సమతామూర్తి రామానుజాచార్య విగ్రహం తీసి శంకరాచార్యులు విగ్రహం పెడతారా.. రామానుజాచార్యులకి నిలువు నామం తీసి అడ్డ నామం పెడతారా. మీరు ఏ రియల్ ఎస్టేట్ వ్యాపారనీ చేసుకుంటే చేసుకోండి...శంకరాచార్యుల జోలికి మాత్రం రాకండని అన్నారు.

# పంటకాలువ పేరుతో కక్ష సాధింపు.... జగనన్న కాలనీలోని ప్లాట్లపై పంట కాలువ తవ్వకాలు...ముందస్తు సమాచారం శూన్యం....

**"అప్పుడు ఇచ్చింది మీరే.. ఇప్పుడు తీసేది మీరేనా?"..**

**.జగనన్న ఇంటి పట్టాలను చేతపట్టి లబ్ధిదారులు నిరసన..**

**.బాధితులకు భరోసా ఇవ్వని అధికారులు....**

**రేణిగుంట జగనన్న కాలనీ బాధితుల కన్నీటి గాథ...**

**కాలువ తవ్వకం వల్ల సుమారు 43 ఇళ్లు కోల్పోయే ప్రమాదం**

రేణిగుంట మార్చి 15

సొంతింటి కల సాకారం చేసుకున్నామన్న ఆనందం ఆ పేదల దరి చేరకముందే, వారి ఆశలపై 'కాలువ' రూపంలో గొడ్డలి పెట్టు పడింది. అధికారుల నిర్లక్ష్యం, రాజకీయ నాయకుల కక్ష సాధింపుల మధ్య రేణిగుంట మండలంలోని అడుసుపాళెం జగనన్న లేఅవుట్ లబ్ధిదారులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.?ముందస్తు సమాచారం లేదు.. మ్యాప్ సాకుతో తవ్వకాలు?గత ప్రభుత్వ హయాంలో ఎల్లమంధ్యం పంచాయతీ పరిధిలోని అడుసుపాళెం వద్ద సుమారు 3500 ప్లాట్లను సర్వే చేసి పేదలకు పంపిణీ చేశారు. అయితే, ప్రస్తుతం అధికార పార్టీ నేతల ఒత్తిడితో రెవెన్యూ యంత్రాంగం 'పంట కాలువ' పేరుతో ప్లాట్ల మధ్యలో తవ్వకాలు చేపడుతోంది. కనీసం నోటీసులు ఇవ్వకుండా, ముందస్తు సమాచారం లేకుండా జేసీబీలతో ప్లాట్లను ధ్వంసం చేయడంపై లబ్ధిదారులు మండిపడుతున్నారు.

నిబంధనలు గాలికి.. అధికారుల మౌనం:-?సాధారణంగా ఏదైనా నిర్మాణం లేదా కాలువ తవ్వకం చేపట్టే ముందు లబ్ధిదారులకు నోటీసులు ఇవ్వాలి. ఒకవేళ సాంకేతిక కారణాలతో ప్లాట్లు కోల్పోతుంటే, వారికి ప్రత్యామ్నాయ స్థలాలు చూపాలి. కానీ, రేణిగుంటలో అవేవీ పట్టించుకోకుండా అధికారులు 'ప్రేక్షక పాత్ర' పోషిస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేదని బాధితులు చెప్తున్నారు.పేదవాడి సొంతింటి కలపై ఇలాంటి 'కక్ష సాధింపు' చర్యలు చేపట్టడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

============

# ఏపీలో పూర్వీకుల స్థలాల రిజిస్ట్రేషన్‌లో వీడిన చిక్కులు

## కొత్తగా మార్గదర్శకాలు జారీ చేసిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

కడప మార్చి 15

ఇకపై రిజిస్ట్రేషన్‌కు రెవెన్యూ శాఖ సర్టిఫికెట్ తప్పనిసరి కాదుఏపీలో పూర్వీకుల నుంచి వచ్చిన స్థలాలను ఈజీగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.. పూర్తి వివరాలివేఏపీలో పూర్వీకుల నుంచి వారసత్వంగా వస్తున్న వ్యవసాయేతర స్థలాల రిజిస్ట్రేషన్‌కు చిక్కుముడులు వీడాయి. ఈ మేరకు ఏపీ ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ స్థలాలను ఈజీగా రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఇకపై రిజిస్ట్రేషన్‌కు రెవెన్యూ శాఖ సర్టిఫికెట్ అవసరం లేదు. సెల్ఫ్ డిక్లరేషన్ ఇస్తే సరిపోతుందని ఏపీ ప్రభుత్వం తెలిపింది.. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారసత్వంగా పూర్వీకుల నుంచి వచ్చే వ్యవసాయేతర స్థలాల రిజిస్ట్రేషన్లకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఈ భూముల రిజిస్ట్రేషన్‌లకు సంబంధించిన వివాదాలకు పరిష్కరించేందుకు కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ మేరకు గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయేతర (నాన్ యూఎల్‌బీ) స్థలాలకు సంబంధించి రిజిస్ట్రేషన్‌కు రెవెన్యూ శాఖ సర్టిఫికెట్ తప్పనిసరి కాదని తెలిపారు. అయితే స్థలం యజమానులు సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. రాష్ట్రంలోని అన్ని రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రభుత్వం జారీ చేసిన ఈ మార్గదర్శకాలను అమలు చేయాలని ఆదేశించారు.చాలామందికి వారసత్వంగా పూర్వీకుల నుంచి వ్యవసాయేత భూములు వచ్చాయి. అయితే భూముల రిజిస్ట్రేషన్ చేసేందుకు హక్కు ఉన్నట్లు వీరి ఎలాంటి ఆధారాలు లేవు. అందుకే భవిష్యత్తులో చిక్కులు ఎదురవ్వకుండా రెవెన్యూ అధికారుల నుంచి యాజమాన్య హక్కు ఉన్నట్లుగా పొజిషన్ సర్టిఫికెట్ తీసుకురమ్మని రిజిస్ట్రార్లు అడుగుతున్నారు. అయితే రెవెన్యూ శాఖ నుంచి సర్టిఫికెట్ తీసుకోవడం ఇబ్బంది అవుతోంది. అందుకే ఈ ఇబ్బందులకు పరిష్కారంగా, వివాదాలను నివారించేందుకు ప్రభుత్వం కొత్తగా మార్గదర్శకాలను జారీ చేసింది..అంతేకాదు ఈ భూముల (గ్రామీణ ప్రాంతాల్లో పూర్వీకుల నుంచి సంక్రమించిన వ్యవసాయేతర స్థలాలు) రిజిస్ట్రేషన్ సమయంలో ఇంకో సూచన చేశార. అంతేకాదు ఈ ఆస్తి వారసత్వంగా వచ్చిందని, ఇతరులకు హక్కు లేదని, నిషేధిత జాబితా (22ఏ)లో లేదని కచ్చితంగా డాక్యుమెంట్‌లో స్పష్టంగా ప్రస్తావించాలి. రిజిస్ట్రేషన్ చేయబోయే స్థలానికి పూర్తి హక్కుదారు తామేనని సెల్ఫ్ డిక్లరేషన్ కచ్చితంగా ఇవ్వాల్సిందే. ఒకవేళ రిజిస్ట్రేషన్ సమయంలో తప్పుడు సమాచారం ఇచ్చినట్లు తేలితే సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటారని ప్రభుత్వం హెచ్చరించింది. అంతేకాదు రిజిస్ట్రార్లు ఆధార్ ఆధారంగా బయోమెట్రిక్ ధ్రువీకరణ తప్పనిసరి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఒకవేళ కుటుంబ వివాదాలు, ప్రభుత్వ భూమి అనే అనుమానాలు వస్తే కనుక ఆ భూమి రిజిస్ట్రేషన్ నిలిపివేస్తారు.. ఆ అధికారం అధికారులకు ఇచ్చింది ప్రభుత్వం. మొత్తం మీద ఏపీ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో పూర్వీకుల నుంచి సంక్రమించిన వ్యవసాయేతర స్థలాల రిజిస్ట్రేషన్‌పై కీలక నిర్ణయం తీసుకుంది.

# మునిసిపల్ అధికారులపై వర్మ మండిపాటు

పిఠాపురం మార్చి 15

పిఠాపురం మున్సిపల్ అధికారులపై టీడీపీ ఇన్చార్జ్ వర్మ ఆగ్రహం వ్యక్తం చేసారు. పారిశుద్ధ కార్మికుల శిక్షణ కార్యక్రమం మధ్యలో నుండి అలిగి వెళ్ళిపోయారు. వేదికపై ఉన్న ఫెక్సీ లో డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ ఫోటో పెద్దదిగా, సీఎం చంద్రబాబు ఫోటో చిన్నదిగా ఉండడంపై న టీడీపీ నేతలు మండిపడ్డారు. మున్సిపల్ కమిషనర్ తీరుపై వర్మ అసహనం వ్యక్తం చేసారు. చంద్రబాబుకు గౌరవం లేనప్పుడు.. మేమేందుకు ఇక్కడ అంటూ సమావేశం నుండి తన అనుచరులతో వాకౌట్ చేసారు.

# అన్నదాతలు ఎప్పుడూ సుఖంగా ఉండాలి



రాయచోటి, మార్చి 15

పదిమందికి పట్టెడన్నం పెట్టే అన్నదాతలు ఎప్పుడూ సుఖ సంతోషాలతో ఉండాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆకాంక్షించారు.జిల్లాలో అర్హులైన ప్రతి రైతుకూ అన్నదాత సుఖీభవ పథకం కింద లబ్ధి అందాలన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఇందులో భాగంగా జిల్లాలో మూడవ విడత కింద రెండు రోజుల క్రితం జిల్లా లో రూ.1,88,408మంది రైతులకు రూ.108 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందని చెప్పారు .శనివారం అన్నదాత సుఖీభవ, జల ధార, ఉపాధి హామీ తదితర ముఖ్యమైన అంశాలపై అధికారులతో సమగ్రంగా జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా రాయలసీమ ప్రాంతంలో కరువు జిల్లాగా ఉందని ప్రతి సంవత్సరం వర్షపాతం తక్కువగా ఉంటుందని కాబట్టి కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన నదుల అనుసంధానం కార్యక్రమాన్ని దృష్టిలో పెట్టుకొని స్వర్ణాంధ్ర - 2047లోని దాదాపు 10 సూత్రాలను ఆధారంగా ప్రాజెక్టు జలధార కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు.

జిల్లాలో గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రోజుకు సుమారు 20 వేల నుండి 30 వేల వరకు కార్మికులు అందుబాటులో ఉండటంతో చెరువుల పునరుద్ధరణ, ఫీడర్ కాలువల శుభ్రపరిచే పనులు, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచే పనులు చేపట్టడం జరిగిందన్నారు. జిల్లాలో దాదాపు 70 వరకు పనులను గుర్తించి, అవసరమైన చోట్ల మెషిన్ల సహాయంతో శు భ్రపరిచే పనులు నిర్వహించారు. ఈ పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి అదనపు బడ్జెట్ కోరలేదని, జిల్లాలో అందుబాటులో ఉన్న నిధులతోనే సుమారు రూ.1 కోటి 70 లక్షల వ్యయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేశారు.ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి ప్రతి మండలంలోని అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రతి ఆదివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తూ మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో , ఇరిగేషన్ అధికారులు కలిసి చెరువులకు నీరు చేరే విధంగా కార్యాచరణ రూపొందించామని, ఫలితంగా జిల్లాలోని చెరువులు, కుంటలు, వాగులు, వంకలలో నీరు నిల్వ ఉండే పరిస్థితి ఏర్పడిందని అన్నారు.ఇటీవల వచ్చిన రెండు సార్లు కురిసిన అకాల వర్షాల కారణంగా కురిసిన వర్షాలను సమర్థవంతంగా నిల్వ చేసుకునే విధంగా చర్యలు తీసుకున్నామని తెలిపారు. సాధారణంగా పెద్ద ఇరిగేషన్ ప్రాజెక్టులు నిర్మించాలంటే వేల కోట్ల రూపాయలు, భూసేకరణ మరియు అనేక సంవత్సరాల సమయం అవసరం అవుతుందని, కానీ తక్కువ వ్యయంతో ఫీడర్ ఛానల్స్ శుభ్రపరిచే కార్యక్రమం ద్వారా మంచి ఫలితాలు సాధించామని తెలిపారు.గత ఏడాది ఆగస్టు నెలలో జిల్లాలో ఉ పరితల జలాలు ) కేవలం 3 టిఎంసీలుగా ఉండగా, ప్రస్తుతం అవి 14 టిఎంసీలకు పెరిగాయి. అంటే 11 టిఎంసీల పెరుగుదల నమోదైంది. ఒక టిఎంసీ నీటితో సుమారు 10,000 ఎకరాలకు సాగునీరు అందించవచ్చని అంచనా. ఈ లెక్కన లక్ష ఎకరాలకు పైగా సాగుకు నీరు అందే అవకాశం ఏర్పడిందన్నారు.అలాగే భూగర్భ జలాల పరంగా కూడా జిల్లాలో సుమారు 35 టిఎంసీల మేర నీటి నిల్వ పెరిగినట్లు వెల్లడించారు. ఎటువంటి కొత్త ఇరిగేషన్ ప్రాజెక్టులు నిర్మించకుండా కేవలం ఫీడర్ ఛానల్స్ శు భ్రపరచడం ద్వారా ఈ స్థాయి ఫలితాలు సాధించగలిగామని జిల్లా కలెక్టర్ అన్నారు.సాటిలైట్ చిత్రాల ఆధారంగా పరిశీలించినప్పుడు గత సంవత్సరం ఫిబ్రవరి చివరి నాటితో పోలిస్తే ఈ సంవత్సరం ఫిబ్రవరి చివరికి జిల్లాలోని చెరువులు, కుంటలు, వాగులు, వంకలు వంటి నీటి వనరుల విస్తీర్ణం సుమారు 11,341 ఎకరాలు పెరిగినట్లు తెలిపారు. ఇదే సమయంలో రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉ ందని అన్నదాత సుఖీభవ పథకం కింద మూడో విడతగా జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు, మండలాలను కలిపి మొత్తం 1 లక్ష 88 వేల మంది రైతులకు సుమారు రూ.108 కోట్ల ఆర్థిక సహాయం విడుదల చేయబడుతోంది. ఇందులో ఈ నియోజకవర్గానికి మాత్రమే రూ.22 కోట్ల రూపాయలు విడుదల అవుతున్నాయి.ఇప్పటివరకు మొదటి, రెండో, మూడో విడతలను కలిపి ఈ నియోజకవర్గంలోనే సుమారు రూ.75 కోట్ల సహాయం అందించడం జరిగిందని, జిల్లా వ్యాప్తంగా మొత్తం రూ.254 కోట్ల రూపాయలు రైతులకు అందించబడినట్లు తెలిపారు. రైతుల ఆర్థిక భారం తగ్గించడానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉ ందని అధికారులు పేర్కొన్నారు.

పాత అన్నమయ్య జిల్లా ప్రాతిపదికన నియోజకవర్గాల వారీగా అన్నదాత సుఖీభవ - పి.ఎం.కిసాన్ మూడవ విడత వివరాలు. 1.నియోజకవర్గం : రాయచోటి రైతుల సంఖ్య : 39,031అన్నదాత సుఖీభవ లబ్ది మొత్తం రూ.15.61 కోట్లు, పి.ఎం.కిసాన్ లబ్ది మొత్తం రూ.6.66 కోట్లు, మొత్తం రూ.22.27 కోట్లు. 2.నియోజకవర్గ: పీలేరు.రైతుల సంఖ్య : 38,490అన్నదాత సుఖీభవ లబ్ది మొత్తం రూ.15.40 కోట్లు, పి.ఎం.కిసాన్ లబ్ది మొత్తం రూ.6.75 కోట్లు, మొత్తంగా రూ.22.15 కోట్లు.3.నియోజకవర్గం : మదనపల్లి.రైతుల సంఖ్య : 20,162×అన్నదాత సుఖీభవ లబ్ది మొత్తం రూ. 8.06 కోట్లు, పి.ఎం.కిసాన్ లబ్ది మొత్తం రూ.3.66 కోట్లు, మొత్తంగా రూ.11.72 కోట్లు.4.నియోజకవర్గం : తంబలపల్లి.రైతుల సంఖ్య : 44,867అన్నదాత సుఖీభవ లబ్ది మొత్తం రూ.17.95 కోట్లు, పి.ఎం.కిసాన్ లబ్ది మొత్తం రూ.7.83 కోట్లు, మొత్తంగా రూ.25.78 కోట్లు.5.నియోజకవర్గం : రాజంపేట.రైతుల సంఖ్య : 21,236అన్నదాత సుఖీభవ లబ్ది మొత్తం రూ.8.49 కోట్లు, పి.ఎం.కిసాన్ లబ్ది మొత్తం రూ.3.82 కోట్లు, మొత్తంగా రూ.12.31కోట్లు.6.నియోజకవర్గం : కోడూరు×.రైతుల సంఖ్య : 24,622అన్నదాత సుఖీభవ లబ్ది మొత్తం రూ.9.85 కోట్లు, పి.ఎం.కిసాన్ లబ్ది మొత్తం రూ.4.35 కోట్లు, మొత్తంగా రూ.14.20 కోట్లు.ఇందులో మొత్తం 1,88,408 మంది రైతులకు దాదాపుగా రూ. 108కోట్లు జమ చేయడం జరిగింది.అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకం రాయచోటి నియోజకవర్గం లోని 39.031 మంది రైతులకు 22.27 లక్షల మెగా చెక్కును లబ్దిదారులకు అందజేశారు. రైతు సాధికార సంస్థ అన్నమయ్య జిల్లా వారి ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శనలను సందర్శించారు.ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ వారి ఆధ్వర్యంలో జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం క్రింద తేది. 16.3.2026 నుండి 29.04.2026 గాలుకుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం పోస్టర్ను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్,టిడిపి నాయకులు మండిపల్లి లక్ష్మి ప్రసాద్ రెడ్డి, మార్కెటింగ్ యాప్ చైర్మన్ రామ చంద ప్రసాద్, పశుసంవర్ధక శాఖ అధికారి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# విట్ట శ్రీనివాస్ రెడ్డి అంతిమయాత్రలో ఎమ్మెల్యే మేఘారెడ్డి



వనపర్తి. మార్చి 15

తన చివరి మజిలీకి శ్రీనివాస్ రెడ్డి ని భుజాలపై మోసిన ఎమ్మెల్యే.కన్నీటి పర్యంతమై కడసారి వీడ్కోలు చెప్పారు.తెలియని పాశం వెంటపడి రుణం తీర్చుకో మంటుంది నీ భుజం మార్చుకోమంటుంది అని ఆనాడు ఆచార్య ఆత్రేయ రాసిన గీతం నేటికీ ప్రతి ఒక్కరిని కంటతడి పెట్టిస్తుంది.సరిగ్గా అలాంటి సన్నివేశమే నేడు పెద్దమందడి మండలం అమ్మపల్లి లో చోటుచేసుకుంది.ఎంతో మంది మదిలో సుస్థిర స్థానం సంపాదించుకొని ప్రజా నాయకుడిగా పేరొంది అశువులు బాసిన నాయకుడి అంతిమయాత్రలో ఎమ్మెల్యే మేఘారెడ్డి పాల్గొని శ్రీనివాస్ రెడ్డి పాడెమోశారు×బిశ్రీనివాస్ రెడ్డి మరణ వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే శుక్రవారం రాత్రి అమ్మపల్లి చేరుకునీ ఆయన మృతదేహానికి పూలమాలు వేసి నివాళు లర్పించారు.శనివారం ఉదయం 10 గంటలకు అమ్మపల్లి చేరుకొని ఆయన అంతిమయాత్రలో పాల్గొన్నారు.మూడు, నాలుగు గంటల పాటు అక్కడే ఉన్న ఎమ్మెల్యే ఆయన పాడె మోసి కన్నీటితో చివరి వీడ్కోలు పలికారు.ఆస్తుల కంటే ఆప్తులను సంపాదించుకోవడమే అసలైన జీవితం అని శ్రీనివాస్ రెడ్డి అంతిమ యాత్ర కనులకు కట్టినట్లుగా చూపించిందంటూ ఆయన తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు

# అంతర్జాతీయ క్రికెట్ కు ఎంపికైన- సూర్యాపేట జిల్లా వాసి

## -టి20, వన్డే మ్యాచ్ లకు ఎంపికైన బొబ్బ భరత్ రెడ్డి
## -ప్రత్యేకంగా అభినందించిన మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి



సూర్యాపేట(భారత శక్తి జిల్లా ప్రతినిధి) మార్చి 15:

పట్టుదలతో కష్టపడి సాధన చేస్తే అందనిదేదీ ఉండదని హుజూర్నగర్ యువకుడు బొబ్బ భరత్ రెడ్డి మరొామారు నిరూపించారు. సూర్యాపేట జిల్లా హుజూర్నగర్ నుంచి క్రికెట్ లో అంతర్జాతీయ స్థాయికి ఎదిగాడు. ప్రస్తుతం నల్లగొండ జిల్లా క్రికెట్ అసోసియేషన్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న బొబ్బ భరత్ రెడ్డి ఈనెల 15వ తేదీ నుంచి శ్రీలంకలో జరిగే అంతర్జాతీయ స్థాయి ఓపెన్ కేటగిరి టి20, వన్డే క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. భరత్ రెడ్డి తల్లిదండ్రులు భాస్కర్ రెడ్డి, నిర్మల ఇరువురు ప్రభుత్వ ఉపాధ్యాయులు అయినప్పటికీ ఆయనను క్రీడారంగంలో ప్రోత్సహించడం విశేషం. డిగ్రీ పూర్తి చేసిన భరత్ గత ఏడేళ్లుగా బుచ్చిబాబు, ఇంద్రశేఖర్ రెడ్డి అనే కోచ్ ల వద్ద క్రికెట్ లో శిక్షణ తీసుకుంటున్నాడు. ప్రతిరోజు ఎనలేని సాధనతో బౌలర్ గా మంచి గుర్తింపు పొందాడు. భరత్ రెడ్డి ఇప్పటివరకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలతోపాటు పలు టోర్నమెంట్లలో 100 కు పైగా వికెట్లు తీసి సత్తా చాటాడు. భరత్ స్టార్ట్ బౌలర్ సిరాజ్ ను ఆదర్శంగా తీసుకుని మంచి బౌలర్ గా రాణిస్తున్న భరత్ భవిష్యత్తులో భారత క్రికెట్ జట్టుతో పాటు ఐపీఎల్ లో చోటు సాధించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నాడు. ఈ నెల 15 నుంచి క్రికెట్ లో తన సత్తా చాటేందుకు శ్రీలంక వెళుతున్న భరత్ రెడ్డిని మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ లో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసిన భరత్ రెడ్డిని క్రికెట్ లో మంచి ప్రతిభ కనబరిచి సొంత ఊరుతో పాటు సూర్యాపేట, నల్లగొండ జిల్లాకు, అలాగే తెలంగాణ రాష్టానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపి అభినందించారు.

# భైంసా మున్సిపాలిటీని అడిషనల్ కలెక్టర్ సందర్శన

## అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష




ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 15 (భారత శక్తి):రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల 'ప్రజా పాలన' కార్యక్రమంలో భాగంగాాజూదీ అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆదివారం భైంసా మున్సిపాలిటీని సందర్శించారు. మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును ఆయన సమీక్షించారు.

ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ వై. నవీన్, మున్సిపల్ చైర్మన్ దత్తాత్రి లతో కలిసి మున్సిపాలిటీ కార్యాలయాన్ని పరిశీలించారు. మున్సిపాలిటీలో అమలవుతున్న వివిధ కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు విధానంపై అధికారులతో చర్చించి వివరాలు తెలుసుకున్నారు.

ప్రభుత్వ పథకాలు ప్రజలకు సమర్థవంతంగా చేరేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. అలాగే అన్ని రికార్డులను పకడ్బందీగా నిర్వహిస్తూ, పనుల అమలులో పారదర్శకత పాటించాలని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు సకాలంలో అందించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు.

మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులు నాణ్యతతో, పారదర్శకంగా నిర్వహించాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వై. నవీన్, మున్సిపల్ చైర్మన్ దత్తాత్రి, వైస్ చైర్మన్ మీర్జా ఇద్రిస్ బేగ్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అయిల్ ఫామ్ ను పరిశీలించిన మంత్రులు తుమ్మల, పొన్నం

నర్మెట్ట మార్చి 15

ఈనెల 22 వ తేదీన సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్ట లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని ప్రారంభించనుననారు. ఈ నేపథ్యంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో మంత్రి పొన్నం ప్రభాకర్ నర్మెట్టలోని ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ లో ఏర్పాట్లను పరిశీలించారుర.



మంత్రి పొన్నం మాట్లాడుతూ ఈ మధ్య గుజరాత్ వెళ్లినప్పుడు అక్కడ పాల సేకరణ గ్రామీణ స్థాయి నుండి జరుగుతుంది..అక్కడ అమూల్ పాలు దేశ వ్యాప్తంగా వ్యాపించాయి. ఇక్కడ ఆయిల్ ఫామ్ కి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్టార్ట్ చేశారు.. ప్రతి జిల్లాలకు ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభించాలని భావిస్తున్నారు. ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ గతంలో ప్రతిపాదనలు జరిగినప్పటికీ 300 కోట్లు కేటాయించి తుమ్మల నాగేశ్వరరావు పనులు పూర్తి చేయించారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

ఈ ప్రాంత రైతాంగానికి ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రాంత రైతులు ఆయిల్ ఫామ్ పై దృష్టి సారించాలి..మా ప్రాంతంలో ఆయిల్ ఫామ్ పంట పండదు అనే అపోహ నుండి తుమ్మల బయటకు తీసుకొచ్చారు. ఇక్కడి రైతులు ఆయిల్ ఫామ్ పై ఆసక్తి చూపుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలు దృష్ట రైతులు ఆయిల్ పామ్ సాగు చేయాలనీ ఈ ప్రాంత రైతులను కోరుతున్న . ఈ ఆయిల్ ఫ్యాక్టరీ కి రూపం తెచ్చిన మంత్రికి ధన్యవాదాలని అన్నారు

==============================

# సూర్యాపేట మున్సిపాలిటీని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తాం: వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి,ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి



సూర్యాపేట(భారత శక్తి జిల్లా ప్రతినిధి)మార్చి 15:

సూర్యాపేట పట్టణాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామని సూర్యాపేట మున్సిపల్ చైర్ పర్సన్ మరిశెట్టి నివేదిత లక్ష్యాలు అన్నారు.మున్సిపల్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఖచ్చితంగా అమలు చేస్తామని చెప్పారు. ఆదివారం సూర్యాపేట పట్టణంలోని 36 వార్డు హౌసింగ్ బోర్డ్ కాలనీలో జరిగిన ఉప్పలమ్మ తల్లి పూజా కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.కార్యక్రమంలో మరో ముఖ్య అతిథులుగా పాల్గొన్న సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, ఎసిసి సభ్యులు సర్వోత్తమ్ రెడ్డి పాల్గొని మాట్లాడారు.

వార్డు కౌన్సిలర్ ఫరూక్, కౌన్సిలర్ లు కొండపల్లి దిలీప్ రెడ్డి, కొణతం రాజేష్ లు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ సూర్యాపేట పట్టణంలోని ప్రతి వార్డులో క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నామని వార్డు ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తున్నామని అన్నారు. పట్టణ ప్రజాపాలన పట్టణ ప్రణాళిక కార్యక్రమంలో వార్డులలో పచ్చదనం, పరిశుభ్రత కు ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన చెప్పారు. పట్టణం ప్రశాంతంగా ఉంటేనే ప్రజలు జీవించడానికి ఇష్టపడతారని, అటువంటి పరిస్థితులను సూర్యాపేటలో కల్పిస్తామని ఆయన చెప్పారు. సూర్యాపేట లో శాంతి భద్రతల పరిస్థితి పై దృష్టి సారించామని, పట్టణంలో ఎక్కడైనా బహిరంగంగా మద్యం సేవించిన, గంజాయి బ్యాచులు తిరిగిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణంలో మహిళలను వేధించిన, ఈవ్ టీజింగ్ వంటి చర్యలకు పాల్పడిన అటువంటి వారిపై చట్ట ప్రకారం కఠినంగా వ్యవహరిస్తామని ఆయన హెచ్చరించారు. సూర్యాపేటలో పార్కుల అభివృద్ధికి 20 కోట్ల రూపాయలు మంజూరు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరినట్లు ఆయన తెలిపారు. వార్డు కౌన్సిలర్ కాలనీవాసులు కోరినట్లు కాలనీని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రతి వార్డులో సమస్యల పరిష్కారం చేస్తామని, దశలవారీగా వార్డుల అభివృద్ధి చేస్తామని చెప్పారు. సూర్యాపేటలో డ్రైనేజీ తవ్వకాలు వల్ల రోడ్డు దెబ్బతిన్న మాట వాస్తవమేనని,రోడ్ల పరిస్థితిని మార్చటానికి ఎల్లవేళలా కృషి చేస్తామని చెప్పారు. సామూహిక ఉత్సవాలు చేసుకోవడం వల్ల ప్రజలలో ఐకమత్యం పెరుగుతుందని, కులాలకు మతి మతాలకు అతీతంగా పండగలు జరుపుకునే సంస్కృతి సూర్యాపేటలో ఉందని ఆయన అన్నారు. కాలనీలో రిటైర్ అయిన వారిని సన్మానించుకోవడం చాలా సంతోషంగా ఉందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# నేర రహిత సమాజమే లక్ష్యం.....కార్డన్ అండ్ సెర్చ్' 'వజ్రప్రహార్'లో భాగంగా 23 వాహనాల సీజ్....



రేణిగుంట మార్చి 15

పద్మానగర్‌లో భారీ కార్డన్ సెర్చ్ నిర్వహించిన రేణిగుంట రూరల్ సీఐ మంజునాథ్ రెడ్డి"....శాంతిభద్రతల పరిరక్షణ మరియు నేరాల నియంత్రణే లక్ష్యంగా తిరుపతి జిల్లా పోలీసు యంత్రాంగం పిలుపు మేరకు, శనివారం ఉదయం రేణిగుంట మండలం పద్మానగర్ గ్రామంలో గాజులమండ్యం పోలీసులు "వజ్రప్రహార్" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పోలీసులు భారీస్థాయిలో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించి ముమ్మర తనిఖీలు చేపట్టారు.?రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు నేతృత్వంలో, రేణిగుంట రూరల్ సీఐ మంజునాథ్ రెడ్డి, గాజులమండ్యం ఎస్సై నాగరాజు మరియు సబ్ డివిజన్ పోలీస్ సిబ్బంది ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. తెల్లవారుజాము నుంచే పద్మానగర్ గ్రామ సరిహద్దులను దిగ్బంధించి, అనుమానిత వ్యక్తులు మరియు వాహనాలపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. కార్డన్ అండ్ సెర్చ్ తనిఖీల్లో భాగంగా సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 22 ద్విచక్ర వాహనాలు మరియు ఒక ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.?తనిఖీల అనంతరం రూరల్ సీఐ మంజునాథ రెడ్డి గ్రామస్తులతో ముఖాముఖి మాట్లాడి, గంజాయి వినియోగం వల్ల కలిగే అనర్థాలు, సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు ట్రాఫిక్ నిబంధనల గురించి వివరించారు. ముఖ్యంగా మహిళల భద్రత కోసం ప్రతి ఒక్కరూ తమ మొబైల్ ఫోన్లలో 'శక్తి యాప్' డౌన్‌లోడ్ చేసుకోవాలని డీఎస్పీ పిలుపునిచ్చారు. ఇది అత్యవసర సమయాల్లో పోలీసుల సహాయం త్వరగా అందేలా చూస్తుందని తెలిపారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు లేదా అపరిచితులు అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

# ఆళ్లగడ్డ పట్టణంలో జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ఆళ్లగడ్డ మార్చి 15


జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారంనాడు నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో వేడుకలు మిన్నంటాయి. నియోజకవర్గ తాలూకా జనసేన పార్టీ సీనియర్ నాయకులు ఇరిగెల రాంపుల్లారెడ్డి సోదరులు, ఇరిగెల సూర్యనారాయణ రెడ్డి, యువనేత ఇరిగెల భరత్ కుమార్ రెడ్డిల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత పార్టీ కార్యాలయం వద్ద జనసేన పతాకాన్ని ఇరిగెల సూర్యనారాయణ రెడ్డి ఆవిష్కరించారు. జై జనసేన.జై పవన్ కళ్యాణ్ అంటూ నినాదాలు చేశారు. 12 ఏళ్లు పూర్తి చేసుకుని 13వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు.ఈ సందర్భంగా ఇరిగెల సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ జనసేన అధినేత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశించిన మార్పు కోసం, సిద్ధాంతాల కోసం ప్రతి జనసైనికుడు సైనికుడిలా పనిచేయాలి. రాష్ట్ర ప్రయోజనాలే ధ్యేయంగా పుట్టిన జనసేన పార్టీ, నేడు ప్రజల గుండెల్లో బలమైన స్థానాన్ని సంపాదించుకుంది.

# కొరియాలో వరుణ్ తేజ్ 'కొరియన్ కనకరాజు'...
## చివరి షెడ్యూల్ షురూ



మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ కథానాయకుడిగా నటిస్తున్న కొత్త చిత్రం 'కొరియన్ కనకరాజు'. హారర్ కామెడీ జానర్‌లో వస్తున్న ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది. తాజాగా చిత్ర యూనిట్ చివరి షెడ్యూల్ కోసం దక్షిణ కొరియాకు పయనమైంది. అక్కడ కీలకమైన చిత్రీకరణను ప్రారంభించినట్టు సమాచారం. దర్శకుడు మేర్లపాక గాంధీ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. కొరియాలో వారం రోజుల పాటు ఈ చివరి షెడ్యూల్ జరగనుంది. ఈ షెడ్యూల్‌లో వరుణ్ తేజ్, హీరోయిన్ రితికా నాయక్, నటుడు సత్యలపై కొన్ని ముఖ్యమైన సన్నివేశాలతో పాటు పాటలను కూడా చిత్రీకరించనున్నారు. కొరియాలోని అందమైన లొకేషన్లలో ఈ షూటింగ్ జరగనుంది. ఇప్పటికే ఇండియాలో మేజర్ పార్ట్ షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం, ఈ షెడ్యూల్‌తో చిత్రీకరణను పూర్తి చేసుకోనుంది. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు సంయుక్తంగా ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నాయి. ఇండియా, కొరియా నేపథ్యంలో సాగే ఈ కథలో వరుణ్ తేజ్ మునుపెన్నడూ చూడని కొత్త అవతార్‌లో కనిపిస్తారని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే వరుణ్ తేజ్ పుట్టినరోజున విడుదలైన టైటిల్ గ్లింప్స్ సినిమాపై అంచనాలను పెంచింది. ఈ చిత్రానికి తమన్ సంగీతం అందిస్తుండగా, మనోజ్ రెడ్డి కాటసాని సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. కొరియా షెడ్యూల్ పూర్తయిన వెంటనే పోస్ట్‌ప్రొడక్షన్ పనులు వేగవంతం చేయనున్నారు.

## కొత్తింట్లో చేరిన 'దంగల్' నటి



'దంగల్', 'మిసెస్' వంటి చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ నటి సాన్యా మల్హోత్రా తన సొంతింటి కలను నెరవేర్చుకున్నారు. ముంబైలో కొనుగోలు చేసిన కొత్త ఇంట్లో ఆమె శనివారం గృహప్రవేశ పూజను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు సంబంధించిన ఫోటోలను తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పంచుకున్నారు. ఈ పూజా కార్యక్రమాల్లో సాన్యా గులాబీ రంగు చీరలో, వెండి ఆభరణాలతో సంప్రదాయబద్ధంగా కనిపించారు. ఆమె తల్లిదండ్రులు, సన్నిహితులు ఈ వేడుకలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాన్యా ఓ భావోద్వేగ సందేశాన్ని పంచుకున్నారు. "సంవత్సరాల కలలు, కృషి, ఎదుగుదల ఫలితమే ఈ ఇల్లు. ఓర్పు, నమ్మకం యొక్క ఫలం ఎంత అందంగా ఉంటుందో ఈ ఇంటి ప్రతీ గోడ నాకు గుర్తుచేస్తుంది. నా ఈ ప్రయాణంలో నా కుటుంబం, స్నేహితుల నమ్మకమే నాకు అతిపెద్ద బలం. ఇది కేవలం ఇల్లు కాదు, నా ప్రయాణంలో ఒక చిన్న భాగం" అని ఆమె పేర్కొన్నారు. ఇక సాన్యా సినిమాల విషయానికొస్తే, ప్రస్తుతం అనురాగ్ కశ్యప్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'బందర్' చిత్రంలో ఆమె కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇందులో ఆమె తొలిసారిగా నటుడు బాబీ డియోల్‌తో స్క్రీన్ షేర్ చేసుకోనున్నారు. వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందిన ఈ సినిమా 2025 టొరంటో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శితమైంది. మే 22న ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది. దీంతో పాటు, రాజ్‌కుమార్ రావు సరసన 'టోస్టర్' అనే మరో కామెడీ చిత్రంలో కూడా ఆమె నటిస్తున్నారు.

## నిర్మాతగా నేను పూర్తిగా నష్టపోయా: విజయ్ సేతుపతి

సాధారణంగా సినీ పరిశ్రమలో తమ వైఫల్యాలను దాచుకోవాలని చూసే వారు ఎక్కువగా ఉంటారు. కానీ తమిళ నటుడు విజయ్ సేతుపతి మాత్రం తాను నిర్మాతగా మారి తీసిన సినిమాలన్నీ నష్టాలనే మిగిల్చాయని ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచారు. కేవలం లాభాల కోసం కాకుండా, వైవిధ్యమైన కథల మీద ఉన్న మక్కువతోనే తాను సినిమాలు తీశానని ఆయన స్పష్టం చేశారు. నిర్మాతగా విజయ్ సేతుపతి తన ప్రయాణాన్ని 'సంగుతేవన్' అనే చిత్రంతో ప్రారంభించగా, అది మధ్యలోనే ఆగిపోవడంతో సుమారు రూ. 1.75 కోట్ల నష్టం వాటిల్లింది.

## మ్యాజిక్ జరిగింది.. ముహూర్తం కుదిరింది...
# ట్రైలర్ అదిరింది: ఉస్తాద్ ట్రైలర్ పై చిరంజీవి మెగా ప్రశంసలు



పవర్ స్టార్ పవన్ కల్యాణ్ నటిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' థియేట్రికల్ ట్రైలర్ నిన్న విడుదలై యూట్యూబ్‌లో సంచలనం సృష్టిస్తోంది. ఇప్పటికే ఈ ట్రైలర్ 14 మిలియన్లకు పైగా వ్యూస్‌తో దూసుకుపోతోంది. ఉగాది పండుగ కానుకగా మార్చి 19న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ క్రమంలో, ట్రైలర్‌పై మెగాస్టార్ చిరంజీవి ప్రశంసలు కురిపించగా, దర్శకుడు హరీశ్ శంకర్ కృతజ్ఞతలు తెలుపుతూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ ట్రైలర్‌పై సోషల్ మీడియా వేదికగా చిరంజీవి స్పందించారు. "మ్యాజిక్ జరిగింది.. ముహూర్తం కుదిరింది.. ట్రైలర్ అదిరింది.. ఉగాదికి "ఉస్తాద్ భగత్ సింగ్" తో అన్నీ శుభాలే!!" అని తనదైన శైలిలో ట్వీట్ చేశారు. పవన్ కల్యాణ్, దర్శకుడు హరీశ్ శంకర్, చిత్ర బృందానికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. చిరంజీవి ట్వీట్‌కు దర్శకుడు హరీశ్ శంకర్ ఉద్వేగభరితంగా బదులిచ్చారు. విదేశాల్లో ఉన్నప్పటికీ సమయం తీసుకుని ట్రైలర్ చూసినందుకు ధన్యవాదాలు తెలిపారు. "అయ్యబాబోయ్... అన్నయ్య !! మీ టైమింగ్, రైమింగ్ చూస్తుంటే మీకు ట్రైలర్ ఏ రేంజులో నచ్చిందో నాకర్థమైంది. 'మెగా ఆశీర్వాదం' కూడా దొరికింది కాబట్టి ఇక మెరుపు వేగంతో దూసుకెళ్లడమే. ఎందుకంటే.. మీరు ట్వీటు పెడితే...హీటు పెరిగినట్టే!!" అని హరీశ్ శంకర్ తన పోస్టులో పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ సంభాషణ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ట్రైలర్‌కు వస్తున్న అద్భుతమైన స్పందనకు చిరంజీవి ప్రశంసలు తోడవడంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. హరీశ్ శంకర్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై రూపుదిద్దుకున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రానికి దేవి శ్రీ ప్రసాద్ పాటలు అందించగా, తమన్ బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ సమకూర్చాడు. ఈ యాక్షన్ థ్రిల్లర్ ఎంటర్టయినర్ మూవీలో పవన్ సరసన శ్రీలీల, రాశీ ఖన్నా కథానాయికలుగా నటించారు.

# సినిమా

## అద్భుత అవకాశం కోల్పోయా



ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియులు అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న యాక్షన్ థ్రిల్లర్ ధురంధర్ 2. ఈ సినిమా భారీ అంచనాల మధ్య మార్చి 19న వెండితెరపై సందడి చేసేందుకు సిద్ధమవుతోంది. అయితే, ఈ క్రేజీ ప్రాజెక్టుకు సంబంధించి బాలీవుడ్ సీనియర్ నటుడు అనిల్ కపూర్ ఆసక్తికర కామెంట్స్ చేశాడు. దురంధర్ సినిమాలో ఒక కీలకమైన అతిథి పాత్రలో నటించే అవకాశం తన వద్దకు వచ్చిందని, కానీ కొన్ని కారణాల వల్ల దానిని వదులుకోవాల్సి వచ్చిందని ఆయన చెప్పుకొచ్చాడు. దర్శకుడు ఆదిత్య ధర్ ఈ పాత్ర కోసం అనిల్ కపూర్‌ను సంప్రదించినప్పుడు, ఆయన కూడా నటించడానికి ఎంతో ఉత్సాహం చూపారట. కానీ, అదే సమయానికి మరో దర్శకుడికి ఇచ్చిన డేట్స్ అడ్డు రావడంతో ధురంధర్ 2 నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. ఒకరికి ఇచ్చిన మాటను తప్పి, డేట్స్‌ను క్యాన్సిల్ చేసి మరో సినిమాను అంగీకరించడం సరైన పద్ధతి కాదు. అద్భుతమైన అవకాశం కోల్పోవడం బాధాకరమే అయినా, వృత్తి పట్ల నిబద్ధత అంతకంటే ముఖ్యం కదా అని అనిల్ కపూర్ చెప్పుకొచ్చాడు

## మహిళలను ఎవరూ పట్టించుకోరు



ప్రముఖ సింగర్, డబ్బింగ్ ఆర్టిస్ట్ చిన్మయి శ్రీపాద సోషల్ మీడియాలో ఫుల్ యాక్టివ్ గా ఉంటుంది. సామాజిక అంశాలపై తనదైన శైలిలో స్పందిస్తుంటుంది. ముఖ్యంగా మహిళల సమస్యలపై తన వాయిస్‌ గట్టిగానే వినిపిస్తుంటుంది. తాజాగా ఓ స్టార్ హీరోను విమర్శిస్తూ చిన్మయి చేసిన ట్వీట్ ఇప్పుడు కోలీవుడ్ లో హాట్ టాపిక్ గా మారింది. తమిళ సినిమా ఇండస్ట్రీకి చెందిన ప్రముఖ లిరిసిస్ట్ వైరముత్తుకు ఇటీవల ప్రతిష్ఠాత్మక జ్ఞానపీఠ్ పురస్కారం వరించింది. దీంతో పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా ఆయనకు విషెస్ తెలిపారు. అందులో స్టార్ హీరో కమల్ హాసన్ సైతం కూడా ఉన్నారు. ఇప్పుడిదే చిన్మయి ఆగ్రహానికి కారణమైంది. 'సినిమాల్లో ఉన్న మగవాళ్లు రాజకీయాలకు మారడం, తన మామ, గురువు తమను లైంగికంగా వేధించాడని చెప్పిన మహిళలను పూర్తిగా పట్టించుకోకపోవడం ఆయనకే చెల్లుతుంది. పురుషులు ఎప్పటికీ మన వైపు ఉండరని ఓటు వేసే మహిళలు గుర్తుపెట్టుకోవాలి. ఇక్కడ ట్విస్ట్ ఏంటంటే ఆయన సొంత పార్టీలోని మహిళ బహిరంగంగా కవి పేరును ప్రస్తావించినా పట్టించుకోకపోవడం మరి దారుణం. చివరగా పురుషులు కేవలం సోదరులు, మామలు, నాన్నలు, స్నేహితులు, సలహాదారులకు మాత్రమే అండగా నిలుస్తారు. మహిళలను ఎవరూ పట్టించుకోరు'అంటూ ట్వీట్ చేసింది.

# తెలుగోడిని పెళ్లి చేసుకో



మలయాళ ముద్దుగుమ్మ సంయుక్త మీనన్ తెలుగులో క్రేజీ హీరోయిన్ గా మారిపోయింది. కేవలం అందంతోనే కాకుండా, తన నటనతోనూ ఆకట్టుకుంటున్న ఈ బ్యూటీ.. అనతి కాలంలోనే తెలుగు ప్రేక్షకుల హృదయాలను కొల్లగొట్టింది. ఓవైపు స్టార్ హీరోల సినిమాల్లో నటించే ఛాన్స్ అందుకుంటూనే, మరోవైపు కుర్ర హీరోలకు జోడీగా నటిస్తోంది. టాలీవుడ్‌లో బిజీ బిజీగా గడుపుతున్నసంయుక్త.. తాజాగా నెట్ ఇంట ఆమె కామెంట్స్ వైరల్ గా మారాయి. ఓ నెటిజన్ నుంచి సంయుక్తకు క్రేజీ రిక్వెస్ట్ వచ్చింది. ''హ్యాపీ గా తెలుగోడిని పెళ్లి చేసుకో క్యూటీ'' అని అతడు ట్వీట్ చేశాడు. దీనికి ఆమె రియాక్ట్ అయింది. ఎటువంటి కామెంట్స్ చేయకుండా కొన్ని ఫన్నీ ఎమోజీలను పోస్ట్ చేసింది. దానికి ఇంకో నెటిజన్ బదులిస్తూ.. తనని పెళ్లి చేసుకోవాలంటే అప్లికేషన్ ఎక్కడ పెట్టుకోవాలని ప్రశ్నించాడు. దానికి నో అన్నట్టుగా ఒక చిన్న పాప ఎమోజీని సంయుక్త కామెంట్ పెట్టింది.

# నియోజకవర్గ అభివృద్ధిలో వెనకడుగు వేసేది లేదు

ఉమ్మడి వరంగల్ బ్యూరో, మార్చి 15 (భారత శక్తి): వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధిలో ఎలాంటి వెనకడుగు ఉండదని, ప్రతి కాలనీకి అవసరమైన మౌలిక సదుపాయాలను దశలవారీగా కల్పిస్తున్నామని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని, అదే దిశగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో కూడా సమగ్ర అభివృద్ధి సాధించడానికి కృషి చేస్తున్నామని ఆయన అన్నారు. ఆదివారం ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి నియోజకవర్గంలోని పలు డివిజన్లలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా 58వ డివిజన్‌లోని ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు, మురికి కాల్వల నిర్మాణ పనులను ప్రారంభించారు. 9వ డివిజన్‌లోని కాకతీయ లైన్ ప్రాంతంలో రూ.1.30 కోట్ల వ్యయంతో సీసీ రోడ్డు, సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. అదేవిధంగా 10వ డివిజన్‌లో అలంకార్ జంక్షన్ ఆవరణలో రూ.29.50 లక్షలతో సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మొత్తం రూ.2 కోట్లకు పైగా నిధులతో ఈ అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతోందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పదేళ్లలో జరగని అభివృద్ధి పనులను తాము రెండు సంవత్సరాల్లోనే వేగంగా పూర్తి చేస్తున్నామని అన్నారు. నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాలు వంటి మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టామని చెప్పారు. ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ వాటికి తక్షణ పరిష్కారాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి రెండూ సమానంగా అందుతున్నాయని ఎమ్మెల్యే చెప్పారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడం తమ లక్ష్యమని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు వేగంగా జరగాలంటే స్థానిక ప్రజల సహకారం కూడా అవసరమని, ప్రజలు సహకరిస్తే మరింత వేగంగా



అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ఎమ్మెల్యేకు స్థానికులు సమస్యలను వివరించగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తూ వరంగల్ పశ్చిమ నియోజకవర్గాన్ని రాష్ట్రంలో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, కాలనీ వాసులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## భైంసాలో నూతన ఆదిత్య మల్టీ స్పెషాల్టీ ఆసుపత్రి భవన ప్రారంభోత్సవం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 15 ( భారత శక్తి): భైంసా పట్టణంలో ప్రముఖ సీనియర్ డాక్టర్ కాశీనాథ్ ఆధ్వర్యంలో నిర్మించిన నూతన ఆదిత్య మల్టీ స్పెషాల్టీ ఆసుపత్రి కొత్త భవనాన్ని ఎమ్మెల్యే పావర్ రామారావు పటేల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఆసుపత్రి భవనాన్ని ప్రారంభించి యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భైంసా పట్టణం మరియు పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి ఇలాంటి ఆధునిక వైద్య సదుపాయాలు ఎంతో అవసరమని అన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు సమీపంలోనే నాణ్యమైన వైద్య సేవలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. డాక్టర్ కాశీనాథ్ మాట్లాడుతూ మమతా క్లినిక్ ద్వారా సాధ్యమైనంత తక్కువ ఖర్చుతో ప్రజలకు మెరుగైన చికిత్స అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజల ఆరోగ్య సేవే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తుమ్మల దత్తాత్రి, వార్డు కౌన్సిలర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్యులు, ప్రముఖులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## భైంసాలో ఘనంగా దావత్–ఎ–ఇఫ్తార్ కార్యక్రమం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 15(భారత శక్తి): భైంసా పట్టణంలో ఆదివారం దావత్ ఎ ఇఫ్తార్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. భైంసా వైస్ చైర్మన్ మీర్జా ఇద్రిస్ బేగ్ ఆధ్వర్యంలో షకీల్ గల్లీ, గుజ్రీ గల్లీ గ్రౌండ్‌లో ఈ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ అతిథులుగా S.P డాక్టర్ జానకి షర్మిల (IPS), అదనపు S.P సాయి కిరణ్ (IPS), సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్ (IAS), మున్సిపల్ చైర్మన్ T. దత్తాత్రి (దత్తు) హాజరయ్యారు. అలాగే M.R.O పర్వీన్ కుమార్, మున్సిపల్ కమిషనర్ Y. నవీన్, భైంసా టౌన్ C.I సాయి కుమార్, భైంసా రూరల్ C.I పర్వీన్ కుమార్ తదితర అధికారులు కూడా పాల్గొన్నారు. కార్యక్రమంలో 24వ వార్డు కౌన్సిలర్ సయ్యద్ ఆమేర్‌తో పాటు స్థానిక ప్రముఖులు, ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో హాజరై ఇఫ్తార్ విందులో




పాల్గొన్నారు. పవిత్ర రమజాన్ మాసంలో పరస్పర సౌభ్రాతృత్వం, ఐక్యతను పెంపొందించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా అతిథులు రమజాన్ మాసం శుభాకాంక్షలు తెలియజేస్తూ సమాజంలో శాంతి, సామరస్యాలు కొనసాగాలని ఆకాంక్షించారు. మాజీ ఐదో వార్డ్ కౌన్సిలర్ సయ్యద్ ఇర్ఫాన్. పాల్గొన్నారు.



## కులమతాలకు అతీతంగా పండుగలు జరుపుకోవాలి.. మంత్రి శ్రీధర్ బాబు పిలుపు

కాటారం, మార్చి 15 (భారత శక్తి): కాటారం మండల కేంద్రంలోని ఎల్ జీ గార్డెన్ లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రంజాన్ పండుగ క్రమశిక్షణకు, దాతృత్వానికి ప్రతీక అని, ఇఫ్తార్ విందులు ప్రజల మధ్య సోదర భావాన్ని మరియు ఐక్యతను పెంచుతాయని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం అన్ని మతాల పండుగలు సమానంగా గౌరవిస్తుందని, ముస్లింల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ఇఫ్తార్ విందు అనంతరం స్థానిక ముస్లిం ప్రతినిధులతో కలిసి మంత్రి ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మైనారిటీల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రి అందరికీ ముందస్తుగా రంజాన్ శుభాకాంక్షలు తెలిపి, విందులో వారితో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, మైనారిటీ నాయకులు, ప్రజా ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## 4 పారిశుద్ధ కార్మికుల పాత్ర అత్యంత కీలకం : జిల్లా కలెక్టర్

ములుగు జిల్లా ప్రతినిధి, మార్చి 15 (భారత శక్తి) : గ్రామాలలో పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించడంలో పారిశుద్ధ కార్మికుల పాత్ర అత్యంత కీలకంగా ఉంటుందని జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ తెలిపారు. ఆదివారం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మల్లంపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో పారిశుధ్య కార్మికుల సేవలను గుర్తిస్తూ వారిని శాలువాలతో సత్కరిస్తూ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామాలు మరియు పట్టణాలను పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర కీలకంగా ఉంటుందన్నారు. సమాజ ఆరోగ్యాన్ని కాపాడేందుకు కష్టపడుతున్న నిజమైన సేవకులని కొనియాడారు. ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రత కోసం వారు చేస్తున్న సేవలు అభినందనీయమని తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలలో పారిశుధ్య కార్మికుల సేవలు మరింత కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. సమాజం వారి సేవలను గుర్తించి గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మండల కేంద్రంలో



వివిధ దశలలో నిర్మాణాలు జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్లను, అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించారు. కలెక్టర్ లబ్ధిదారులతో మాట్లాడుతూ స్లాబ్ లెవెల్ పూర్తిచేసుకుని చివరి దశ పనులు ప్లాస్టిక్, విద్యుత్ కనెక్షన్, పెయింటింగ్, ఫ్లోరింగ్ , ప్లంబింగ్ తదితర పనులను త్వరితగతిన పూర్తి చేయాలని బిల్లులు వెంటనే మంజూరు చేయడం జరుగుతుందని ఉగాది పండుగ వరకు గృహప్రవేశానికి సిద్ధం కావాలని సూచించారు. అంగన్వాడి కేంద్రాలలో పిల్లలకు పౌష్టిక ఆహారం అందించాలని, పిల్లల ఎత్తు బరువు నిరంతరం పర్యవేక్షించాలని , పిల్లలకు బాలింతలకు గర్భిణీ స్త్రీలకు అందించే పాల ప్యాకెట్లను దిగుమతి చేసుకునే సమయంలో వాటిపై ఉండే ముద్రణ తేదీలను తప్పనిసరిగా గమనించాలని గడువు దాటిన వస్తువులను ఎట్టి పరిస్థితులలో దిగుమతి చేసుకోకూడదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఎంపీడీవో హన్మంతరావు, సిడిపిఓ శిరీష, గ్రామ సర్పంచ్ శ్యామ్ రావు, కార్యదర్శి పోలురాజు, స్థానిక ప్రజా ప్రతినిధులు , సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




## రేపటి నుండి ఏప్రిల్ 23 వరకు ఒంటిపూట బడులు

హైదరాబాద్, మార్చి 15 (భారత శక్తి): రాష్ట్రంలోని ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని, అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల్లో నేటి నుండి ఏప్రిల్ 23 వరకు ఒంటిపూట బడులు కొనసాగనున్నాయి. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పాఠశాలల పనిచేస్తాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం 12.30 గంటలకు మధ్యాహ్న భోజనం అందిస్తారు. పదోతరగతి పరీక్షా కేంద్రాలు ఉన్న స్కూళ్లు, పరీక్షలు జరిగే రోజుల్లో మాత్రమే మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేస్తాయని అధికారులు చెబుతున్నారు. పరీక్షలు లేని రోజుల్లో పాఠశాలలు ఉదయం పూట యథావిధిగా కొనసాగుతాయి. ఈ ఒంటిపూట బడులు 202526 విద్యాసంవత్సరం చివరిరోజైన ఏప్రిల్ 23 వరకు కొనసాగుతాయి.

## సెమినార్ ను జయప్రదం చేయండి : సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి

సూర్యాపేట (భారత శక్తి జిల్లా ప్రతినిధి) మార్చి 15: తెలంగాణ సాయుధ పోరాట యోదురాలు కామ్రేడ్ మల్లు స్వరాజ్యం నాలుగో వర్ధంతి సందర్భంగా ఈనెల 18వ తేదీన విజయ్ కన్వెన్షన్ హాల్లో జరుగు సెమినార్ను జయప్రదం చేయాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఇరాన్ పై అమెరికా ఇజ్రాయిల్ యుద్ధంభారత్ పై ప్రభావం అనే అంశంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఈ సెమినార్ లో పాల్గొనాలని కోరారు. ఈరోజు సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎంవీఎన్ భవన్ లో సెమినార్ కు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో తన ఆధిపత్యాన్ని సాధించడం కోసం అమెరికా కొన్ని దేశాలపై దాడులు దౌర్జన్యాలకు పాల్పడుతుందని అన్నారు. గతంలో ఉక్కిరేయిన్, పాలస్తీనా మీద ప్రస్తుతం ఇరాన్ మీద యుద్ధం చేసి తన పెత్తనం కోసం అమాయక ప్రజల ప్రాణాలను బలిగొంటుందని అన్నారు. ఇరాన్ పై అమెరికా ఇజ్రాయిల్ యుద్ధం చేస్తుండడంతో భారత్ పై ధరల ప్రభావం తీవ్రంగా ఉందన్నారు. ఇప్పటికే గ్యాస్ ధరలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్న సందర్భంలో భారత ప్రధాని యుద్ధం నివారించడం కోసం మాట్లాడే పరిస్థితి లేదన్నారు. ఇరాన్ పై



సామ్రాజ్యవాద అమెరికా, ఇజ్రాయిల్ దాడులను ఖండించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇరాన్ పై అమెరికా ఇజ్రాయిల్ సాగిస్తున్న యుద్ధకాండను నిరసిస్తూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీన విజయ్ కన్వెన్షన్ హాల్లో జరుగు ఇరాన్ పై అమెరికా ఇజ్రాయిల్ యుద్ధం భారత్ పై ప్రభావం అనే అంశంపై జరుగు సెమినార్ జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సెమినార్ కు ముఖ్య అతిథులుగా సిపిఎం పోలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.డి.అబ్బాస్, జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మి గార్లు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సెమినార్ లో పార్టీ శ్రేణులు అత్యధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు కొలిశెట్టి యాదగిరిరావు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోట గోపి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వేల్పుల వెంకన్న ధనియాకుల శ్రీకాంత్ జిల్లా నాయకులు చినపంగి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# హయత్‌నగర్‌లో రూ.10 కోట్ల రోడ్డు పనులకు శంకుస్థాపన

* **హాజరైన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మధుయాష్కీ, మల్‌రెడ్డి రాంరెడ్డి,**

ఎల్బీనగర్ మార్చి 14 :భారత శక్తి : హయత్‌నగర్ పరిధిలో తొర్రూరు ఎక్స్ రోడ్డు వద్ద ఉన్న సాయిబాబా దేవాలయం నుంచి జీ హైస్కూల్ వరకు రూ.10 కోట్లతో చేపట్టనున్న నాలుగు వరుసల రహదారి విస్తరణ పనులకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్, రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి పాల్గొన్నారు.

**నాగ్‌పూర్ తరహాలో ఎలివేటెడ్ కారిడార్:**

ఈ సందర్భంగా మంత్రి వెంకటరెడ్డి మాట్లాడుతూ చింతల్‌కుంట చెక్‌పోస్ట్ నుంచి హయత్‌నగర్ మీదుగా ఆల్ ఇండియా రేడియో స్టేషన్ వరకు 5.5 కిలోమీటర్ల మేర రూ.950 కోట్లతో ఎలివేటెడ్ కారిడార్ నిర్మించనున్నట్లు తెలిపారు. నాగ్‌పూర్‌లోని డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ నమూనాను ఇక్కడ అమలు చేయనున్నామని, దీనివల్ల ట్రాఫిక్ సమస్యలు పూర్తిగా తొలగిపోతాయని పేర్కొన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గ అభివృద్ధికి మల్‌రెడ్డి రాంరెడ్డి తీసుకుంటున్న ప్రత్యేక చొరవను ఆయన అభినందించారు.





**త్వరలో మరిన్ని రహదారులు:**

మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఇప్పటికే రూ.400 కోట్ల విలువైన పనులకు టెండర్లు పిలిచామని, మరో రూ.600 కోట్ల పనులు పరిశీలనలో ఉన్నాయని వివరించారు. భవిష్యత్తు ప్రణాళికల్లో భాగంగా హయత్‌నగర్ నుంచి కోహెడ ఫ్రూట్ మార్కెట్ వరకు రూ.200 కోట్లతో రహదారి, అలాగే ఇంజాపూర్, తారామత్‌పేట్ మార్గాల్లో నాలుగు వరుసల రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం మార్కెట్ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ముద్దగోని రామ్మోహన్ గౌడ్, జక్కిడి ప్రభాకర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు రాజశేఖర్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేటి (ఈ నెల 16 వ తేదీ ) నుండి ఈ నెల 25 వ తేదీ వరకు "రైతన్నా మీకోసం వారోత్సవాలు"

**: జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి**

వై ఎస్ ఆర్ కడప,మార్చి15(భారత శక్తి): నేటి (ఈ నెల 16 వ తేదీ ) నుండి ఈ నెల 25 వ తేదీ వరకు రైతన్నా మీకోసం వారోత్సవాలు నిర్వాహన జిల్లా వ్యాప్తంగా అన్ని రైతు సేవా కేంద్రాలలో జరగనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదివారం ఒక ప్రకటన లో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడానికి, రైతుల సమస్యలను నేరుగా తెలుసుకోవడానికి 'రైతన్న మీకోసం' (Rythanna Mee kosam) కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. ఈ కార్యక్రమం ద్వారా ఖరీఫ్ సీజన్ లో సాగు పద్ధతుల పై అవగాహన ,పంటల ప్రణాళిక,ఆధునిక సాంకేతికత, మరియు రైతులకు అవసరమైన సూచనలపై అవగాహన కల్పిస్తారు. వ్యవసాయ అభివృద్ధికి ఊతం ఇచ్చే పంచ సూత్రాలతోపాటు ఎల్నినో నేపథ్యంలో ప్రాంతాల వారిగా వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సూచనలను ఇవ్వనున్నారని,ఈ కార్య క్రమంలో నేల, నీరు ను సంరక్షించే వివిధ ప్రకృతి వ్యవసాయ విధానాలపై రైతులకు అవగాహనా కల్పిస్తారన్నారు. వ్యవసాయ రంగం పై గల్ఫ్ యుద్ధ ప్రభావం, ఎల్నినో ఏర్పడ నున్న నేపధ్యంలో ప్రతికూల అంశాలను సమర్ధంగా ఎదుర్కొనేందుకు రైతులను అప్రమత్తం చేయడానికి దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచ సూత్రాలైన నీటి భద్రత, డిమాండ్ ఆదారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెస్సింగ్, ప్రభుత్వం నుంచి పూర్తి మద్దతు గురించి అవగాహన కల్పించడం జరుగుతుందని, కావున రైతు సోదరులు ఈ కార్యక్రమమ ను సద్వినియోగం చేసుకోవాలని ఆ ప్రకటన లో తెలిపారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతీ ఒక్కరి బాధ్యత..

* **సరూర్నగర్ డిప్యూటీ కమీషనర్ బోనగిరి శ్రీనివాస్ పిలుపు**
* **వెంకటేశ్వర కాలనీ, జేబీ కాలనీలలో గ్యాంగ్ వర్క్**

ఎల్బీనగర్, మార్చి 15 (భారత శక్తి) : ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా ఆదివారం సరూర్నగర్ డివిజన్ పరిధిలోని శ్రీ వెంకటేశ్వర కాలనీ, డాక్టర్స్ కాలనీలోని జింకలబావి కాలనీలలో చేపట్టిన శ్రమ దాన కార్యక్రమంలో సరూర్నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్, ఎల్బీనగర్ సర్కిల్ ఇంచార్జి బోనగిరి శ్రీనివాస్, డిఈఈ చందన, ఎస్ఎస్ బుచ్చయ్య శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు. ఇందులో భాగంగా కాలనీలో పేరుకుపోయిన చెత్త, చెదారాన్ని రోడ్డుకు ఇరువైపులా ఉన్న వేస్టేజ్ లను కాలనీ అసోసియేషన్ సభ్యులతో కలిసి తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, కాలనీలలో రోడ్లపై చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంటేనే కాలనీ ప్రజల ఆరోగ్యం కూడా క్షేమంగా ఉంటుందన్నారు. కాలనీలో పరిశుభ్రంగా ఉండడానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర కాలనీ అధ్యక్షుడు గండు ధనంరెడ్డి,జేబీ కాలనీ అధ్యక్షులు రవీందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు మారోజు శ్రీనివాసరావు, మాధవ్ రెడ్డి, వెంకటేష్ యాదవ్, వెంకటేశ్వర్ రావు, ప్రధాన కార్యదర్శి కనకారావు, కోశాధికారి సాయికిరణ్, కాలనీ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ తులసి కృష్ణమూర్తి, టి శ్రీనివాసరావు, నందకుమార్, సుధాకర్ ఆచారి, మునగాల నరేష్, అనిల్ చెన్న, కృష్ణంరాజులతోపాటు ఎస్ఎఫ్ఏలు సూర్య, నల్ల శ్రీనివాస్,ఆర్ స్వామి, టి సత్యనారాయణ పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.





## మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రజాపాలన లక్ష్యం

: **ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు.**


* **మహిళా గ్రూపులకు రూ.41 కోటి 98 లక్షల రుణాలు పంపిని.**

భూపాలపల్లి ప్రతినిధి ,మార్చి15(భారత శక్తి): రాష్ట్రంలో మహిళలను అన్ని రంగాల్లో ఆర్థికంగా కోటీశ్వరులను చేయడమే ప్రజాపాలన ప్రభుత్వ ధ్యేయమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు.ఆదివారం గోరి కొత్తపల్లి గ్రామంలో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమం నిర్వహణలో ఎమ్మెల్యే గండ్ర మహిళ స్వయం సహాయ సంఘాలకు చెక్కులను అందజేశారు.గోరి కొత్తపల్లి గ్రామంలో ఆదివారం ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమం డి ఆర్ డి ఓ బాలకృష్ణ ఆధ్వర్యం లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరయ్యారు. అనంతరం నాగలగాని శంకరయ్య లబ్ధిదారునికి మంజూరైన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. గ్రామాభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నదని ఎమ్మెల్యే గండ్ర తెలిపారు.ఈ కార్యక్రమంలో వెలుగు - జనని మండల సమాఖ్య స్వయం(558) సహాయక సంఘాలకు మొత్తం 41,98,85,000 రూపాయల చెక్కును మంజూరు చేశారు. మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధి కోసం మహిళా గ్రూపులకు కోళ్ల పంపిణీ కూడా చేపట్టారు.మహిళల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న పథకాల గురించి ఎమ్మెల్యే వివరించారు. మహిళా సంఘాలకు బ్యాంకు రుణాలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం వంటి పథకాలను ప్రజలకు వివరించారు. అలాగే ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన లబ్ధిదారుల





పేర్లను కూడా మహిళా పేర్ల మీద ఇవ్వడం జరగుతుంది అని ఎమ్మెల్యే వివరించారు. జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సూరం వీరేందర్, ఓం ప్రకాష్ తోకల సురేందర్ రెడ్డి, చిగురు మామిడి కుమారస్వామి, స్థానిక పంచాయతీ కార్యదర్శి బాల వేణి రాంబాబు సర్పంచ్ నిమ్మల శంకర్, ఉప సర్పంచ్, సూదన బోయిన రవి వార్డు మెంబర్ సాదు తిరుపతి సభ్యులు, స్థానిక నాయకులు, డ్వాక్రా మహిళా సంఘ సభ్యులు, డి ఆర్ డి ఓ బాలకృష్ణ, వెలుగు సమాఖ్య ఏపీవో పి ప్రేమ్ రాజ్, పి ఆర్ ఈఈ వెంకటేశ్వర్లు, డి రవి కుమార్, సతీష్ తిరుపతి, ఆర్ఐ రాజ్యలక్ష్మి, జగ్గయ్యపేట సర్పంచ్ నడిపెల్లి శాంత వెంకట్రావు సుల్తాన్పూర్ సర్పంచ్ కాసెట్టి సక్కుబాయి రాజయ్య బాలయ్య పల్లె సర్పంచ్ తొట్ల తిరుపతి యాదవ్ నిజాంపల్లి సర్పంచ్ సునీత రవీందర్ గాంధీనగర్ సర్పంచ్ బొజ్జం మమతా సురేష్ చిన్న కోడెపాక సర్పంచ్ సాదు సుమలత ధర్మేందర్ విష్ణు యాదవ్ మండల సీనియర్ నాయకులు కోటంచ ఆలయ డైరెక్టర్లు కాటం సదయ్య మండల సీనియర్ నాయకులు అమ్ముల సదానందం జూపాక మొగిలి సందెల మధుకర్ సాదు బిక్షపతి మండల నాయకులు తదితరులు యూత్ నాయకులు జూపాక అశోక్ అచ్చ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



TRAFFIC ENFORCEMENT – WEEKLY REPORT (08.03.2026 TO 14.03.2026)

Special Drive to Enhance road safety & Ensure free flow of Traffic

| S NO | VIOLATION | CHALLANS IMPOSED |
|---|---|---|
| 1 | Cell phone driving | 1237 |
| 2 | Triple riding | 2029 |
| 3 | Over speed | 1543 |
| 4 | Signal jump | 2338 |
| 5 | Wrong side | 9006 |
| 6 | Obsrtuction of carriage way | 9872 |

DRUNK & DRIVE CASES

| SNO | POLICE STATION | BOOKED CASES |
|---|---|---|
| 1 | Begumpet Tr.PS | 24 |
| 2 | Trimulgerry Tr.PS | 20 |
| 3 | Gopalapuram Tr.PS | 11 |
| 4 | Alwal Tr.PS | 8 |
| 5 | Malkajgiri Tr.PS | 13 |
| 6 | Jawaharnagar Tr. PS | 26 |
| 7 | Uppal Tr.PS | 11 |
| 8 | Kushaiguda Tr.PS | 10 |
| 9 | Ghatkesar Tr.PS | 33 |
| 10 | L.B Nagar Tr.PS | 47 |
| 11 | Vanasthalipuram Tr.PS | 20 |
| | TOTAL | 223 |

A TOTAL OF ( 223) DD CASES WERE BOOKED AND ( 8 ) DRUNKEN DRIVE WERE SENT TO JAIL LASR WEEK






## మల్కాజిగిరిలో మందుబాబుల ఆటకట్టు

: **వీకెండ్ తనిఖీల్లో 223 మంది దొరికారు!**

మల్కాజిగిరి, మార్చి 15, భారతశక్తి: వీకెండ్ ఎంజాయ్‌మెంట్‌లో భాగంగా మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న వారిపై మల్కాజిగిరి ట్రాఫిక్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. శని, ఆదివారాల్లో నిర్వహించిన ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో ఏకంగా 223 మంది పట్టుబడ్డారు. పట్టుబడిన వారిలో అత్యధికులు టూవీలర్ రైడర్లే ఉండటం గమనార్హం.

**ఎవరు.. ఎన్ని వాహనాలు?**

పోలీసులు వెల్లడించిన గణాంకాల ప్రకారం పట్టుబడిన వాహనాల వివరాలు ఇలా ఉన్నాయి:
టూవీలర్లు: 194
ఫోర్ వీలర్లు (కార్లు): 21
త్రీ వీలర్లు (ఆటోలు): 08



భారీ వాహనాలు: సున్నా

**మత్తు 'రేంజ్' ఇదీ..**

బ్రీత్ అనలైజర్ పరీక్షల్లో పట్టుబడిన వారి రక్తంలో ఆల్కహాల్ శాతం (BAC) విస్తుపోయేలా ఉంది.
36 200 mg: 204 మంది
201 300 mg: 10 మంది
301 550 mg: 09 మంది (తీవ్ర మత్తులో ఉన్నవారు)

**జైలు శిక్ష తప్పదు.. జాగ్రత్త!**

గత వారం (మార్చి 8 నుండి 14 వరకు) కోర్టులో హాజరుపరిచిన కేసుల్లో 238 మందికి శిక్షలు పడ్డాయి. ఇందులో ఎనిమిది మందికి జైలు శిక్షతో పాటు జరిమానా, 11 మందికి జరిమానాతో పాటు సామాజిక సేవ, మిగిలిన 219 మందికి కేవలం జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

డిసిపి హెచ్చరిక: "మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదాలకు కారణమైతే, భారతీయ న్యాయ సంహిత (BNS) 2023లోని సెక్షన్ 105 కింద 'హత్యానేరం కాని సాపరాధ నరహత్య' కేసు నమోదు చేస్తాం. దీనికి గరిష్టంగా 10 ఏళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉంది. ప్రాణాలతో చెలగాటం వద్దు."

—— **డిసిపి, మల్కాజిగిరి కమిషనరేట్.**

## * ప్రజల మౌలిక సౌకర్యాల కల్పనే ప్రభుత్వం ధ్యేయం

**గోరి కొత్తపల్లి నూతన జిపి భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గండ్ర.**

భూపాలపల్లి ప్రతినిధి ,మార్చి 15(భారత శక్తి): రాష్ట్ర ప్రభుత్వం వాళ్లు అన్ని మౌలిక సౌకర్యాల కల్పన, అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళుతుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పేర్కొన్నారు. గోరి కొత్తపల్లి మండల కేంద్రంలో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే గండ్ర, స్థానిక సర్పంచ్ నిమ్మల శంకర్, అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ గ్రామాలలో ప్రజల సౌకర్యం కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో ప్రభుత్వ కార్యాలయలను నిర్మించే అందుబాటులోకి తీసుకు వస్తామని ఎమ్మెల్యే గండ్ర తెలిపారు. ఇప్పటికే మండల కేంద్రంలో ఎంపీడీవో ఎమ్మార్వో పక్క భవనాల నిర్మాణాలు పూర్తి కావస్తున్నాయని, పోలీస్ స్టేషన్ భవన నిర్మాణంతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాలను మంజూరుకు కృషి చేస్తానన్నారు. నూతన గ్రామపంచాయతీ ప్రారంభోత్సవం సందర్భంగా పూజారులు వేదమంత్రాలు మధ్యన కార్యాలయాన్ని ఎమ్మెల్యే గండ్ర ప్రారంభించి సర్పంచి నిమ్మల శంకర్ , కార్యదర్శి బాలవేణి రాంబాబు కార్యాలయంలో ఆసీనులను చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ శంకర్ ఎమ్మెల్యే గండ్ర ను కోరుతూ గ్రామపంచాయతీ భవనానికి కాంపౌండ్ వాల్ మంజూరు ఇవ్వాలని, 108 వాహనాన్ని ఏర్పాటు చేయాలని, ఆలయాలకు ప్రహరీ గోడ నిర్మాణాలకు సహకరించాలని 391 సర్వేనెంబర్ గల భూముల పట్టాలు ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈఈ వెంకటేశ్వర్లు, డి ఈ రవికుమార్, ఏఈలు తిరుపతి, ఆర్ ఐ రాజ్యలక్ష్మి, కాంగ్రెస్ మండల నాయకులు ఓం ప్రకాష్ సూదన బోయిన విష్ణు యాదవ్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు, సూరం వీరేందర్, తోకల సురేందర్ రెడ్డి,చిగురు మామిడి కుమారస్వామి, అశోక్ రెడ్డి, సర్పంచులు తొట్ల తిరుపతి యాదవ్ (చంటి) బొజ్జం మమతా సురేష్, నడిపెల్లి శాంతాబాయి వెంకట్రావు, ఉప సర్పంచ్ సూదబోయిన రవి,గ్రామ కమిటీ అధ్యక్షులు పుట్ట రవి, బిక్షపతి,శ్యామ్,యాకుబాబు, వీరేశం,వైనాల ప్రభాకర్,పిండి ప్రభాకర్ వనపర్తి శ్రీనివాస్, కొత్తపల్లి మండల యూత్ కాంగ్రెస్ నాయకులు జూపాక అశోక్, బోడకుంట్ల రంజిత్, వైనాల అనిల్, రాకేష్, సాధు, తిరుపతి, వేల్పుల విజయ్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ రైతులకు శుభవార్త.. ఈనెల 22న రైతు భరోసా మొదటి విడత నిధులు

హైదరాబాద్ ,మార్చి 15 (భారత శక్తి): తెలంగాణ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అదిరిపోయే తీపి కబురు అందించింది. అన్నదాతలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'రైతు భరోసా' నిధుల విడుదలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 22వ తేదీన సిద్దిపేట జిల్లా నర్మెట్ట వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు భరోసా మొదటి విడత నిధులను అధికారికంగా విడుదల చేయనున్నారు. ఈ పథకం అమలు తీరుపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు , ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సుదీర్ఘంగా చర్చించిన అనంతరం ఈ కీలక ప్రకటన వెలువడింది. నిధుల విడుదల ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని, నేరుగా రైతుల ఖాతాల్లోకే నగదు జమ కావాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఈ పథకంలో భాగంగా ప్రభుత్వం అత్యంత వ్యూహాత్మకంగా మూడు విడతల్లో నిధులను పంపిణీ చేయాలని నిర్ణయించింది. మొదటి విడతగా ఈ నెల 22న సుమారు 70 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి ఒక ఎకరం వరకు ఉన్న భూమికి సంబంధించి రూ. 3,590 కోట్లను బదిలీ చేయనున్నారు. దీనివల్ల రాష్ట్రంలోని చిన్న, సన్నకారు రైతులకు తక్షణ ఆర్థిక వెసులుబాటు లభించనుంది. మొదటి విడత పూర్తయిన 20 రోజుల వ్యవధిలోనే రెండో విడత కింద మరో రూ. 2,650 కోట్లను విడుదల చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇక ఏప్రిల్ నెలాఖరులోపు మూడో విడత నిధులను కూడా విడుదల చేసి, పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మొత్తంగా ఈ మూడు విడతల్లో కలిపి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతుల ఖాతాల్లోకి సుమారు రూ. 9 వేల కోట్ల రైతు భరోసా నిధులు జమ కానున్నాయి. వ్యవసాయ సీజన్ ప్రారంభానికి ముందే పెట్టుబడి సాయం అందుతుండటంతో అన్నదాతల్లో హర్షం వ్యక్తమవుతోంది. నర్మెట్టలో జరిగే బహిరంగ సభ ద్వారా ముఖ్యమంత్రి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనుండటంతో సిద్దిపేట జిల్లా యంత్రాంగం ఇప్పటికే ఏర్పాట్లను ముమ్మరం చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతులకు ఈ భారీ ఆర్థిక భరోసా కల్పిస్తుండటం రాష్ట్ర రాజకీయాల్లోనూ చర్చనీయాంశంగా మారింది.

## ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం.. విశాఖలో సెమీ రింగ్ రోడ్డు నిర్మాణం..

- **మారనున్న విశాఖ రూపురేఖలు..**
- **ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టే వ్యూహం..**
- **మంత్రి కీలక వ్యాఖ్యలు..**

విశాఖ, మార్చి 15(భారత శక్తి): విశాఖపట్నం నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో.. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. తాజాగా విశాఖలో నిర్వహించిన పట్టణ గృహ నిర్మాణశాఖ రీజినల్ వర్క్‌షాప్‌లో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ పాల్గొని.. నగర భవిష్యత్తును మార్చేయబోయే కీలక ప్రాజెక్టుల గురించి వెల్లడించారు. విశాఖ నగరంలో ప్రధానంగా వేధిస్తున్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి సెమీ రింగ్ రోడ్డు నిర్మాణమే సరైన మార్గమని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలపై విశాఖపట్నం మెట్రో రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రస్తుతం లోతైన అధ్యయనం చేస్తోంది. ఈ రోడ్డు పూర్తయితే నగరం వెలుపలి నుంచి వచ్చే వాహనాలు నగరం లోపలికి రాకుండానే మళ్లించబడతాయి. దీనివల్ల నగరంలోని ప్రధాన కూడళ్లలో రద్దీ తగ్గుతుంది. ముఖ్యంగా పారిశ్రామిక ప్రాంతాల నుంచి వచ్చే భారీ వాహనాల రాకపోకలు సులభతరం అవుతాయి. నగర రవాణా వ్యవస్థలో విప్లవాత్మక మార్పు తీసుకువచ్చే విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టు గురించి మంత్రి సానుకూలమైన అప్‌డేట్స్ ఇచ్చారు. ఈ మెట్రో ప్రాజెక్టుకు సంబంధించి ఒకటి లేదా రెండు నెలల్లో కేంద్ర ప్రభుత్వం నుంచి తుది అనుమతులు లభించే అవకాశం ఉందన్నారు. కేంద్రం నుంచి క్లియరెన్స్ రాకముందే టెండర్ల ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. దీనివల్ల సమయం ఆదా అవుతుంది. పనులు ప్రారంభించిన మూడు సంవత్సరాల వ్యవధిలోనే విశాఖ వాసులకు మెట్రో ప్రయాణాన్ని అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. వర్క్‌షాప్‌లో భాగంగా కేవలం రవాణా వ్యవస్థపైనే కాకుండా.. మున్సిపాలిటీల ఆర్థిక పరిపుష్టిపై కూడా మంత్రి చర్చించారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీలు కేవలం ప్రభుత్వ గ్రాంట్లపైనే ఆధారపడకుండా.. తమ సొంత వనరుల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకుని స్వయం సమృద్ధి సాధించాలని సూచించారు. పేదలందరికీ ఇళ్ల పథకం కింద నిర్మిస్తున్న ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని అధికారులను ఆదేశించారు. విశాఖను గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దే క్రమంలో సెమీ రింగ్ రోడ్డు, మెట్రో రైలు వంటి ప్రాజెక్టులు వెన్నెముకగా నిలవనున్నాయి. ఈ ప్రాజెక్టులు పూర్తయితే విశాఖలో జీవన ప్రమాణాలు పెరగడమే కాకుండా.. పెట్టుబడులకు కూడా నగరం స్వర్గధామంగా మారుతుంది. ప్రభుత్వం చూపిస్తున్న ఈ చొరవతో రాబోయే ఐదేళ్లలో విశాఖ ముఖచిత్రం పూర్తిగా మారిపోనుందని మంత్రి ధీమా వ్యక్తం చేశారు.

## తిరుమలలో మండువేసవిలో మంచు..

తిరుమల, మార్చి 15(భారత శక్తి):తిరుమల పుణ్యక్షేత్రంలో ప్రకృతి ఒక అపురూప దృశ్యాన్ని ఆవిష్కరించింది. సాధారణంగా వేసవి కాలంలో ఎండ వేడిమితో అల్లాడిపోయే భక్తులకు, శ్రీవారి సన్నిధిలో అనూహ్యంగా మారిన వాతావరణం ఎంతో ఉపశమనాన్ని కలిగిస్తోంది. మార్చి నెలలో మండుటెండలు ఉండాల్సిన సమయంలో, తిరుమల కొండలను దట్టమైన మంచు కమ్మేయడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. శ్రీవారి ఆలయ పరిసరాల నుంచి మొదలుకొని కొండపైకి వచ్చే ఘాట్ రోడ్డు మార్గం వరకు అంతా మంచుమయంగా మారిపోయింది. ఈ అద్భుత వాతావరణం కారణంగా తిరుమల గిరులు శ్వేత వర్ణాన్ని పులుముకున్నట్లుగా కనిపిస్తున్నాయి. దట్టంగా కురుస్తున్న మంచు వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు కూడా సరిగ్గా కనిపించనంతగా పొగమంచు అలుముకుంది. వేసవిలోనూ శీతాకాలాన్ని తలపించేలా ఉన్న ఈ వాతావరణం భక్తులకు సరికొత్త అనుభూతిని పంచుతోంది. తిరుమల మాడ వీధులు, ఆలయ గోపురం , పరిసర ప్రాంతాలు మంచు మేఘాల చాటున దాగి ఉండటంతో భక్తులు పరవశించిపోతున్నారు. కొండపైకి కాలినడకన వచ్చే భక్తులతో పాటు, వాహనాల్లో వచ్చే వారు కూడా ఈ ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదిస్తూ ఫోటోలు తీసుకుంటున్నారు. సాధారణంగా డిసెంబర్, జనవరి నెలల్లో మాత్రమే కనిపించే ఈ దృశ్యాలు ఇప్పుడు మార్చి నెలలో కనిపించడం ఒక విశేషంగా నిలిచింది.

## రేషన్ కార్డుదారులకు శుభవార్త.. మార్చి 17 వరకు అవకాశం..

హైదరాబాద్, మార్చి 15(భారత శక్తి):ప్రజా పంపిణీ వ్యవస్థ (PDS) ద్వారా పేదలకు అందే రేషన్ బియ్యం తెలంగాణలో కీలకమైన సంక్షేమ పథకం. సాధారణంగా ప్రతి నెలా 15వ తేదీ వరకు మాత్రమే బియ్యం తీసుకోవడానికి అవకాశం ఉన్నప్పటికీ.. సాంకేతిక సమస్యలు లేదా ఇతర కారణాల వల్ల బియ్యం తీసుకోలేకపోయిన లబ్ధిదారుల కోసం ప్రభుత్వం తాజాగా గడువును పెంచుతూ నిర్ణయం తీసుకుంది. మార్చి 17 వరకు బియ్యం తీసుకోవచ్చు.. ప్రస్తుత మార్చి నెలకు సంబంధించి రేషన్ పంపిణీ గడువు ఈ రోజుతో (మార్చి 15) ముగియాల్సి ఉంది. అయితే.. రాష్ట్రవ్యాప్తంగా ఇంకా చాలా మంది లబ్ధిదారులు బియ్యం తీసుకోలేదని గుర్తించిన ప్రభుత్వం, మరో రెండు రోజుల పాటు గడువును పొడిగించింది. దీని ప్రకారం.. రేషన్ కార్డుదారులు మార్చి 17వ తేదీ వరకు తమకు దగ్గర్లో ఉన్న రేషన్ డీలర్ల వద్ద బియ్యం తీసుకోవచ్చు. ఈ వెసులుబాటును వినియోగించుకోవాలని పౌరసరఫరాల శాఖ సూచించింది.

- **ఏప్రిల్‌లో 'త్రిపుల్' ధమాకా..**

వచ్చే నెల ఏప్రిల్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఒకేసారి మూడు నెలల రేషన్‌ను (ఏప్రిల్, మే, జూన్) పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఏప్రిల్, మే నెలల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున.. వృద్ధులు, మహిళలు ప్రతి నెలా క్యూలైన్లలో నిలబడి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో అమలవుతున్న 'సన్నబియ్యం' పథకం కింద ప్రతి లబ్ధిదారునికి నెలకు 6 కిలోల చొప్పున.. మూడు నెలలకు కలిపి ఒకేసారి 18 కిలోల బియ్యం అందజేయనున్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ 'సన్నబియ్యం' పథకం దాదాపు 3.10 కోట్ల మందికి లబ్ధి చేకూరుస్తోంది.

## మిస్టర్ రంగనాథ్.. నీపై పరువు నష్టం దావా వేస్తా: కవిత

హైదరాబాద్, మార్చి 15(భారత శక్తి):హైడ్రా కమిషన్ రంగనాథ్ పై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రంగా మండిపడ్డారు. ఆయనపై డిఫమేషన్ కేసు (Defamation) వేసి కోర్టుకు లాగుతానని హెచ్చరించారు. ఆదివారం బంజారాహిల్స్ లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్ మీట్ లో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక హైడ్రా (Hydra) అనే మహమ్మారి మొదలైందని.. అది పేదలను కబళిస్తుందన్నారు. మూసీ (Musi) లో నిర్మించిన ఆదిత్య కన్ స్ట్రక్షన్ (Aditya con struction) కు చెందిన బిల్డింగ్ వద్ద ఇటీవల నిర్వహించిన ధర్నాపై హైడ్రా తప్పుడు ప్రచారం చేసిందని మండిపడ్డారు. గతంలో రంగనాథ్ చేసిన ఆరోపణలనే చేస్తూ తాను ధర్నా చేస్తే తనపై తప్పుడు ప్రచారం చేస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రంగనాథ్ సరిగ్గా ఆరు నెలల క్రితమే ఇదే ఆదిత్య కన్ స్ట్రక్షన్ బిల్డింగ్ యాజమాన్యం 0.37 ఎకరాలు ఆక్రమించిందంటూ తహసీల్దార్ కు రాసిన లేఖను ప్రస్తావించారు. అంతేకాకుండా ఈ భవన నిర్మాణాన్ని ఆపకపోతే అందులో ఉండేబోయే వారితో పాటు ఆ చుట్టుపక్కల ప్రజల ప్రాణాలకే ప్రమాదమని లేఖ రాయలేదా? అని ప్రశ్నించారు. వాటికి సంబంధించిన పూర్తి ఆధారాలను తాను సోషల్ మీడియాలో పెడతానని హెచ్చరించారు. అప్పుడు రంగనాథ్, అదే విధంగా ప్రభుత్వం ఎక్కడైనా దూకి చావాల్సి వస్తుందని తీవ్ర స్వరంతో హెచ్చరించారు. తన ధర్నాకు సంబంధించి హైడ్రా పెట్టిన వీడియోలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. లేదంటే కచ్చితంగా కోర్టుకు ఈడుస్తానని హెచ్చరించారు.

**గ్రాఫిక్స్ డిజైనర్లా, కంటెంట్ క్రియేటర్లా?**

నిజం మాట్లాడే వాళ్లదే తప్పు అన్నట్టుగా వీడియోలు ఎడిట్ చేసి ఎదురుదాడి చేస్తారా అన్ని ప్రశ్నించారు. ప్రభుత్వం, ప్రతిపక్షాలు, ప్రభుత్వానికి బాకాలు ఊదే వాళ్లు కూడా తాను ప్రైవేట్ ప్రాపర్టీలో ధర్నా ఎందుకు చేస్తున్నానని ప్రశ్నిస్తున్నారని.. మూసీ ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారు కాబట్టే బాధ్యతాయుతమైన సంస్థగా హైదరాబాద్ ను పరిరక్షించే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. హైడ్రా పేదవాళ్ల ఇళ్లను కూల్చుతూ పెద్దవాళ్ల జోలికి వెళ్లటం లేదని మండిపడ్డారు. పేదవాళ్ల పక్షాన తాము కచ్చితంగా పోరాటం చేస్తామని చెప్పారు. హైడ్రాకు దమ్ముంటే నేను ఇప్పటి వరకు ఆధారాలతో సహా 6 కంప్లైంట్స్ చేశానని వాటిపై ఒక్క చర్య కూడా ఎందుకు తీసుకోలేదో సమాధానం చెప్పాలన్నారు. పోరాటం చేస్తున్న వారిపైనే తప్పుడు వీడియోలు చేస్తారా అని మండిపడ్డారు. ఈ ప్రభుత్వం, హైడ్రా ఏమైనా గ్రాఫిక్స్ డిజైనర్లా, కంటెంట్ క్రియేటర్లా? అని ప్రశ్నించారు. మొత్తం ప్రభుత్వానికి ఫేక్ డిజిటల్ వాసన వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఆధారాలు లేకుండా ఏదీ మాట్లాడనని స్పష్టం చేశారు. ప్రజందరికీ ఒకే రూల్ ఉండాలన్నదే మా ఉద్దేశమని చెప్పారు. పేదలను కొట్టి పెద్దవాళ్లకు భూములు పంచుతామంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మూసీ ప్రక్షాళనతో ప్రయోజనం ఏంటో చెప్పాలి? అటు మూసీ ప్రక్షాళన పేరుతో ప్రజాధనం దోపిడీకి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని కవిత అన్నారు. రెండు రోజుల క్రితం ప్రభుత్వం ఇచ్చి న ప్రజెంటేషన్ లో ఎక్కడ కూడా మూసీ ప్రక్షాళన కారణంగా జరిగే మేలు ఏంటో చెప్పలేదని గుర్తు చేశారు. ప్రపంచ బ్యాంక్ కు తాకట్టు పెట్టేందుకే ఈ ప్రాజెక్ట్ చేపట్టారని గతంలోనే తాను అసెంబ్లీలో చెప్పానని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ప్రజెంటేషన్ లో ఫేజ్ 1 కే దాదాపు 6 వేల 5 వందల కోట్ల నుంచి 7 వేల కోట్లు ఖర్చు అవుతుందని ఇచ్చారని.. కానీ ఆరు నెలల క్రితం మాత్రం 5, 641 కోట్లు అని చెప్పారన్నారు. ఆరు నెలల్లో 14 వందల కోట్లు ఎందుకు పెరిగిందో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పైగా ఈ ప్రాజెక్ట్ లో ఎస్టీపీల నిర్మాణం, మూసీలో మురుగు నీరు కలిసే 16 నాలాల ప్రస్తావన, పరిహారం గురించి మాట్లాడలేదని అన్నారు. అంటే వాటికి అదనంగా ఖర్చు చేయబోతున్నారని విమర్శించారు. ఇంత చేస్తే అసలు ఈ ప్రాజెక్ట్ ద్వారా ప్రజలకు ఏం మేలు జరుగుతోందన్నది ప్రభుత్వం చెప్పలేకపోతుందన్నారు.

*** వెలుగుమట్ల సమస్యపై ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ..**

వెలుగుమట్లలో ప్రభుత్వం 750 ఇళ్లను కూల్చేసి అందులో సగం మందికి కూడా న్యాయం చేయలేదని కవిత ఆరోపించారు. బాధితుల ఇళ్లు కూల్చిన తర్వాత తాను విశారదన్ మహారాజ్ చేసిన నిరవధిక దీక్షతో ప్రభుత్వం స్పందించిన విషయాన్ని గుర్తు చేశారు. ఐతే 350 కుటుంబాలకే పట్టాలు ఇస్తామని ప్రకటించి ఇప్పుడు వారిలో సగం మందికి కూడా ఇవ్వటం లేదని తమ దృష్టి వచ్చిందని చెప్పారు. అక్కడున్న 31 ఎకరాలతో పాటు మరో 30 ఎకరాల భూదాన్ ల్యాండ్ ను ప్రభుత్వం పెద్దవాళ్లకు ఇచ్చే కుట్ర చేస్తుందని ఆరోపించారు. ఈ మొత్తం వ్యవహారంపై ఈ నెల 17 న ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ వేస్తామని చెప్పారు. వెలుగుమట్లలో బాధిత కుటుంబాలు అందరికీ న్యాయం జరిగే వరకు వారికి ధర్మ సమాజ్ పార్టీ, జాగృతి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

## ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూను వెంటాడి చంపుతాం.. ఇరాన్ వార్నింగ్..

ఇరాన్ ,మార్చి 15: ఇరాన్ యుద్ధం రోజు రోజుకు తీవ్రమవుతోంది. యుద్ధం ప్రారంభమై 16 రోజులకు చేరింది. ఇజ్రాయిల్, అమెరికా ఇరాన్‌పై దాడులు చేసిన తొలిరోజే ఆ దేశ సుప్రీంలీడర్ అయతొల్లా అలీ ఖమేనీని చంపేశారు. దీంతో ఇరాన్ ప్రతీకారేచ్ఛతో రగిలిపోతోంది. ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూను చంపేస్తామని ఇరాన్ ఆదివారం ప్రతిజ్ఞ చేసింది. "ఈ పిల్లలను చంపే నేరస్థుడు బతికే ఉంటే, మేము అతనిని పూర్తి శక్తితో వెంబడించి చంపుతూనే ఉంటాము" అని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఇజ్రాయిల్ ఇరాన్‌పై జరిపిన దాడుల్లో 160 మందికి పైగా స్కూల్ స్టూడెంట్స్ చనిపోయారు. మినాబ్ నగరంలోని స్కూల్‌పై జరగడంతో ఈ దుర్ఘటన జరిగింది. నెతన్యాహూ ఎక్కడ ఉన్నాడు, ఆయన మరణించారా? అని సోషల్ మీడియాలో అనుమానాలు వస్తున్న తరుణంలో ఇరాన్ నుంచి ఈ ప్రకటన వచ్చింది. ఇటీవల నెతన్యాహూకు సంబంధించిన ఒక వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆ వీడియోలో నెతన్యాహూ చేతికి ఆరు వేళ్లు ఉన్నట్లు కనిపించింది. దీంతో ఈ వీడియోను ఏఐతో ఎడిట్ చేశారని, నెతన్యాహూ చనిపోయారంటూ వార్తలు వచ్చాయి. అయితే, తమ నాయకుడు బతికే ఉన్నాడని ఇజ్రాయిల్ స్పష్టం చేసింది. నెతన్యాహూపై వస్తున్న ఊహాగానాలను ఇజ్రాయిల్ ప్రధాని కార్యాలయం కొట్టిపారేసింది.



## మోగిన ఎన్నికల నగారా.. 4 రాష్ట్రాలు, పుదుచ్చేరి ఎన్నికల తేదీలు ప్రకటన.

దేశంలో మరోసారి ఎన్నికల నగారా మోగింది. నాలుగు రాష్ట్రాలు తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్, అస్సాం, కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలకు ఆదివారం కేంద్రం ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ఎన్నికల తేదీలను ప్రకటించారు. ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి ఢిల్లీలో విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఎన్నికల షెడ్యూల్ ముందు పార్టీ నేతలతో, చీఫ్ ఎలక్టోరల్ అధికారులు, డీజీపీలు, జిల్లా కలెక్టర్, ఎస్పీలు, నోడల్ అధికారులతో భేటీ జరినట్లు చెప్పారు. నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో మొత్తం 17.4 కోట్ల మంది ఓటర్లు ఉన్నట్లు సీఈసీ చెప్పారు. అర్హత కలిగిన ప్రతీ వ్యక్తిని ఓటర్ల జాబితాలో చేరుస్తామని చెప్పారు. అక్రమ ఓటర్లను తొలగించడానికి సర్ ప్రక్రియ చేపట్టినట్లు వెల్లడించారు. ఓటర్ల అవగాహన కోసం అధికారులు, యువ ఓటర్లతో మాట్లాడినట్లు తెలిపారు. ఓటింగ్ పారదర్శకంగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఈ ఎన్నికల కోసం 2.19 లక్షల పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసినట్లు ఈసీ చెప్పింది. దీని కోసం 25 లక్షల మంది ఎన్నికల అధికారుల్ని నియమించారు. 15 లక్షల పోలింగ్ సిబ్బంది, 8.5 లక్షల మంది భద్రతా సిబ్బంది ఉన్నారు.

## ఆత్మ శుద్ధి చేసుకునే పండగే రంజాన్ : సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 15(భారత శక్తి): కేవలం పండుగ కాదని.. ఆత్మ శుద్ధి చేసుకునే సమయమని సీఎం రేవంత్ రెడ్డి (CM Re vanth reddy) అన్నారు. ప్రభుత్వం తరపున ఇఫ్తార్ విందు (Iftar party) ఏర్పాటు చేసినందుకు సంతోషంగా ఉందన్నారు. ఆదివారం సాయంత్రం ఎల్బీ స్టేడియం (LB Stadium) లో ఏర్పాటు చేసిన విందులో ఆయన పాల్గొని ప్రసంగించారు. సోదరభావం ఉండి మతసామరస్యానికి పాటుపడాలని సూచించారు. తమ ప్రభుత్వం ముస్లింలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. అజరుద్దీన్ కు మంత్రి పదవి, సీనియర్ నేత షబ్బీర్ అలీకి సలహాదారు, 8 మంది మైనారిటీ నేతలకు కార్పొరేషన్ పదవులు ఇచ్చినట్లు గుర్తు చేశారు. అలాగే క్రికెటర్ సిరాజ్ కు డీఎస్పీ ఉద్యోగం ఇచ్చినట్లు పేర్కొన్నారు. బాక్సర్ నికిత్ జరీన్ కు 2 కోట్ల రూపాయలు ఇచ్చి ప్రోత్సహించామని వివరించారు.

**మైనారిటీలకు సింహ భాగం..**

ప్రభుత్వ ప్రతి కార్యక్రమంలో మైనారిటీలకు సింహభాగం ఇస్తున్నట్లు తెలిపారు. అందరం కలిసి మెలిసి దేశాన్ని ముందుకు తీసుకుపోవాలని కోరారు. వైఎస్ హయాంలో మైనారిటీలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించినట్లు గుర్తు చేశారు. రిజర్వేషన్ల వల్ల అనేక మంది ఉద్యోగాలు పొందినట్లు వెల్లడించారు. ఈ ప్రభుత్వం మీది, నేను మీ సోదరుడిని. మీ ఆశీస్సులు ప్రభుత్వానికి కావాలి అని అన్నారు. కొందరు మతాల మధ్య చిచ్చు పెట్టడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కలిసి మెలిసి తెలంగాణను ముందుకు తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు.

# నామిశ్రీ ఆరియాలో ప్లాట్లు కొంటే మోసపోవాల్సిందే..!

**హైదరాబాద్, మార్చు 15 (భారత శక్తి) : (ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ పూర్తి ఆధారాలతో అందిస్తున్న ప్రత్యేక కథనం)**

అటవీ భూమిని కాపాడాల్సిన అధికారులే ఆక్రమణదారులకు కొమ్ముకాస్తున్నారు. ఏకంగా రూ. వెయ్యి కోట్లకు పైగా విలువ చేసే ప్రభుత్వ, అటవీ భూములను ఓ బడా నిర్మాణ సంస్థ కబ్జా చేసి, ఆకాశహర్మ్యాలను నిర్మిస్తోంది. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తట్టి అన్నారంలో నమిశ్రీ (సమీశ్రీ) సంస్థ చేపట్టిన 'అరియా' ప్రాజెక్ట్ వెనుక సాగుతున్న అక్రమాల చిట్టా ఇప్పుడొకటి బయటపడింది. అటు రెవెన్యూ, ఇటు ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌ను, మున్సిపల్ రెవిన్యూ నిబంధనలను లెక్కచేయకుండా.. ఏకంగా నకిలీ పత్రాలతో హెచ్ఎండీఏ నుంచే పర్మిషన్లు కొట్టేయడం వెనుక సాగిన 'అక్రమ బాగోతం' ఇప్పుడు అధికార యంత్రాంగం వైఫల్యానికి అద్దం పడుతోంది.

**అనుమతులు ఒకచోట.. కబ్జా మరోచోట**

* RERA రిజిస్ట్రేషన్ నంబర్: 02400061375
* HMDA బిల్డింగ్ పర్మిషన్ (BP) నంబర్: 001610/BP/HMDA/0341/g1/GHT/2023

నమిశ్రీ సంస్థ అరియా ప్రాజెక్ట్ పేరుతో సర్వే నంబర్ 121లో 24,827 చదరపు మీటర్లకు అనుమతులు పొందింది. కానీ, అక్కడ ఉన్నది కేవలం 2 ఎకరాల 35 గుంటల భూమి మాత్రమే. నిబంధనల ప్రకారం నిర్మాణానికి ముందు రెవెన్యూ స్కెచ్, నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (NOC) తప్పనిసరి. అయితే, ఈ సంస్థ రెవెన్యూ అధికారుల కళ్లు గప్పి, పక్కనే ఉన్న సర్వే నంబర్ 117/6 (అటవీ భూమి) లోని 4 ఎకరాలు, సర్వే నంబర్ 122లోని మరో 2 ఎకరాలను తన ప్రాజెక్టులో కలిపేసుకుంది. అవినీతి తప్పిదానికి సూత్రధారులు హెచ్ఎండిఏ టౌన్ ప్లానింగ్ అధికారులు మరియు హెచ్ఎండిఏ రెవిన్యూ అధికారులు.

పోలీసులకు దొరికినా.. అధికారులు నిద్ర మత్తులో! ఈ అక్రమాల్లో ఫోర్జరీ పత్రాల వాసన రావడంతో ఆర్డీఓ విచారణ చేపట్టి, అసలు బండారాన్ని బయటపెట్టారు. సి. అమరేందర్ రెడ్డి, పి. ధర్మవీర్ రెడ్డిపై ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. అయినా సరే, నిర్మాణ పనులు మాత్రం ఆగలేదు.

* ప్రశ్నార్థకమైన మౌనం: 2025, జూన్ 18నే 'ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ ఉమెన్ రైట్స్' సంస్థ హెచ్ఎండీఏ కమిషనర్ నుంచి జిల్లా కలెక్టర్ వరకు అందరికీ ఆధారాలతో సహా ఫిర్యాదు చేసింది.







* అధికారుల ముడుపులు: ఇంత జరుగుతున్నా.. నాగోల్ సర్కిల్ కమిషనర్ రవీందర్ రెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారి మధు, ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ పాటిల్ ఎందుకు మౌనంగా ఉన్నారు? వీరి పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భారీగా ముడుపులు అందడం వల్లే అక్రమ నిర్మాణాలను చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**మధ్యతరగతి జనం నిండా మునిగేనా?**


ఈ ప్రాజెక్టుపై ఇప్పటికే వందల కోట్ల బ్యాంకు రుణాలు మంజూరయ్యాయి. అమాయక కస్టమర్ల నుంచి లక్షలాది రూపాయల అడ్వాన్స్‌లు వసూలు చేశారు. రేపు ప్రభుత్వం ఈ అనుమతులను రద్దు చేస్తే, ఆ బాధ్యత ఎవరిది? రిజిస్ట్రేషన్లు ఆపకుండా అక్రమాలకు సహకరిస్తున్న సరూర్నగర్ సబ్ రిజిస్టర్ కార్యాలయ తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

* **నిబంధనల ఉల్లంఘన - అధికారుల నిర్లక్ష్యం:**


రెవెన్యూ, ఇరిగేషన్, ఎయిర్‌పోర్ట్ అథారిటీల NOCలు లేకుండా, రెవెన్యూ స్కెచ్ లేని ప్రాజెక్టుకు అనుమతులు ఎలా ఇచ్చారు? అక్రమాలు జరుగుతున్నాయని ఏడాదిగా ఫిర్యాదులు అందుతున్నా.. ఎందుకు చర్యలు తీసుకోలేదు? దీనిపై ఉన్నతాధికారులు స్పందించాలి.

**మరిన్ని ఆధారాలతో తదుపరి కథనంలో....**




# పరిసరాల పరిశుభ్రతపై అందరూ దృష్టి పెట్టాలి



* **ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశం**

ఎల్బీనగర్, మార్చి 15 (భారత శక్తి): కాలనీలలో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యను ఎప్పటికప్పుడు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం ఎల్బీనగర్ జోన్ సరూర్ నగర్ సర్కిల్ 12 లో జరిగిన కార్యక్రమంలో కమీషనర్ పాల్గొన్నారు. ఆర్కేపురం డివిజన్ టెలిఫోన్ కాలనీ, ఎన్టిఆర్ నగర్ డివిజన్ చిత్ర లేఅవుట్ లో పర్యటించారు. టెలిఫోన్ కాలనీ ఆర్చి నుండి ప్రత్యంగిరా వారాహి ఆలయం వరకు కాలినడకన పర్యటించారు. రోడ్డువెంట ఉన్న చెత్తను పరిశీలించి శుభ్రం చేయాలని ఆదేశించారు. నివాసాలు, అపార్ట్ మెంట్ లలో నివసించే యజమానులు తమ నివాసాల ముందు ఏర్పాటు చేసుకున్న గ్రీనరి గ్రిల్స్ వద్ద చెత్త లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈవిషయం యజమానులకు వివరించాలని శానిటేషన్ అధికారులను ఆదేశించారు. వ్యాపార దుకాణాల ముందు పడేసిన చెత్తను దుకాణ యజమానులే తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం చిత్రా లేఅవుట్ లో కాలనీ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. కాలనీలో ఉన్న ఈ వేస్ట్ ను తమ అధికారులు ఏర్పాటు చేసిన కేంద్రానికి తరలించి సహకరించాలని కాలనీవాసులకు సూచించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికను పగడ్బందీగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్, శానిటేషన్ డి ఈ ఈ చందన, రాంకీ సెక్టార్ హెడ్ వేణు కుమార్, ఎల్బీనగర్ జోన్ ఇంచార్జి భరత్ ఎస్ఎస్ గద్దల బుచ్చయ్య, ఎస్ఎఫ్ఏ లు, రాంకీ సిబ్బంది దిలీప్ రెడ్డి కాలనీవాసులు పాల్గొన్నారు.



వనస్థలిపురం సీఐ ఎస్. రవి బాబు



సరూర్ నగర్ సీఐ ఎన్. శ్రీశైలం

రూర్ నగర్, వనస్థలిపురం పోలీస్ స్టేషన్ల ఇరువురు సీఐలు సైదిరెడ్డి, మహేష్ బదిలీ అయ్యారు. వారి స్థానాలలో కొత్త స్టేషన్ హౌజ్ ఆఫీసర్లుగా సరూర్ నగర్ సీఐగా మల్కాజిగిరి డిఐగా పని చేసిన ఎన్. శ్రీశైలం, మల్కాజిగిరి స్పెషల్ బ్రాంచ్ సీఐగా చేసిన ఎస్. రవిబాబు వనస్థలిపురం సీఐగా పదవీబాధ్యతలు చేపట్టారు.

ఎల్బీనగర్, మార్చి 15 (భారత శక్తి):

# 'గ్యాస్' అక్రమంగా విక్రయిస్తే భారీ జరిమానా, కేసు నమోదు

* **రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కే.చంద్రారెడ్డి హెచ్చరిక**
* **సరూర్ నగర్ తహసీల్దార్ కార్యాలయంలో జిల్లాస్థాయి అధికారుల సమావేశం**






ఎల్బీనగర్, మార్చి 15 (భారత శక్తి): రంగారెడ్డి జిల్లాలో గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ల, వాణిజ్య గ్యాస్ సిలిండర్ల సరఫరాపై ప్రజలు ఆందోళన చెందవద్దని, గ్యాస్ ఏజెన్సీలు సిలిండర్లను అక్రమంగా విక్రయిస్తే భారీ జరిమానాతోపాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కే. చంద్రారెడ్డి హెచ్చరించారు. సరూర్ నగర్ తహసీల్దార్ కార్యాలయంలో శనివారం జిల్లా స్థాయి అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ...అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధం భారతదేశంలో పెట్రో ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. ముఖ్యంగా గ్యాస్, ఇతర పెట్రో ఉత్పత్తుల రవాణా తగ్గినా...దేశంలో అవసరాలకు తగినంత గ్యాస్ నిల్వలు ఉన్నాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఆటంకం లేకుండా ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టినట్లు వివరించారు. రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో ఉన్నతాధికారులతో ప్రత్యేక మానిటరింగ్ కమిటీ ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఇంధన సరఫరా మానిటరింగ్ కమిటీ ఉందని, జిల్లాలో ఎక్కడా గ్యాస్ సిలిండర్ల కొరత లేదని, ప్రజలకు సరిపడినంత గ్యాస్ సిలిండర్ల సరఫరా చేయడానికి మానిటరింగ్ కమిటీ చర్యలు తీసుకుంటుందని చెప్పారు. జిల్లాస్థాయి కమిటీలో అదనపు కలెక్టర్ చైర్మన్ గా, డీఎస్వో కన్వీనర్ గా, ఎస్పీ లేదా సీపీ (పోలీస్ కమిషనర్), రెవెన్యూ అదనపు కలెక్టర్, రీజినల్ మేనేజర్, డీటీవో, డీఎం హెచ్ వో, డీఏవో, డీపీ ఆర్వో, సంక్షేమ శాఖల అధికారులు, గ్యాస్ ఏజెన్సీలు సభ్యులుగా ఉన్నారని తెలిపారు. ఇంధన లోటు లేకుండా కంట్రోల్ రూమ్ సైతం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కమిటీ ముఖ్యంగా గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రజలకు సరిపడా గ్యాస్ అందజేయడానికి చర్యలు తీసుకుంటుందని వివరించారు. కమిటీ సభ్యులు జిల్లాలోని గ్యాస్ ఏజెన్సీలను సందర్శించడం, బ్లాక్ మార్కెట్ లో గ్యాస్ సిలిండర్ల విక్రయాలు అడ్డుకోవడం, గ్యాస్ నిల్వలపై తనిఖీలు, పోలీసుల సహకారం, విజిలెన్స్ తనిఖీలు, ప్రజలను అప్రమత్తం చేయడం తదితర విధులు నిర్వహిస్తారని అదనపు కలెక్టర్ వివరించారు. గ్యాస్ ఏజెన్సీలు సిలిండర్లను అక్రమంగా విక్రయిస్తే జీవో 5 ప్రకారం, బీఎన్ఎస్ 6ఏ, 7, 1955 చట్టం ప్రకారం భారీ జరిమానా, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ దవాఖానలు, ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూల్స్, గృహ వినియోగదారులకు ఎల్పీజీ గ్యాస్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సిలిండర్లు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. గ్యాస్ ఏజెన్సీలు తమ నిర్వాహణను పక్కాగా నిర్వహించాలని, డెలివరీ బాయ్స్ పై నిఘా పెట్టాలని, గ్యాస్ బుకింగ్ లో సమస్యలు లేకుండా చూసుకోవాలని అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి సూచించారు. సమావేశంలో కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి, డీ ఎస్ వో వనజతరెడ్డి, ఏఎస్ వో పుల్లయ్య, డీఎం హెచ్ వో లలితాదేవి, రంగారెడ్డి డీటీసీ సదానందం, ఎమ్మార్వో వేణుగోపాల్, ఇన్ చార్జి డీపీ ఆర్వో బాలీశ్వరి, ఏసీఎస్ వో పుల్లయ్య, ఎల్పీజీ గ్యాస్ డీలర్స్, రెవిన్యూ, సివిల్ సప్లై సిబ్బంది పాల్గొన్నారు.

# మజీద్ లో రంజాన్ తోఫాల పంపిణీ

ఎల్బీనగర్, మార్చి 15 (భారత శక్తి) : రాబోయే రంజాన్ పండుగ సందర్భంగా సరూర్నగర్ వివిఎం హోమ్ మజీద్ ఈ మొత్య నిజామత్ జంగ్ లో నిర్వహించిన కార్యక్రమంలో అధ్యక్షుడు మహమ్మద్ జైనాలోద్దిన్ రంజాన్ తోఫాలు అందించిన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఆనందోత్సాహాల మధ్య పండుగను జరుపుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్లు మహమ్మద్ ఇస్తా గుల్నాని,



మహమ్మద్ జహంగీర్, మహమ్మద్ సమీ ఉద్దీన్, జనరల్ సెక్రెటరీ మహమ్మద్ ఖాజా మొయినుద్దీన్, జాయింట్ సెక్రెటరీలు అల్తాఫుద్దీన్, మహమ్మద్ జియావుద్దీన్ ఉబైద్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ షేక్ రఫీ, మహమ్మద్ అజార్ అహ్మద్, జకార్ హుస్సేన్ అడ్వైజరీ కమిటీ మెంబర్ పాల్గొన్నారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.